# నమక మంత్ర సారము

ఆంధ్రానువాదము (పద్యములు)

టీకా తాత్పర్య విమర్శనలతో



నండూరి లక్ష్మీనరసింహారాయ కవి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# నమక మంత్ర పాఠము

ఆంధ్రానువాదము (పద్యములు)

టీకా తాత్పర్య విమర్శనలతో

గ్రంథకర్త :

## నందూరి లక్ష్మీనరసింహోరాయ కవి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2008

# NAMAKA MANTRA PATAMU

*By*

**NANDURU LAKSHMEENARASIMHARAYA KAVI**

T.T.D. Religious Publications Series No: 764

© Copy Rights Reserved


First Edition : 1961


TTD Edition : 2008

Copies : 2000

*Published by:*
**Sri K.V. Ramanachary**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.







గ్రంథకర్త :

నందూరి లక్ష్మీనరసింహారాయకవి

## ద్వితీయ ముద్రణ

మా పితామహులు బ్రహ్మశ్రీ నందూరి లక్ష్మీనరసింహారాయ కవీంద్రులు 1961వ సంవత్సరములో ప్రచురించిన నమకమంత్ర పాఠమును గ్రంథరాజప్రతులు పుస్తక విక్రయశాలలో లభ్యమగుటలేదని, మాకడనున్నచో పంపించమని గత దశాబ్ద కాలంగా పలువిన్నపముల నందుకొని మా వద్ద యున్నంత వరకు ప్రతుల నొసగితిమి. ఇంకనూ వచ్చుచున్న విజ్ఞాపనల దృష్ట్యా ద్వితీయ ముద్రణ తప్పనిసరియయ్యెను. ఈ విషయమై తిరుమల తిరుపతి దేవస్థానముతో సంప్రదించ వారీగ్రంథ తదుపరి ముద్రణ బాధ్యతలు స్వీకరించ సంసిద్ధత వ్యక్తపరచిరి. పర్యవసానముగ గ్రంథ సర్వహక్కులు తి.తి.దే. న కొసగితిమి. పదుగురీ గ్రంథము నుపయోగించు కొనవలెనను మా పితామహుల యాశయసిద్ధికై వారి వారసునిగ నా బాధ్యతను నిర్వర్తించుట నా మహాభాగ్యము. తి.తి.దే.నకు నా కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

సర్వేజనాస్సుఖినో భవంతు.

1-9-1113/31,
విద్యానగర్, హైదరాబాదు - 500 044.

భవదీయుడు,
**ఆచార్య డా॥ నందూరు గోవిందరావు**
14-05-2008

ఓం

**RAJ BHAVAN**
**UTTAR PRADESH**

లక్నో
10-12-61.

మహారాజశ్రీ నండూరి లక్ష్మీనరసింహారాయ కవిగారి సన్నిధికి.

ఆర్యా, మీరు నాకు వ్రాసిన లేఖలను, దయతో పంపించిన నమక మంత్రపాఠము అను గ్రంథప్రతిని కృతజ్ఞతా పూర్వకముగ నందుకొంటిని. శ్రీ లక్ష్మీకాంత యోగీంద్రుల ప్రేరేపణచే రెండు నెలల స్వల్పావధిలో శ్రీరుద్రాధ్యాయమందలి ముఖ్య భాగమగు నమక మంత్రమునకు పద్యానువాద మొనర్చి టీకాతాత్పర్య విమర్శలతో ప్రచురించుటకు సిద్ధమొనర్చిన మీకు నాయభివందన పూర్వక నమోవాకములు. మంత్రార్థ జ్ఞానవిహీనమగు వేదపారాయణ పఠనమును మాధవవిద్యారణ్యులే తమ విమర్శనా పూర్వకమగు ప్రస్తావన యందు గాడిద చందనపు కఱ్ఱలను మోసికొని పోవుటతో పోల్చియున్నారు. ఐనను అర్థజ్ఞానము లేక యున్నను పఠనమాత్రముననే నించుకయైన మంత్ర శక్తి లభించునవకాశము గలదని గౌణముగా నట్టి పద్ధతిని బొత్తుగా నిరసింపక వదలినారు. ఐనను ధర్మపరాయణతను నీతిమార్గములను భగవద్భక్తి ప్రచోదితములగు నుపాసనా పద్ధతులను గూడ కేవల బౌద్ధికములగు తర్కనికషోపములపై సానఁబట్టి చూడకయే విశ్వసింపని రోజులలో కనీసము మన నిత్య పూజానుష్ఠాన భాగములగు పురుష సూక్త శ్రీసూక్త మంత్రపుష్పాదులు నమకచమక రుద్రాదులు పాఠకుల కేని యర్థముగాని పద్ధతిలో పఠింపఁ బడుచుండుట శోచనీయమే. ఈ పరిస్థితిని చక్కఁ బెట్టుటకై విజ్ఞులగు పండితులు దేశభాషలలో సులభగ్రాహ్యమగు రీతిని యనువదించి ధారాళముగా ప్రచారములోనికి తీసికొనివచ్చుట ఎంతేని యవసరమని చెప్ప నవసరము లేదు. అందులో వచన టీకాతాత్పర్య విమర్శనలే గాక పద్యానువాదమును మృదుమధుర శైలిలో జతపఱచినచో బంగారమునకు వెలిగారముతో మెఱుగుదిద్దినట్లుండును. మీ ఈ రచన యాకోవకుఁ జెందినదే. నేను వేదశాస్త్ర పాండిత్య విహీనుఁడను కవితావాగ్విలాస సంపదయు కలిగినవాడను కాను. ఐనను మీరు దయతో నాయభిప్రాయము నర్థించినందున నాసదభిప్రాయమును, శుభాకాంక్షలను మీ కందఁజేయుచున్నాను. శ్రీ శ్రీ మేధాదక్షిణామూర్తి స్వామికి కృతిని సమర్పించుచున్న మీకు నాయభినందనలు. నమోవాకములు. శ్రీ స్వామివారి యొక్కయు, శ్రీ గాయత్రీ మాత యొక్కయు కరుణాకటాక్ష వీక్షణలచే మీరాయురారోగ్యైశ్వర్యాదులగు సర్వసంపదలనేగాక మీరభిలషించిన "ముక్తి ద్వారపుతలుపులును" మీకు దెఱచియుండు సౌభాగ్యమును బడయుదురుగాక!

ఇట్లు భవదీయుఁడు
బూర్గుల రామకృష్ణరావు, గవర్నరు.

## శైవభావన

### భార్గవ విద్యాదేవ కులపతి

రుద్రభావన స్వస్పందసుందరమై ఒక విచిత్రశక్తి స్వీకరణ. అవిద్యామగ్నుఁడైన మానవుఁడు ప్రజ్ఞప్తిని సాధించుటకు ఏ శక్తి అవసరమో ఆ స్ఫూర్తిని శతరుద్రీయము ఇచ్చును. తత్ప్రసాదసమాసాదితమైన ఏ మహాభావము కలదో, ఆ పరమశ్రీ ప్రకృతిపథ సంచారులకు రసానందసంవిత్ప్రతీకసిద్ధ సిద్ధిప్రకామన భావించు వ్యక్తులును సంభావింపదగిన ఒక సంధాన విశేషము ఈ శబ్దసంవిధానమునకు కలదు. దానినే మహర్షులు సాధించిరి. దర్శించిన ఆ దర్శన ఫలము అనుభవించు అవకాశము మనకు కలదు. అనుభవించుట, అనుభవించక పోవుట మన అదృష్టము, పూర్వకర్మ ఫలం మాత్రమే కాక అద్యతన సాధనాస్వరూపమును.

ఇంద్రేశ్వరుల అభేదభావమును భావించిన భావుకులలో శ్రీకావ్యకంఠ గణపతిమునులొకరు. మహేంద్ర మహేశ్వర, రుద్రసంక్రందన పురభిత్, ఉగ్ర ఈశానభీమాది బహుశబ్దమహార్థములను చర్చించి వైద్యుత తేజోరూపత్వ మరుద్భూత పతిత్వ దుష్టసంహారకత్వ మృత్యుంజయత్వాది వివిధతత్త్వములను భావించి రుద్రుడు మహాప్రాణము, ఇంద్రుఁడు తదధిదైవతము అని అందించిరి.

వేదవాఙ్మయములో బహుధాభావితుఁడైన ఇంద్రుఁడే తరువాతి తంత్రవాఙ్మయములో ఈశ్వరుఁడైనాఁడని అభిజ్ఞుల ఊహ. శివమంత్రతంత్ర సంధాతలు ఈ విషయము హృదయగతము చేసికోవలసిన అవసరము కలదు. నమక మంత్రపాఠము ఆదికాలము నుండి తపస్విలోకము దర్శించిన ఒక శుభాలోకము. శివభావనాప్రేరితమైన మనస్సు అఖండ శక్తి శాంతులను సాధింపఁగలదు. శ్రీ నండూరి లక్ష్మీ నరసింహారాయకవివర్యులు తపస్సులో గీర్వాణమున బలసిన రుద్రుఁడు తెనుగుమీరినాఁడు. పంచాక్షరనేత చతురామోద సమ్ముగ్ధుఁడైనాడు. వేదసంస్కృతము వేరు. పురాణకావ్య సంస్కృతము వేరు. ఈ భిన్న శబ్దప్రయోగము కొంతపరిమితిని అనుసరించి ప్రయోగింపఁబడినది. పురాణకావ్యాదులను అనువదించుటకన్న వేదమును అనువదించుట అసాధ్యమనను గాని, బహుకష్టసాధ్యమనుటకు సందేహింపను. అందును పద్యానువాదము కష్టతరము. ఇంత శ్రమకులోనైన కవివర్యులు వేదవాఙ్మయమునకు గౌరవము తగ్గుచున్న కాలములోనుండుట కొందరి యదృష్టము, కొందరి దురదృష్టము. ఆ మార్గమునందు ఆసక్తులగువారి సౌకర్యమునకై సులభవివరణము, ప్రయోగవిధానము, ఇపరీతి మొదలైన సర్వ విశేషములతో గ్రంథకర్త అందించుట మరింత గ్రంథ ప్రదీప్తికి వన్నె తెచ్చినది. సుప్రసిద్ధులైన శ్రీ లక్ష్మీకాంత యోగివర్యులు దీనికి కారకులగుట దివ్యానుగ్రహసూచకము. ఈ గ్రంథము ప్రజాపండితభావితము కావలెనని నా భావన.

"గ్రంథగ్రంధి సమాకారం వేదవాఙ్మయ దర్శనం
సదాభావ్యం సదాసేవ్యం నృసింహకవి భావితం
విమర్శాదిక సంధానైః టీకాతాత్పర్య రీతిభిః
కృత్వానువాద మత్యంతం కృతకృత్యోన భవత్కవిః
లక్ష్మీకాంత మహానందయోగీంద్ర హృదయంగమం
వర్ధతాం వర్ధతామేతత్ కావ్యం మంత్రార్థవైభవం
కృతిర్జయతు లోకేషు భావితాచ ప్రశంసితా
విద్యాదేవకులేంద్రేణ భార్గవేణ తపస్వినా ॥"

భవదీయ :

**భార్గవవిద్యా దేవకులపతి, గుంటూరు.**

## Kalluri Chandramouli (B.Sc. Agri. Abdn.)

Minister for Religious Endowments & Co-operation.

Govt. of Andhra Pradesh, Hyderabad.

“శ్రీ నమక మంత్రపాఠము అను సంస్కృత గ్రంథమునకు పద్యగద్యమున పండిత నండూరి లక్ష్మీనరసింహారాయ కవి గారు అనువదించిరి. భాష సరళము, పోకడ సహజము. కవిప్రతిభ ప్రస్ఫుటము. సామాన్య పాఠకులకును తేటతెల్లముగ గ్రాహ్యము. చదువుచున్న కొలదియు పాఠకుల హృదయమును ద్రవింపజేసి మాధుర్యము నందించును. రసము నుప్పిల్లజేసి పాఠకులకు శ్రోతలకు ఆనందము నందఁజేయును ఇట్టిసద్గ్రంథము ఆంధ్ర లోకమున కెంతయు సేవనొనర్చుననుట అతిశయోక్తి గాఁజాలదు. ఆంధ్రప్రజలీ గ్రంథము నాదరించి, తమ కభిమానపాత్ర మొనర్చుకొందురని ఆశించుచున్నాను.

ఈ గ్రంథమును వెలువరించిన కవిగారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

కల్లూరి చంద్రమౌళి

17-1-62

అయ్యా

తా మత్యంతవాత్సల్యముతో పంపిన నమక మంత్రపాఠ ఆంధ్రానువాద గ్రంథమును భక్తితో జదివితిని. ఇయ్యది ఆస్తిక మతావలంబకులగు భక్తులకు ఆదరణీయమైన పట్టుకొమ్మ. సాంస్కృతమునకొక వినూత్న మనోహరవిశిష్టసృష్టి మీకవితాధార, ఈశ్వరు జటాజూట నిర్గతానర్గళ గంగాతరంగిణీ వలె నాంధ్రలోకమును పునీతముగావించినది.

ఇట్టిదానిని సాంప్రదాయము చెడకుండా తెనుఁగులోనికి పద్యరూపముగా తెచ్చుటయన్న సామాన్యమైన కార్యము కాదు. ఇదియొక కథగాదు చేతికివచ్చినట్లు వ్రాయుటకు. ఎన్నో విధముల సూక్ష్మదృష్టి, ఎంతో అవధానదృష్టి కుదిరినగాని శక్యముగాదు.

మీ యనువాదము రమణీయముగా నున్నది. దీనికి మోక్షలక్ష్మీ ప్రసాదమే అనువదును. "రక్తంపుంబటువైనలేదు" అనుపద్యములో మీ త్యాగబుద్ధి తెలియుచున్నది. మీకవితా శైలి ద్రాక్షాపాకము. వ్యర్థపదరాహిత్యము. ఈ గ్రంథము శ్రీ శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామివారి యొక్కయు, గాయత్రీమాతయొక్కయు కరుణాకటాక్షములచేతను, ఆనందాశ్రమ కర్తలగు శ్రీ లక్ష్మీకాంతానందయోగి గారి ఆశీర్వచన బలము చేతను చిరస్థాయి యగునని నమ్ముచున్నాను.

దేవాలయ తత్త్వదర్శిని,
గ్రంథకర్త,
కొండముది.

ఇట్లు,
కొండముది
లక్ష్మీవేంకట హనుమంతరాయకవి

## నమకపాఠమునందు వాడబడిన అచ్చటచ్చటి కొన్ని పర్యాయ పదముల కర్థములు.

పురశ్చరణము=ప్రారంభమునందు చేయుకర్మ
గాణపత్యము=విఘ్నేశ్వరపూజ
ధూర్వలు=కరికపోచలు
యావకములు=కాయమినుములు
ఆమలకము=ఉసిరిక
తిలలు=నువ్వులు
గుడము=బెల్లము
చరువు=హవ్యము
దధి=పెరుఁగు
మధువు=తేనె
ఘృతము=నేయి
వైకంకతములు=ములువెలగలు
అపామార్గము=ఉత్తరేణు
వ్రీహి=వడ్లు (ధాన్యవిశేషము
యావలు=ఉత్తరాదిని ఫలించునొక
తండులములు=బియ్యము
పింగళవర్ణము=గోరోజనపు వర్ణము
ప్రబ్బలి=పేము (కుపయుక్తమైన అన్నం)
హవిస్సు=అగ్ని యందు వ్రేల్చుట
ప్రాజావత్యకృత్యము=అధికార పూరితమైన ఇష్టివిశేషపు బ్రహ్మకర్మ
అభిచారము= హింసార్థమైన హోమకర్మ
పీత; పచ్చన=(ప్రయోగము)
కపిలవర్ణము= నలుపు కలిసిన చామనచాయ
వణిజుఁడు=వ్యాపారి
తగవరి=మధ్యవర్తి
ఫలాశము=మోదుగు
అపూపములు=బూరెలు (పిండివంట)
అర్కపుష్పము=జిల్లేడు పూవు
రాజయక్ష్మ=క్షయరోగము
అణిమ=లఘుత్వము
గరిమ=శ్రేష్ఠత్వము
మహిమ=మహత్వము
లఘిమ=చులకన
ప్రాప్తి=పొందినది
ప్రాకామ్యము=కీర్తి
ఈశత్వము=ఏలుబడి
వశిత్వము=స్వాతంత్ర్య ప్రాప్తి
ఉశీరము=వట్టివేరు
హరిణము=లేడి
వరాహము=పంది
శశము=కుందేలు
కపింజలము=కౌజుపిట్ట
అనపత్యము=సంతానములేకపోవుట
తంతువు=నూలుపోగు
తంతు=కపటోపాయము
నాడిక=గడియ
ఆహుతి=అగ్ని యందు వ్రేల్చుట
వటవృక్షము=మఱ్ఱిచెట్టు
ప్లక్షవృక్షము=జువ్విచెట్టు
ఔదుంబరము=మేడి
ఖదిరము=చండ్ర

చాంద్రాయనము = చంద్రకళ ననుసరించి హెచ్చుతగ్గులుగా భోజనము సేయు వ్రతము
ఫలాశము=మోదుగుచెట్టు
సోమలత=తిప్పతీగె
గుగ్గులువు=గుగ్గిలము=సాంబ్రాణి
బిడాలము=పిల్లి
ఉత్పలము=చెంగల్వకోష్టు
నారాయందు=నారాయణుండు=పర
వికంకతము=పుల్లవెలగ
శరావము=మూకుడు
స్వర్ణము=బంగారము
పటము=వస్త్రము
అపత్యము=సంతానము
తిర్యక్=అడ్డముగా పోవునది
కుముదము=ఎఱ్ఱతామర, తెల్లకలువ
శ్యామాకము=చామధాన్యము
లాజలు=పేలాలు
శాల్మలి=బూరుగు
వల్మీకము=పుట్ట
ఓదనము=అన్నము
కుక్కుటము=కోడి=కుక్క
శాస్త=బుద్ధదేవుడు; దేశాధిపతి

## భారతదేశ విధానము

స్వాయంభువ మనువుయొక్క తొమ్మండుగురు పుత్రులలోని భరతుండీ భూమిని పరిపాలించినందున దీనికి భారతవర్షమను పేరు వచ్చినది. ఇందు జన్మించినందువననే మనము భారతీయులమైతిమి. దీనిని గూర్చి వ్యాసభగవానులిట్లు వచించెను.

శ్లో॥ ఉత్తరం యత్సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణం

వర్షంతద్భారతం నామ నవసాహస్ర విస్తృతం.

అనగా దక్షిణ సముద్రమునకు ఉత్తరమునను హిమాలయమునకు దక్షిణమునను గల తొమ్మిదివేల యోజనములు గల పరిమాణ భూభాగమే భారత దేశము. మఱియు సంస్కృతవాణి గలదే భారతదేశ మనియుఁ జెప్పెను. భారత దేశమునందు సత్య ధర్మముల కగ్రస్థాన మున్నది. అందువల్లనే సత్యం వద, ధర్మం చర ఇత్యాది వాక్యములు వేదమునం దుండి వినుపించుచున్నవి. గనుక మనది మతముగాదు. (ఒకని మతి ననుసరించినది) ధర్మము. మన పూర్వులా వేదమునందుండియే అనేక విద్యలను లోకకల్యాణము కొఱ కుద్ధరించిరి. యోచించగా విద్యలన్నియు మొదట సంస్కృతమునందుండియే యుద్భవించెనని తేలుచున్నది. ఇందుండియే దైవభక్తి గోచరించుటయు దైవభక్తియే చిత్తశుద్ధికి మూలమగుటయునై "చిత్తశుద్ధి గలిఁగి చేసిన పుణ్యంబు కొంచెమైన నదియుఁ గొదువకాదు"అని చెప్పఁబడినది. పూర్వము విద్య విజ్ఞానము కొఱకును, కృషి కూటికొఱకును ఏర్పడఁగా, నేడు విద్యయే కూటికొఱకుఁగా మాఱినది. ఇది మన ప్రారబ్ధము. ఎవఁడు గాని ఈ యిల్లు నా పూర్వీకమని చెప్పుకొనుటకు వీలుగాక మా పూర్వీకమైన ఇంటిని అమ్ముకున్నాననియు ఇక్కడనే వేఱొక గృహము నిర్మించుకున్నాననియు మీదుమిక్కిలి చాలాకాలము గడచుటచే మా పూర్వస్థాన మేదియో నాకు తెలియదనియు చెప్పుకొను కాలము దాపరించినది. ఇట్లే ఒకరి నివాస స్థానము నొకరు విడచుచు చరజాతులవలె నొకరిస్థావర మొకరు మార్చుకొను కాలమిది. పొట్టకూటికి విద్యా విధానపు మార్గమిది. ఈ స్థితిలో దేవాలయములను తత్ప్రయోజనములను తల పెట్టువా రెవరుంటారు? ఎందుకుంటారు?

## -✦ దేవాలయములు ✦-

"నిటలాక్షు గుడిలేని కొటిక నుండు నతండు - తల్లిదండ్రులకు రెండు దలచునతడు" ఇత్యాది ప్రమాణములచే మన పెద్దలు దేవాలయములేని గ్రామములో భోజనమే చేయువారు గారట.

పంచభూతములయొక్క మూలాంశమే అండాండము. స్థూలాంశమే బ్రహ్మాండము. సూక్ష్మాంశమే పిండాండము. ఇట్టి దేహాలయ ధర్మము ననుసరించియే దేవాలయ ధర్మమును ప్రతిపాదించబడినది. ఇదియే వాస్తు ధర్మము. వస్తువనఁగా భగవంతుడు. లోకాంతరము యందుండు దేవతల యనుగ్రహములను మానవులకు పొందించబడునట్లు చేయు స్థానములే దేవాలయములు. తదాహూయ మానములే మంత్రములు. వీటిని గ్రామదేవతార్చనలని పూర్వులు వచించిరి. దేవాలయము అందు గర్భాలయము ద్వారము గోపురము శిఖరము ధ్వజము మంటపము మేఖలములు అన్నియు వాస్తు శాస్త్ర ధర్మముగా పరస్పర సంబంధముగా నిర్ణయించబడినవే అయియున్నవి. అట్లే ప్రతి దేవాలయము నందును నొక ఘంటయుండును. ఇందు సమస్త ఫలములను దైవికముగా సిద్ధింపఁజేయు నాదశక్తియుండును. ఆగమ శాస్త్రానుగుణ్యముగా దీనిని శుద్ధిజేసి నిర్మించెదరు. దీనిలో ప్రణవధ్వని శాస్త్రసమ్మతముగాను అనుసరణాత్మకముగాను శ్రుతిపర్వముగాను ఉండును. మఱియు గాంధర్వ వేదమునందలి నాదాధ్యాయానుగుణ్యముగాను ఉండును (ఈ వేదమును బ్రహ్మ భరతమహర్షి కుపదేశించెను). మానవుని జ్ఞానము భ్రమ ప్రమాదములకు లోనైనందున సంగీతముకొఱకు జంటవాద్యములోని తుంబురవలె వేదనాదముకొఱకు అనుసరణాత్మకముగా నీ ఘంటానాదమే చెప్పబడినది. ఆ నాదమే ప్రణవప్రమాణము.

దేవాలయములలోని మంత్రాదులన్నియు ఈ ఘంటానాదము ననుసరించియే యుండవలయును. ప్రణవధ్వనియే వేదమునకు ఆధారశృతియగుట వల్ల నాద నియమములేని వాక్కు తేజోవంతముగాజాలదు. అందువల్ల దేవాలయములయందు ఘంటానాదము ననుసరించియే నమక చమకాది మంత్రములుగాని స్తోత్రములు గాని మంత్రపుష్పాదులు గాని అనుష్ఠించినప్పుడే తేజోవంతమై మంత్రదేవతానుష్ఠానమున సంప్రాప్తించు శుభఫలితములను అనుష్ఠించువారల కందిచ్చును. అట్లుగాక డబ్బు కొఱకు అభిషేకాదులలో పాల్గొని అర్థరహితముగా నఱచుచూ తన గొప్పతనమును చూపఱులకు చూపుటకు రొమ్ముబలముతో చేయుగోలలు జాతరలేయగును. ఇట్లు తాము చెడుటయేగాక తమ జాతరకృత్యములచే నితర్లనుకూడా చెడునట్లుచేయువారి నట్లు చేయకుండుడని ప్రార్థింపుచున్నాను. ఒక్కసారి మీరు ఇట్టి నాద నియమానుసారముగా మంత్రపఠనముల నాచరించినచో అందలి యానందము దైవసాక్షాత్కార ఫలితము మీకే విశదముకాగలదు.

అట్టి బ్రహ్మారాక్షస జాతరల వల్లనే మంత్రప్రభావములు తేజోవిహీనములై వాటి ప్రయోజనములను సిద్ధింపఁజేయుట లేదు. అందువల్ల వేద మంత్రములయందు నమ్మిక సన్నగిల్లుచున్నది. కనుక వేద మంత్రములను వల్లించినంత మాత్రముననేగాక శిక్షాశాస్త్ర నాద ప్రాశస్త్యముల గూడ నెఱిగియుండ వలెను.

పూర్వము దేవభాషను సమగ్రముగా నెఱిగిన మనపూర్వులు ఆభాషా మహాత్మ్యముచేతనే దేవతలను వశ మొనర్చుకొన గల శక్తివంతులై యుండిరి. దేవతలను తమ సన్నిధి కాహ్వానించిగాని దేవతలచే దా మాహూయమానులై గాని యథేచ్ఛగా సంభాషణాదులను గూడ జరిపిరి. దేవతానుగ్రహమును గూడ పొందిరి. అట్టి భాషను చాలావఱకు పోగొట్టుకున్నందునను అయా అనుష్ఠేయ నియమాదు ల్లంఘించుట వల్లనూ ఒక్కనికిని ఒక్క దేవతయు బాహాటముగా పలుకుటలేదు. ఈ విధముగా దేవతానుగ్రహము తప్పిపోవుట వల్లనే ప్రజలవినీతి మార్గులైపోయిరి. పనికిమాలిన వారిచే తప్పు మార్గములు చూపబడి పాపభూయిష్ఠమైన ఈ లోకమందు అల్పజ్ఞులు అల్పాయుష్కులు కలిగి అహంకారమార్గములో దేవతలను మఱచుట చేతనే అనేక పీడలచే లోక మల్లాడుచున్నది.

ముఖ్యముగా ప్రాథమిక విద్యాకాలము నుండియు సంస్కరణలు జరిగి దేవతారాధనల విధానము కొఱకును నీతి శాస్త్ర విధానమునకును మన దేశమున స్థానము లభించవలయును. అనగా గురుభక్తి దైవభక్తి సత్యము ధర్మము సదాచారము మున్నగువాని నుగ్గుపాలనుండియు బోధించుట జరుగవలయును. పూర్వము ప్రాథమిక విద్య గురుకుల వాస పద్ధతితో నియమాహార యుక్తముగా జరిగెడిది. దేవాలయముల యొక్కయు దేవతారాధనల యొక్కయు సంబంధములు మానవులకు విడిపోనంతవఱకు లోక కళ్యాణ ముట్టిపడినది. ఈ విధముగా దేవాలయములను గూర్చియు దేవతారాధనలను గూర్చియు దేవతలకు మానవులకు గల పరస్పర సంబంధములను గూర్చియు పరిశోధించి వ్రాయవలయునన్న నొక గ్రంథమే వ్రాయవచ్చును. ప్రస్తుత కాలమం దీ భారమంతయు అందుకై సర్కారువారిచే నియమింపబడిన యండోమెంటు బోర్డువారి హస్తగతమై యున్నందున వారే మిక్కిలి జాగ్రత్తతో దేవాలయముల నుద్ధరించుటకును తద్విధానములను శాస్త్రయుక్తముగా చక్కజేయుటకును పూనినచో ప్రజలయందు దైవోత్సాహము ప్రబలి ఇహపర సిద్ధులు పొందగలరనియు లోకము కళ్యాణాకరము కాగల దనియు మరల భారతధర్మము వృద్ధికాగలదనియు మనవి జేయుచున్నాను.

ఇట్లు

**నందూరి లక్ష్మీనరసింహారాయకవి**

గ్రంథకర్త.

## విజ్ఞాపన

జీవకోటికి సుఖ పాపములు రెండును బంధరూపములే యైనందున నా రెండును అంతరించవలసినదే. అంతవఱకును జీవకోట్లకు కోరిక లుప్పొంగుచునే యుండును. వారు కోరు ప్రయోజనముల నెరవేరుటకు (మోక్షసిద్ధియగుదనుక) వారికి తెలియని సాధనా విశేషములను బోధించునదియే వేదము. పరసిద్ధికి ముఖ్యమైన యంగములు భక్తి జ్ఞానయోగములు. అవిచ్ఛిన్న తైలధారావతుగా భగవంతునియందు నగు ఎడతెగని ప్రేమాను బంధమే భక్తి. ఇంద్రియాదులకు గోచరింపక సర్వోత్కృష్టమైన సుఖరూపమై హెచ్చుతగ్గులులేని నిరతిశయానందమే జ్ఞానము. ఇంద్రియములను దమ యిచ్చవచ్చినట్లాడనీయక భగవదానుబంధముగా చిత్తమునందు సంయమింపజేయుటయే యోగము. వీని కన్నిటికిని ఆధారమైనదే యనుష్ఠానము. దానికే పారమార్థిక సంబంధమైన తాపత్రయమనిపేరు. లోకులు ఫలాపేక్షకులేకాని అవి నెఱవేరుట కుపాయమెఱుఁగక బాహుళ్యమైన వేదమంత్ర రహస్యములను గోచరింపఁజేసికొనఁజాలనివారు సాంగాధ్యయన తత్పరులైన గొందఱు మహర్షులను బ్రార్థింపఁగా వారు శతరుద్రీయమే ముఖ్య సాధనమని వాక్రుచ్చిరి. "శతరుద్రీయేణేతి" అని యాజ్ఞవల్క్యుఁడు పలికెను. దీని పఠన మాత్రముననే ఘోరపాపములు గూడ నశించునని శంఖ, జాబాల్యాదులు వచించిరి. రుద్రమును పదునొకండు మాఱులు పఠించినచో సర్వపాప విముక్తుఁడగునని అంగీరసులు వచించిరి. నిత్యము మహేశ్వరుని ధ్యానించుచు రుద్రపాఠము చేయువాఁడు భూమండలమంతయు కాంచనయుక్తముగా దానముచేయువానికన్నను అధికపుణ్యము పొందుననియు ఆతఁడు దేహముతోనే రుద్రత్వమందుననియు వాయు పురాణము చెప్పుచున్నది. శ్రుతి వచనముల పర్యాలోచనముచే రుద్రపాఠము మోక్ష సాధనమనియు సకలపాప వినాశనకరమనియు తెలియుచున్నది. కర్మకాండమునందు కర్మాంగమును జ్ఞానసాధనమందు బ్రహ్మవిద్యారూపమగు నుపనిషన్మంత్రరాశియు నిదియే యని తలంపవలెను. ఎట్లనగా అనుసంధాన భేదముచే శత్రునాశము గోరువాఁడు ఇందలి శత్రువాచకశబ్దముల స్వశత్రు పరముగా గ్రహింపఁగా ముముక్షువగు వాఁడు అరిషడ్వర్గాదిపరముగా ననుసంధింపవలెను. ఇందు ప్రతిమంత్రమునకును వ్రాయబడిన టీకలు శ్రీ సాయన భాష్యానుసారిణి యనియు, భాస్కరీయ భాష్యానుసారిణి యనియు నెఱుఁగవలెను. ఈ శతరుద్రీయ పాఠమునందీప్రయోజనము లన్నియు గమనించి సమాధులయందుండియే కొందఱు మహర్షులు నమకమంత్ర పాఠ చట్టములం గావించిరి. అట్టి యసాధారణ ప్రజ్ఞావంతుల నిందుండియే పేర్కొనుచున్నాను. 1.కశ్యపుఁడు, 2.అత్రేయుఁడు, 3.కాశ్యపుఁడు,4.కణ్వుఁడు, 5. గౌతముఁడు, 6.కాలుఁడు, 7, శంభువు, 8. మరుత్వంతుఁడు, 9.

నారదుండు, 10 మండూకుండు, 11. మహదేవుండు, 12. హేమకోశుండు, 13. పులహుండు, 14. స్కంధుండు, 15. మాండవ్యుండు, 16. అత్రి. 17.వైరాజుండు, 18 వైయాఘ్రుండు, 19. దూర్వాసుండు,20. దేవలుడు ఇత్యాదులు. ఇందులోకొన్ని భగవన్నిర్మితములే అయియున్నవి. అన్నింటికిని రుద్రుండే అధిష్ఠానదేవత. చమకము అనువాకయుక్తముగా నమక పాఠముతో సహపాఠవిదితమే యగుచున్నది. అయితే కామ్యసిద్ధు లంది యంది అందు విరక్తించిననేగాని ఆధ్యాత్మికోపాసనకు దారితీయదని శౌనక సనత్కుమార జాబాల్యాదులు గమనించి తదనుకూలముగా గూడ నీవిధుల యందు మార్గములను జూపెట్టిరి.

## సృష్టియనంగానేమి?

భగవంతుండగు రుద్రుండు తన సంకల్పమాత్రముననే త్రిగుణాత్మకుండై భూత పంచకమునందుండి బ్రహ్మ విష్ణు శివనామములనంది తన యాదిత్య శక్తిద్వారా వారికి సృష్టి స్థితి లయముల నాపాదించియున్నాండు. ఒకటవ యనువాకమందలి 7,8,9 మంత్రములలో నీ వివరమును గాంచనగును. ఆ మహామహునివల్లనే గ్రహంబులు భూమియు నుత్పన్నమైనవనియు శరీరముల కా మహావ్యక్తియే యాధారంబమగుననియు సమస్త పదార్థములు ఆయన నుండియే యుత్పన్న మయ్యెననియు తెలియనగును. స్నిగ్ధతేజమందైన దమస్సంపర్కముచేతనే ఉదయాస్తమయముల నాతనియందు రక్తకాంతి దోచుచున్నది. ఇంద్రధనస్సు ద్వారాగాని లేదా ఇంటికప్పుగుండా తోచు సూర్యకిరణము ద్వారాగాని అందుండి నానారంగు లుత్పన్నమయ్యెనని తెలియనగును. వీని ననుసరించియే రవి చంద్ర కుజ బుధ గురు శుక్ర శనులను సప్తగ్రహము లుత్పన్నమైనవి. సూర్యున కీ గ్రహములు ముఖ్యాంగములు. ఇవియే సూర్యునియందలి పదార్థములచే నుత్పన్నమైన శరీరములు. ఇవియే జీవులయందు శుభాశుభములను సూచింపుచుండును. రుద్రునియొక్క ఆదిత్య ప్రాశస్త్యమునందే లోకమున్నది. కిరణములనే అనంతరుద్రులద్వారా పిపీలికాది బ్రహ్మపర్యంతముగాగల లోకములను సృష్టించి ఈ జీవ పశువుల కన్నింటికిని తానే పతిత్వము వహించియున్నాండు. ఈ జీవకోట్ల తరింపుకొఱకే వేదశాస్త్రములను ప్రసాదించియున్నాడు. విషయలోలురై వాని కనుకూలముగా వర్తింపకపోగా నట్టివేదశాస్త్రములకు విరుద్ధార్థములనుగూడా సృష్టించి సాధుజన బాధలొనర్చువారిని శిక్షించుటకొఱ కప్పుడప్పుడు తనుతానే సృష్టించుకొని దుష్టశిక్షణ శిష్టరక్షణ లొనర్చుచున్నాండు. ఏమహామహుం డుదయించగనే జీవకోట్లు నిద్రమత్తును విడచి తెలివందుచున్నవో ఎవనిచే కర్మాధారములైన వర్ష అయన మాస దిన వార ముహూర్తాదులు ప్రసాదింపబడినవో ఎవని దివ్యస్వరూపము పండ్రెండు కళలుగా విభజింపబడెనో అట్టి దివ్యస్వరూపుండగు

రుద్రునకు నమస్కరించి యింక కాలస్వరూపమును తెలుపుటకుఁ గడంగుచున్నాను.

## కాలజ్ఞానము

కాలమే పరమేశ్వర స్వరూపము. కాలజ్ఞానమునకు మించినదిలేదని పూర్వము దివ్యులు, మహర్షులు వేయేల పిపీలికాది బ్రహ్మపర్యంతముఁగల దేహధారులు దీని నెఱుఁగుటకుఁబలుకష్టములకు లోనై తమతమ బుద్ధిబలములను జేర్చిరి. కాలము ననుసరించియే సృష్టి స్థితి లయము లగుచున్నవి. అట్టి కాల మీ సూర్యునివలననే గ్రహింపబడుచున్నది గాన సూర్యుఁడే త్రిమూర్త్యాత్మకుండని చెప్పఁబడియున్నది. ఏ మహామహుఁడు ఉదయగిరిని బొడఁగట్టఁగనే చరాచరములు నిద్రామాంద్యములు విడచి తెలివందుచున్నవో ఎవని చూడఁగనే మహాంధకారంబు పటాపంచలగుచున్నదో ఎవనివలన భూచర ఖేచర జలచరాదులు సౌఖ్యము లందుచున్నవో అట్టి త్రిమూర్త్యాత్మకమైన పరబ్రహ్మమూర్తిని సేవించుటకన్న మోక్షోపాయము వేఱొకటేమున్నది. అందువల్లనే బ్రాహ్మణులు నిత్యంబు త్రికాలములయందు నీ మహాత్ము నుపాసించుచున్నారు.

మయుఁడు మహాతపంబాచరించి ప్రత్యక్షమైన సూర్యుని కాలజ్ఞానమును దెలుపుమని వేడెను. సూర్యుఁడు తన దూతను మయునకు కాలజ్ఞానమును దెలుప నాజ్ఞచేసెను. దీనికే సూర్యసిద్ధాంతమని పేరు. అప్పుడా భగవంతుఁడు వాడియగు సూది, యొక్క తమలపాకును ఛేదించుట కెంతకాలము పట్టునో అదియే పుణ్యకాలము యొక్కగాని పాపకాలముయొక్కగాని పరిమితి యనెనట. దానినే తృటి యందుము. అట్టి తృటులు 100 ఒక్క లవ. ముప్పది లవకాలంబు లొక్క నిమేషము. 27 నిమేషము లొక్క గుర్వక్షరోచ్చారణ కాలము. అక్కడనుండి కాలంబును విస్తరింపఁజేయ ప్రాణాది ఖండకాలంబులు సృష్టంబులు గాన స్థూలంబు లనబడినవి. 6 ప్రాణంబు లొక్క విఘడియ, 60 విఘడియ లొక్క గడియ, 60 గడియ లొక్కదినము, ముప్పదిదినము లొక్క మాసము. అట్టిమాసములు పండ్రెండు లేక 365 దినములు షుమారొక సౌరాబ్దము (ఇది మానవప్రమాణము). ఇట్టి సౌరాబ్దములు 43200000 లొక్క మహాయుగము. వెయ్యి మహాయుగములొక్క జగస్థితికాలము. అంతియెకాలము రాత్రి ప్రళయం. రుద్రుని స్నిగ్ధరూపమందైన తమస్సంపర్కమువల్లనే పలువర్ణములై సప్తగ్రహము లుత్పన్నమయ్యెనని తెలిపియుంటిమి. అవియే వరుసగా నెముకలు రక్తము ధాతువు చర్మము మెదడు శుక్లము నరములై శరీరములుగా నేర్పడినవి. అందే వరుసగా కారము ఉప్పు చేదు రసకూటమి తీపి పులుపు వగరు లను రుచు లుత్పన్నమైనవి. ఇంకను తర్కించగా గురువే శబ్దప్రధానమైన మహాకాశము. చంద్ర శుక్రులు రసప్రధానమైన జలము. బుధుడే గంధప్రధానమైన భూమి. సూర్యకుజులు తేజ ప్రధానమైన అగ్ని. శని స్పర్శప్రధానమైన వాయువు. ఇట్లే

శరీరములేర్పడెను. మేలిమి ముద్దనుండి చెదరి మసిలోకిపోయిన బంగారు రేణువులను శోధించి తగిన మూసలో అసలుకాంతి వచ్చుదనుక పుటములందీర్చు సొన్నారివలెనే ఈ మహాదేవ సొన్నారియు అట్టి యపరిశుద్ధ జీవరేణువులను శరీరములనే మూసలయందుంచి సంసారములనే కుంపట్లలో జన్మలనే కాకలం దీర్చుచుండును. కష్ట సుఖములనే సుత్తెదెబ్బలంగూడ గొట్టుచుండును. మహారోగికి అమృతగుళికవంటిదీ శంభు సంస్మరణయని సనత్కుమారాది ఋషిభిషఙ్మణులు చేతులెత్తి వాకొనుచున్నారు. ఆమహా సారమంతయు నమక పాఠములోనే ఇమిడియున్నదనియు ఇంతకన్న జీవుల తరింపునకు సులభోపాయము వేఱొకటి లేదనియు చాటింపుచున్నారు.

### ఇక స్వవిషయము

9-11-1959 తేదీన చేబ్రోలు ప్రాంతమున రెడ్డిపాలెమునందుగల ఆనంద్రాశ్రమములో శ్రీ మేధా దక్షిణామూర్తిస్వామివారికి జరిగిన లక్షబిల్వార్చన కాలమందు ఆశ్రమకర్తలైన శ్రీ లక్ష్మీకాంతయోగిగారు నన్నుఁజూచి ఎల్లరకు సుబోధక మగునట్లుగా 'నీ నమకమంత్రములను తెలుగుపద్యములలో వ్రాయవలెనని నాకు చాలకాలమునుండి కోరిక యున్నదికాని నా కది జతపడలేదు. నీవు నాకోర్కె నెరవేర్చగలవా' యని బంధుప్రేమతో వచింపగా సరేనని స్వగృహమునకువచ్చి ఆనాటినుండి రెండుమాసములలోపుగనే దానిని పూర్తిఁజేసి వారికి దెలిపితిని. ఈ కథ యిట్లుండ 1960 సం॥రం జూను మాసములో నే నొక పనిమీద హైదరాబాదు పోయి బ్రహ్మశ్రీ వల్లూరు వెంకటేశ్వర్లు, బి.ఏ.బి.యల్. అడ్వకేటు గారికీ విషయమును దెలిపి నేను వ్రాసిన ప్రతిని వారికి చూపఁగా వారు ఒక పేజీలో నొక ప్రక్క మంత్రము పదము వచ్చునట్లునూ రెండవప్రక్క అనువాద పద్యము తాత్పర్యము ప్రయోగాదులు వచ్చునట్లున్నూ విమర్శించి వ్రాసినయెడల ఎల్లరకు పఠనా సౌలభ్యముగా నుండునని సెలవియ్యగా మరల నంతయుఁ ద్రిప్పి వ్రాసితిని. కాని నేనొక పండితుఁడను గాని ప్రశస్తమైన కవిని గాని కాను. కేవలము భక్తిపూర్వకమైన ఉత్సాహముతోనే వ్రాసితిని. విజ్ఞులుసైచి మన్నింతురుగాక.

ఇట్లు,

నందూరి లక్ష్మీనరసింహారాయకవి

గ్రంథకర్త.

# పీఠిక

మోక్షగమ్యానుకూలమైన మానవజన్మ మెత్తియు జ్ఞానసాధన మొనర్పని వాని జీవితము నిరర్థకము. సంసారసాగర తరంగములలో తాపత్రయాగాధ జలములో నిరంతరమును బుటకలువేయుచుండు వారికి అట్టి సాధనమునందెట్లు యభిరుచి గలుఁగును. మోహమును విడచి భగవత్పరమైన బుద్ధిచే శుద్ధులై సత్యసందర్శన మహర్నిశమును జేయుచూ తాము తరించుటయేగాక తోడి మానవుల తరింపునకు గూడ మార్గదర్శులగువారే మహాత్ములు. అట్టి వారి లీలలే అనుష్ఠేయములగు పాఠములు. కామ రాగాదులకు లోనుగాని మహాత్ములయందు నారాయణాంశ ముట్టిపడుచునేయుండును. వారి లీలలే దైవలీలలు. వారి పల్కులే సర్వోపనిషత్సారములు. వారి నడకలే మోక్షగమనములు. వారి తృప్తియే భగవత్తృప్తి. వారి నగవులే చిన్మయానందము. వారి శక్తియే దైవశక్తి. శ్రీరామకృష్ణ పరమహంస యొకనాడు దన యుపన్యాసములో నిట్లు వచించెను. బృందావన గోపికలు శ్రీకృష్ణుని వేణుగానమును వినినంతనే సమస్తమును మఱచి శ్రీకృష్ణుని కొఱకెట్లు తపించినది యేభాషా వాఙ్మయమును వర్ణింపజాలదట. అహంకారనిర్మూలనమున కుపకరింపని విద్యయు ఆత్మ సందర్శనమున కుపయోగింపని జ్ఞానమును నిరర్థకములు. ఉపన్యాసముల నిచ్చినంతమాత్రముచేతనే మానవుడు మోక్షవంతుఁడుగాఁడు. ఇది గ్రామఫోనుపెట్టెలోని సంగీతమువంటిది. ఎవ్వఁ డహంకారశూన్యుఁడో ఎవ్వఁ డాత్మజ్ఞానియో నతఁడే విద్వాంసుడు. భక్తిజ్ఞానాదులు గ్రంథములఁద్రిప్పుటతోను సిద్ధాంత రాద్ధాంతములతోను యుక్తి వాదనలతోను పట్టువడునవి కావు. దేవతాపూజయే ధర్మము. ఆత్మజ్ఞానమే వేదాంతము. దైవ సాక్షాత్కారమే మోక్షము. అందుకై తపించుటయే భక్తి. దీనికి సద్గురుని పాదసేవయే పునాది. అట్టి ఆత్మవిశ్వాసి యొసఁగెడి సందేశామృత ధారయే మహౌషధము. ఆచారవిహీనమైన శుష్కోపన్యాసములచే బొట్ట పోసికొనువారి జీవితములే రోత. అనవరతమును పరమార్థచింత యొనర్చు వాని యోగక్షేమములకు భగవంతుఁడే బాధ్యుఁడు.

అనన్యాశ్చింతయంతేమాం । యేజనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం । యోగక్షేమం వహామ్యహం ॥

-(భగవద్గీత)

వివేకుఁడు కర్మానుబంధమైన సుఖదుఃఖాదుల ననుభవిస్తూనే జన్మరాహిత్యం కొఱకు ఈశ్వరారాధన మొనర్చును. ఈశ్వరారాధనవల్లనే నాత్మజ్ఞానమును దాని వల్లనే మోక్షమును సిద్ధించును. వివేకునకు కలలోఁగాంచినదెల్ల మెలకువయందు మిథ్యయైనట్లే మోక్షగామి

కర్మానుబంధమైన సుఖదుఃఖాదులనుభవింపుచున్నను జన్మరాహిత్యము కొఱకు ఈశ్వరారాధన మొనర్చుచునే యుండును. మనకట్టి మార్గదర్శకములైన గ్రంథములు దేవభాషయందుండుటచే ప్రతివానికి దురవగాహంబని యెంచి విజ్ఞులు గొన్నింటి నాయాభాషలలోని కనువదించినను వానిలో గొన్ని యింకను గూఢముగానే యున్నవి. వానిలో శ్రీరుద్రాధ్యాయములోని నమకముగూడ యొకటి. ఒకప్పుడు మా యాశ్రమములో శ్రీ శ్రీదక్షిణామూర్తి స్వామివారికి జరిగిన రుద్రాభిషేక కాలమందు గొందరు నమకమును బఠించఁగాఁ గాంచి అందలి అర్థమేమని యడుగఁగా మాకు తెలియదనిరి. అదిమొదలు అందలి మహత్తర విశేషములను నాలో నేనే తర్కించుకొనుచూ అట్టి యవకాశము కుదరనందుకు విచారిస్తూ ఇందలి గోప్యభావముల నెల్లఱకుఁదెలియునట్లెవరు పూర్తిఁ జేయుదురా యని సుమారిరువది సంవత్సరములనుండి సంకల్పించుకొనుచుంటిని. ఇంతలో శ్రీవికారి నామసంవత్సర కార్తీక శుద్ధపౌర్ణమి అనగా (9-11-1959) తేదీన జరిగిన శ్రీ శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామివారి లక్షబిల్వార్చన నాడు నందూరు గ్రామవాస్తవ్యులును (కరణము) నైనట్టియు నాకు ముఖ్య బంధువున్నూ ఆప్తుఁడునునైన బ్రహ్మశ్రీ నందూరి లక్ష్మీనరసింహారాయ కవిగారరుదెంచి తానును పాల్గొని రుద్రమునుఁ జెప్పెను. విశ్రాంతికాలమం దాయనతో గూడ నా మనోభావమును వెల్లడించగా నదేమిటో గాని నామాట వినేవినడముతోనే జిఱునగవుతో మీయాశీర్వచనబలముతో నేనే దానిని పూర్తిఁ జేయుదుననెను. అప్పటి నా యానందమునకు మేఱలేదు. శ్రీ దక్షిణామూర్తిస్వామివారి మూర్తినుండియు గాయత్రి అమ్మవారిమూర్తి నుండియు గూడ శుభకాంక్ష లుట్టిపడినట్లే నాకు గోచరించినవి. కాని ఆయన కట్టి ప్రభావమున్నదో లేదో అని మఱల సంకోచింపుచూ ఏమో ఏ పుట్టలో యే సర్పమున్నదో దైవనిర్ణయమెట్లున్నదో చూద్దామని మనస్సు రూఢిచేసుకొని ఎట్టకేలకీ సంకల్పభారము నాయన శిరస్సుపై నిడితిని. రెండు మాసములకే దాని నాయన పూర్తిఁజేసి తన తొలిపలుకులోని 22వ పద్యములో నాపై సవాలుదీసెను. అప్పుడు నాకు పండితుఁడైన కవిదే జన్మగాని కవిగాని పండితునదేటి జన్మ యనిపించినది. ఇందొక్కొక్క మంత్రమునకు పదమును దాని కెదురుబడిలో అనువాద పద్యమును దాని దిగువ తాత్పర్యమును దానిక్రింద కవిగారి విమర్శనయు చూచి సంతోషించితిని. ఆయన కరణముగూడ గనుక హెడ్డింగులవారీగా పూర్తిచేసెననుకొంటిని. అయితే మహావిజ్ఞులైన వారికి ఇంతకన్నను గొన్ని విశేషములు గోచరించినఁ గోచరించునుగాక. శ్రీ కవిగారి మార్గదర్శికత్వమునకు సంతోషించి వారి నాశీర్వదింతురుగాకయని నా ప్రార్థన. ఎట్లనఁగా ఒకడు సముద్రములో మునిగి యూపిరిఁబట్టగలిగినంతసే పందుండి తన కరిపినన్ని రత్నములఁదెచ్చినచో సాగరములోని రత్నములన్నియుఁ దెచ్చెనను భావముగాదుగదా! కవియొక్క నిరహంకారత్వమున్నూ ఈశ్వరార్పణబుద్ధియు పెద్దలయం దాదరాతిశయమును

మోక్షాపేక్షతో దీనిని శ్రీ మేధా దక్షిణామూర్తిస్వామి వారికి కృతిసమర్పించిన తన **తొలిపలుకులలోని** 10,11,12,15,16,21,23 పద్యములలో స్పష్టపడుచున్నది. ఆత్మ విశ్వాసము 4,5,6,7,13,14,15 పద్యములలో స్పష్టపడుచున్నది. సమిష్టి రుద్రాధ్యాయములోని చివర భాగములో వ్రాయబడిన "పూజ్యులారా యిది పూర్తియైనది" అను పద్యములో పర్యవసాన భావ మగుపడుచున్నది. "రక్తంపుం బటువైన లేదు." అను పద్యములో ఆయన మోక్షకామిత్వము స్పష్టమగుచున్నది. "విరివిగా శార్దూల విక్రీడింతబలై" అను పద్యములో నాయన వ్రాక్చుమత్కృతి దుముకుచున్నది. తొలిపలుకులోని కుకవినింద పద్యము వర్ణనాతీతము. ఇఁక అనువాదపద్యములను గాని ఆయావిమర్శలనుగాని ఒక్కసారి చదువ మొదలిడినచో తుదివఱకు నాపరనియే నానమ్మకము. "మాయురేశక్తి యాత్మకులేదు సరిగదా" అను పద్యము నెన్నిమార్లు చదివినను తనివిదీరలేదు. అగ్రంథరచనాశక్తి శ్రీ మేధా దక్షిణామూర్తి స్వామివారిదేనని నానమ్మకము. కృతిభర్తయైన శ్రీ మేధా దక్షిణామూర్తిస్వామివారు కవిగారికి ఐహికమం దారోగ్యభాగ్యాదులను ఆముష్మికమందు దనసన్నిధిని యొసగి రక్షించుగాక యని సర్వేశ్వరుని పక్షముగా నీ కవిగారిని నే నాశీర్వదింపుచున్నాను. గ్రంథ విస్తరభీతిచే దీని నే నింతలో నాపుచున్నాను.

ఇట్లు,

లక్ష్మీకాంతానందయోగి.

కం॥ శ్రీసతి కాత్యాయని వి, ద్యాసతుల ముదంబులందు దామోదర కై
లాసాధిపాబ్జ యోనుల, భాసురకృప నాదుకృతినిఁ బాయకఁ బ్రోచున్ . 1

కం॥ మార్జాలవైరి వాహన, ఊర్జస్వల యేకదంత యుదరవిలంబా!
నిర్జితదుష్టకదంబా?, ఆర్జిత విఘ్నాంతరాళ హత రిపుజాలా! 2

క॥ అని వినుతిఁజేసి గణపతి, మనమునఁ బరమేష్ఠిరాణి మహిమఁ దలపుచున్
ఘనులగు దివ్యుల నెల్లను, వినుతించి కలంబుగొందు విలసనవృత్తిన్. 3

శా॥ బాహుప్రక్రియ ముష్టిఘాతముల శంపా చక్ర శూల ప్రసం
దోహ ప్రౌఢిగదాభి ఘాతముల నీ దుర్వార్య శస్త్రాళిచే
బాహాటంబగు నేత్ర బాడబముచే బ్రహ్మాండమౌ గర్జచే
యోహో రుద్రుఁడ నాదు శాత్రవుల మూ దుఖ్ఖాతలుగించుమా? 4

క॥ నీశక్తి నాకుఁ గలదను, నాశంక యొకింతలేక యవగడమున నా

నాశముఁగోరెడి శత్రుల, నాశంబొనరింపుమయ్య నాగాభరణా. 5

చు॥ కలిమిపురంధ్రి నీ సుతుని కాంతకు నిట్టుల నాజ్ఞయిమ్ము వి
ద్యల లఘుడైన యీసుకృతి నద్భుతరీతి కలాన వాక్కున
న్నిలచియు వేదసారము వినీల మహేశ్వరు రుద్రరూప సం
కలిత ఫలంబునైన నమకంబును బద్యములందుఁ గూర్పుమా? 6

చు॥ విబుధులఁ బ్రోవ మందరము వీకధరించిన మేటి వింతయౌ
యబలగ నొప్పి యాసుధ సురావళికే గుడువంగనిచ్చి బల్
సొబగుల బ్రోవు బాల్కడలి చూలిని నందక కౌస్తుభాళి మే
లుబుకఁగ నందినట్టి పురుషోత్తముఁడౌ సిరిశేనిఁ గొల్చెదన్. 7

క॥ ఆనందాశ్రమ కర్తయు, సానందుఁడు భవ్యతముడు సాధుగుణుఁడు ల
క్ష్మీనాథ యోగి ననుగని, ఊనిన కరుణావిశేష మొప్పఁగఁ బల్కెన్. 8

సీ॥ ఈవికారాబ్దంబు శైవ సంప్రీతమ్ము, కార్తీక శుద్ధ సంఘటితమైన
నవమీందువాసరానందమౌ దినమిది, యందున లక్షబిల్వార్చనంబు
శ్రీ దక్షిణామూర్తి చెందిన శుభకళ, యీమేలి మూర్తాన నీవు నమక
మంత్రార్థముల దేటమాటలఁబద్యకావ్యమ్ము, మాఖములోన వ్రాసియీయ
గలవెమోమాయనంగ నాఘనగుణనిధి యోగియాజ్ఞను దలఁదాల్చి యొప్పుకొంటి
అమ్మదుర్గమ్మ నాకండయౌచు నీదు,శక్తినందియ్యవా దీని సరిగవ్రాయ. 9

చు॥ ప్రియమున నొక్క మాట వినుపించెదఁ బెద్దలకెల్ల నింకమా
దయనిది పూర్తియౌననుచుఁ దద్దయు దీవెనలిందు మేలు ముల్
రయమున నించి యీసుకృతి రాణకువచ్చి ప్రతిష్ఠకెక్కులే
నయమున నంచు నట్టి సుదినంబునకై యెదురేచి చూచుచుణ్. 10

సీ॥ "కాబోలు తిక్కన్న ఘనతరవ్యవహార, సంధివిగ్రహకళా స్థానములను
కాబోలు పోతన్న ఘనత సాక్షాత్కార, చిన్మయాంచితభక్తి శీలమందు
కాబోలు సోమన్న ఘనమునునఘనమ్ము, నొకమెట్టులోగట్టి యూపుచోట
కాబోలు తిమ్మన్న కమనీయభావ వా, క్పృథలను ముద్దులు గురియుచోట
నింక దక్కినకవిపాళి కెసగుచోట్ల, కవితపసదున నితఁడు సైకాడనంగ
చేయవే దక్షిణామూర్తి చెంది నన్ను, పేరు నాకిచ్చి గ్రంథమీవే రచించి. 11

ఉ॥ ఏను వినాయకు న్దలచి యెంతయు నాకలమెత్తి దీనికి
న్బూనినయప్డె భారమింకఁ బూను మదంతయు నిన్నుఁజెందు నే
గాని మదీయ బాధ్యతను గాదని మ్రొక్కఁగలేదె నీవునున్
బూనితినంచు నాకభయముల్ శుభశాకునముల్ దలిర్పని
మ్మానగ నిందులోపములె యైన నవెల్లను నీయవే యగుం
గాని యొకించుకేనియును గావుమదీయ ములమ్మ భారతీ. 12

ఉ॥ పౌత్రుఁడు కొమ్మరాజ కులభవ్యుఁడు చెన్నయమంత్రి సూరికి
న్బుత్రుఁడు భక్తి యోగములఁ బుణ్యుఁడు వాని మహాశ్రమంపు సం
ధాత్రిఁ బ్రతిష్ఠఁజేసి నిను ధన్యతఁ గాంచెను జన్మమెల్ల నే
చిత్రమొ నాడు నీయెదుటఁ జెప్పెనటుల్ నమకంబుఁ దెన్గులో
సూత్రితరీతి పద్యములఁ జొప్పడఁ జేయుమటంచు వాహ్వా గా
యత్రిరో పూని నాడను రయంబున నాకికశక్తిఁ గూర్పవా? 13

మ॥ స్థిర సంకల్పుఁడ నల్పశీలనిధి లక్ష్మీకాంతసద్యోగి గ్రం
థరహస్యజ్ఞుఁడు సుప్రతిష్ఠనిడె నా నందాశ్రమం బందు నా
దరణీయస్థితిఁ గీర్తనీయుఁడగు మేధా దక్షిణామూర్తి యీ
శ్వరుఁడై యొప్పెనుగాన దీని నిఁక నాచంద్రార్కము న్బ్రోవుతన్. 14

చ॥ పదపడియెను నీ నమక పాఠముఁ బద్యములందుఁ గూర్పనే
సుదినతఁబూని నానొ యతి శోభను నక్షర మక్షరంబుగా
గదిసెను శంభు సంస్మరణ కమ్మగ నా సుధయట్లు రుచ్యమై
యదియును నాదు పూర్వభవమై తగు పుణ్యముగాక యన్యమే. 15

చ॥ మతియొకమాటఁ జెప్పెదను మానితశక్తులుఁ బండితోత్తముల్
విరివిగ గ్రాలు సత్కవులు వేత్తలునైచను పూర్వులెల్ల రి
ద్ధరబహుకావ్యరాజములఁ దద్దయు భ్రాజిలఁజేసి దీనిని
న్బరువడి వీడుటెల్ల నది వారల శక్తులయందులోపమా
కరుణను నిట్టి భిక్షకుఁడు కాగలకాలము నందుఁ బుట్టి తా
నరయఁగ వ్రాయులేయనుచు నాజ్ఞను దీనిని వీడిరేమొ యీ
భరమటుగాక వారికొక పాయకునందని నాకు సాధ్యమే. 16

సీ॥ శ్రీతుంగభద్రానదీతీరమందు నం, దూరు గ్రామంబు పేరొందుచుండు
నందున నందూరియామ్నాయ సంభవుల్, కౌశికగోత్రజుల్ గలరు ఘనులు
వారిలో గోవిందధీరుఁడు పొన్నూరు, భావనారాయణస్వామి భక్తుఁ
డగు వాని వంశాన నైరి వారికి వార, లారీతిగా వచ్చు వారియందు
నరసింహమననరి నరసింహమేనాగ, శివరామయాఖ్యుఁడా శీలికొదవె
నతనికేఁబుట్టితిని సుందరాంబయందు వితత సకలేశ జగదాంబ శతకములను,
ముక్తిశతకంబు మోక్షసంసక్తమైనవర సుధన్వార్జునీయమున్ వ్రాసినాఁడ. 17

తే॥గీ॥ ఇంక నచ్చునరానట్టివెన్ని యేని గలవు నావ్రాతలవి యిందు గలుపనేల
దీని మూలంబునెల్ల నేఁదెలిపినాఁడ మొదటనే దానినే నింక గదపనేల. 18

క॥ లక్ష్మీ నరసింహాఖ్యను, లక్ష్మింపగనౌదులోక లక్షణములలో
నీ క్ష్మాతలమున నాకొక, సూక్ష్మాంచిత బుద్ధిగూడ శూన్యంబరయన్. 19

చ॥ కలమున్నట్టిన స్వర్గలోకమయినం గంపింపఁగాఁజేయు భూ
తల సింహంబులు నాదు పూర్వజులు నేతద్వంశరక్తంబులో
బలహీనుండను సర్వమార్గముల నా పట్లన్ దయన్నించి ప్ర
జ్వలమౌ నీదగుశక్తి నాకు నిఁక నొప్పారించు పోలేరమా? 20

సీ॥ మాయురెశక్తి యాత్మకులేదు సరికదా, పొలిమేర్లలో లేదు పోలికలకు
భళిర సాహిత్యంపు పసలేదు సరికదా, మాటలపుష్టియుఁ దేటపడదు
కవితాబలం బేమి కనరాదు సరికదా, కల్లబొల్లులుఁగూడ గానరావు
మంత్రాళి పసయైన మతిలేదుసరికదా, యాడంబరంబైన నసలె లేదు
ఎన్నివిధములఁగాంచిన హీనుఁడితఁడు
వీడు తలపెట్టు కార్యమా వేదహితము
ఎట్లు నిర్వహణ మొనరించు నీతఁడంచు
నీసడింపకు శాంభవీ, యీవె కలవు. 21

సీ॥ ఒనర లక్ష్మీకాంతయోగి గారూ, మీకు జ్ఞప్తిఁజేసెదఁ జిన్న సంగతినిట
వీఁక మీరలు దీని నాకిచ్చునప్పుడు, గడువు మాఘంబంచు కరుణతోడ
జెప్పియుఁ న్నలుమారు యొప్పించగాలేదె, భళిమార్గశిరమందె బంధురముగ
పూర్తి గావించి సంపూర్తిగా నామాట, దక్కించుకొంటిని దైవకరుణ

తే॥గీ॥ వాహ్వామీ పైనగలదింకభారమెల్ల, నిర్వహింపుఁడు మీమాటనిశ్చయముగ
బ్రహ్మమౌనిద్విక్షాత్రమై బరగునిద్దె, యనెడి వాక్యంబు సార్థక్యమమరఁజేసి. 22

చ॥ పరువడినీకు గౌరికి వివాహ మొనర్చినవేళ దివ్య సుం
దరులొగి బారుజాత సుమ ధామముల స్ధగవైచి మిమ్మలం
కరులుగఁ జేసిరేమొ యటు గల్గుదురె ననుబోంట్లు నేను నా
సురుచిర పద్యమాలలను శోభితుఁజేసెద భక్తి శక్తిమై
కరుణను స్వీకరించి కలకాలము రక్షణసల్పి దక్షిణా
పరపదమూర్తి మోదమఠవాస తుదిన్ దగ మోక్షమియ్యవా. 23

## కు క వి నిం ద

చ॥ కవియను పేరుఁ గాంచుటకుఁ గాంక్ష గలట్టి నిరక్షరుండుఁ దా
నెవరి కవిత్వమందొగల యావలి యావలి శబ్దచోరుఁడై
యవతరిలంగఁ జేసినను నందుల మోసముగన్న నాడ యా
యవగుణు బాదరక్షల మహాద్భుతరీతిగ గౌరవించరే. 24

ఉ॥ తానొక ముండయైన దన తక్కువ శుంఠలకెల్ల మేటియై
కానివి పోనివెన్నో యగు కల్లల బొల్లుల విస్తరించు చెం
దేనినొ కూర్చి మెచ్చునటె యేనినొ హీనముగాఁగఁ బల్కుచుః
వానరు మాడ్కిఁగాఁ దనరు వానిని ఛీయనరే బుధోత్తముల్. 25

జ్వాలా నరసింహాఖ్యత, గ్రాలెడి శ్రీ కొమ్మరాజు ఘనవంశుఁడు దా
జాలగ ప్రోత్సాహకుఁడై, యాలంకృత మొసగె దీని కంఠయఁగాకన్. 26

అపగిదివాని సోదరు, లై పాటిలు చెన్న కేశవాఖ్యుఁడు మఱియున్
గోపాలకృష్ణమూర్తియు, నీపుణ్యులవర్ధిలంగ నీశుండోమున్. 27



శ్రీ లక్ష్మీకాంతానందయోగి

## నమకము ప్రథమానువాకారంభః.

నమస్తే రుద్ర మన్యవ ఉతోతఇషవేనమః

నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యా ము తతేనమః. 1

పదం॥ నమః - తే - రుద్ర - మన్యవే - ఉతో - తే - ఇషవే-

నమః - నమః - తే - అస్తు - ధన్వనే - బాహుభ్యామ్ - ఉత - తే - నమః.

క. నీకోపమునకు దా వర, మై కన్పడు బాణములకు నందులకగు న
స్తోకంబగుబల్ వింటికిఁ, బ్రాకటబాహు ద్వితయికిఁ బ్రణతులనిడుదుఁ.

తా॥ ఓ రుద్రా! నీ క్రోధమునకును, నీ బాణమునకును, నీ ధనస్సునకును, నీ బాహువులకును నమస్కారము చేసెదను.

### రుద్రశబ్ద నిర్వచనము

1. ప్రళయకాలమునందు సమస్తమును ఏడ్పించువాఁడు (నశింపజేయువాఁడు)
2. రుతి యనగా నాదము దాని యంతరమునందు ద్రవించుచున్నవాఁడు (ద్రవింపఁజేయుచున్నఁవాడు)
3. వేదరూపకమగు శబ్దముచే ధర్మములను జూపువాఁడు (పొందించువాఁడు)
4. ప్రణవశబ్దముచే దన స్వరూపమును బొందించువాఁడు.
5. జీవరూపముచేఁ బ్రాణులం బ్రవేశించినవాఁడు (తేజస్సుగలవాఁడు)
6. బంధ శక్తిని భక్తులనుండి పాఱదోలువాఁడు (సంసారదుఃఖమును పోగొట్టువాఁడు)
7. కల్పాదియందు వేదరూపమయిన శబ్దమును బ్రహ్మ కొసంగినవాఁడు.

ఇట్లు ఆచార్యులు తమతమ సమయమున కనుగుణ్యముగా రుద్ర శబ్దమును నిర్వచించిరి.

సర్వవ్యసనములకును మూలము క్రోధ మౌటచే మొదట దాని నమస్కారము చెప్పఁబడినది. పిమ్మట (1) బాధకరమగు బాణసంస్కారము, (2) తద్వారమైన ధనుస్సంస్కారము, (3) ఆరెండింటి వ్యాపారములకును, ఆధారమైన హస్తసంస్కారము చెప్పబడి నమస్కారము వర్ణితమయ్యెను - (ప్రత్యక్షకృతము). దీనికి ఋషి కశ్యపుఁడు. ఛందస్సు అనుష్టుప్పు దేవత రుద్రుడు. ఒక ప్రాజాపత్యకృత్యముఁ గావించి యథోక్తదినములు దీనిని నిరంతరము పదునొకండువేల మార్లు జపింపవలెను. ఈ మంత్రము చేతనే

ప్రదక్షిణ నమస్కారమును గావింపవలెను. పునశ్చరణమగును. అంత శ్రీ దక్షిణామూర్తి సన్నిధిని పదునొకండు వేలసార్లు జపించఁగా సమస్తపాపమును నశించును.పిమ్మట లక్షసార్లు జపించి తత్సాన్నిధ్యముననే అగ్నిని బ్రతిష్ఠించి నేతితో బాయసమువండి స్మార్తాగ్నియందు హోమముచేసినయెడ దేవుడు సాక్షాత్కారమవును. అచ్చటనే నాలుగు ప్రక్కల మూరెడు వైశాల్యముగల యగ్నికుండముగావించి తనయగ్నియందు కపిలగోఘృతముచే లక్షహోమము గావించవలెను. గాణపత్యము లభించును. క్షత్రియుఁడు సిద్ధుఁడైన బ్రాహ్మణునిచే లింగమునందు బూజచేయించవలెను. దానివిధమేమనగా లింగమునకు దక్షిణపార్శ్వమున అగ్నికుండము నేర్పఱచి మథనాగ్నిం బ్రతిష్ఠించి, (1) అజ్యముచే (2) ధూర్వలచే (3) కడిగిన తండులములచే (4) జమ్మిసమిథలచే ఒక్కొక్కటిచేతను ఎనిమిదివేలమార్లు వేల్వవలయును. పిమ్మట దేవునియెదుట ఎనిమిదివేలు జపించి దేవాలయము చుట్టును ఎనిమిదివేలావృత్తులు ప్రదక్షిణించవలెను. ఇట్లు గావించినయెడల భగవంతుఁడు మిక్కిలి ప్రసన్నుఁడగును.

ఆ॥వె॥ అతులమైనవిల్లు నంది యందునబాణ । మెక్కుబెట్టినట్టి యేకతముడు
వీరరూపమొప్పు విశ్వాసవంతుఁడై । దేవితోడఁదోచు దివ్యముగను.

యా త ఇషు శ్శివతమా శివం బభూవ తేధనుః
శివా శరవ్యా యా తవ తయానో రుద్ర మృడయ. 2

ప॥ యా - తే - ఇషుః - శివతమా - శివమ్ - బభూవ - తే -
ధనుః - శివా - శరవ్యా - యా - తవ - తయా - నః -
రుద్ర - మృడయ.

క॥ నీశాంతమైన య మ్మ, ట్లే శాంతంబైన ధనువు హెచ్చుగ శివమై
ప్రాశస్త్యమైన పొదిచే యీశా మాకెల్ల సుఖము లీయవె సతముఁ

తా॥రుద్రుడా? ఏ నీయొక్క బాణము శాంతమైనదో ఏ నీయొక్క ధనస్సు శాంతమగుచున్నదో ఏ నీయమ్ముల పొది శాంతమగుచున్నదో ఆ మూటిచేతను మమ్ము సుఖింపఁజేయుము.

## ప్రత్యక్షకృతము

ఈ మంత్రమునకు ఋషి యాత్రేయుడు. దేవత శంభువు. ఛందస్సు అనుష్టుప్పు. చరువు భుజించుచు పండ్రెండు దినములు జపించినట్లయిన బురశ్చరణసిద్ధుఁడగును. అన్నమును గోరువాఁడు తిలతండుల యావకామలకముల కల్కముచే పదునొకండు వేలాహుతులు వేల్వవలయును. దుర్భిక్ష మొదవినప్పుడు రాజు పురశ్చరణసిద్ధుఁడగు బ్రాహ్మణునిచే తిలగుడమిళితమైన చరువుచే తన యగ్నియందు లక్షహోమము చేయింపవలయును. రాజ్యమునందు సుఖమగును.

క॥ చిఱునవ్వుతోడ రథమున, మరివింటినిబట్టి శూర మండనయుతుఁడై
మురియుచు బ్రహ్మాదుల నుతి, కరుఁడై యీశుండు వేడ్క గానంబడెడిన్.

యా తే రుద్ర శివా తనూ ర ఘోరాఽపాపకాశినీ,
తయాన స్తనువా శ న్తమయా గిరిశన్తాభిచాకశీః 3

ప॥ యా – తే – రుద్ర–శివా – తనూః – అఘోరా–అపాప కాశినీ – తయా –
నః – తనువా – శన్తమయా – గిరిశన్త – అభి – చాకశీహి.

చ॥ రజితగిరిం జనించియు ని రంతరమున్నగమందు జీవులన్
సృజనమొనర్చి సౌఖ్యములఁ జెందగ జేయుచు నిల్చు రుద్రుఁడా
అజితము శాంతమై తనరు నట్టి మహాద్భుతమైన రూపుతో
విజయము చేసి మమ్ములను వేమఱు బ్రోవవె వేదవిశ్రుతా!

తా॥ రుద్రా! ఏ నీ రూపము అనుగ్రహము సేయునదియు హింసించునది కానిదియు శాంతమై అభయము తోపించునదియు అగుచున్నదో హేగిరిశన్తా! మిక్కిలి సుఖకరమైనట్టి పరమానందకరమైనట్టి ఆరూపముచేత మమ్ము అనుగ్రహింపుము.

## ప్రత్యక్షకృతము

ప్రథమ మంత్రమున ప్రసాదనార్థమై ఘోరరూపమునకు నమస్కారము చెప్పఁబడినది. ద్వితీయ మంత్రమున సాయుధ శివము ప్రతిపాదించఁబడినది. ఆయుధమును ధరింపని శివ మిందు ప్రతిపాదించబడుచున్నది. ఈ మంత్రమునకు ఋషి కాశ్యపుఁడు. దేవత శంభువు. ఛందస్సు బృహతి. హవిస్సు భుజించుచు మూడు రాత్రులు నిరంతరము జపించినచో బురశ్చరణ మగును. పిమ్మట గోశాలయందు నాలుగు ప్రక్కలను హస్తప్రమాణముగల యగ్ని కుండము గావించి మథితాగ్నిం బ్రతిష్ఠించి యందు దధి

మధుఘృత ములచే, దడుపcబడిన వైకంకతాపమార్గంబుల (ములువెలమ యుత్తరేణులు) సమిధలు పదివేలు వేల్చునట్లయిన గోశాంతి యగును - లేదా పవిత్రమైన ఘటము సుగంధాదివాసితము గావించి యందభిమంత్రితమగు జలమునింపి బ్రాహ్మణునిచే లక్షమాఱు లా జపము చేయించి యాజలముచేత గోవులc బ్రోక్షించునది.

కII చిఱునవ్వు లొలయ శిరమున, జిఱుతపు జాబిల్లిcదాల్చి శీతల గంగా
ధరుcడౌచు నార్యc గూడుచు, నరుదుగ నేత్రత్రయాన నభవుcడుదోcచున్.

యా మిషుం గిరిశన్త హస్తే బిభర్ష్యస్తవే,

శివాంగిరిత్ర తాం కురుమా హిగ్ంసీః పురుషం జగత్. 4

పII యామ్ - ఇషుమ్ - గిరిశన్త - హస్తే - బిభర్షి-అస్తవే - శివామ్-గిరిత్ర - తామ్ - కురు - మా - హింసీః- పురుషమ్ - జగత్.

చII రజతగిరీశ యే యిషువరంబది యెక్కిడcజేఱు ధీరత
న్నజగవమౌచు నీదు శుభ హస్తమునం దగె దాని శాంతి యం
ద జయ మొనర్చి మా పురుషమై తగు లోకములెల్ల క్షేమమై
గజిబిజిలేక యుండగ సుఖం బొనcగూరc గజేయవేదగన్.

తాII గిరిశన్తా ఏ బాణమును నీవు ప్రయోగించుటకొఱకు చేతియందు ధరించుచున్నావో గిరిత్ర! ఆ బాణమును శాంతమైన దానినిగా జేయుము. (అనగా) మా సంబంధమును హింసింపకుము.

త్రిపురదహన ప్రవృత్తమైన భగవంతుని ఘోరరూపము శత్రువులకు దక్కc దక్కిన లోకమునకు బాధలేకుండుటకై 4,5 మంత్రములచేc బ్రసన్నము సేయcబడుచున్నది.

శివేన వచసా త్వా గిరిశాచ్ఛావదామసి

యథా నస్సర్వమిజ్జగద యక్ష్మగ్ం సుమనా అసత్. 5

పII శివేన - వచసా - త్వా - గిరిశ - అచ్ఛ - వదామసి - యథా - నః సర్వమ్ - ఇత్ - జగత్ - అయక్ష్మమ్ - సుమనాః - అసత్.

చII గిరిశుcడ నిన్ను బొంద శివగీతములన్వచరించి నిత్యమున్
గరము నుతించుచుంటిమి జగంబున మాకల సర్వజంగమా

త్పరమగు వస్తుసంతతికి బాధలులేక సుఖంబు గూరcగా
నెఱపుము స్థావరంబులును నిత్యము వృద్ధి ఘటింపcజేయుమా?

తా॥ గిరీశ నిన్ను బొందుటకు మంగళకరములగు వచనములచేత ప్రార్థించుచున్నాము. మాయొక్క జంగమస్థావరమైన సర్వమునకును సుఖమగునట్లు చేయుము.

## ప్రత్యక్షకృతము

4,5 మంత్రములకు ఋషి గౌతముcడు. దేవత రుద్రుcడు. ఛందస్సులు 4వ దానికి నిచ్ఛృదనుష్టుప్పు. 5వ దాని కనుష్టుప్పు. ఇరువదియొక్క దినములు నిరంతరము జపించుట దీని పురశ్చరణము. దీనిచే నకాలమరణము లాగును. రాజు పురశ్చరణసిద్ధుc డగు బ్రాహ్మణునిచేc జేయింపవలెను. దధి మధు ఘృతములచేc దడుపcబడిన తిలవ్రీహి గోధుమ యవలచే ఏకవింశతి దినములలో లక్షహోమ మొనర్చవలెను. తొమ్మిదిదినములలో ఉపద్రవములు నశించును. పదునెనిమిది దినములలో లోకమంతట అకాలమరణము లాగును.

ఆ॥వె॥ అనికి సిద్ధమైన నాకారమున నొప్పి, దైత్యపాళినెల్ల ధాత్రిcగూల్చి
ధనువుcబట్టి దివ్యతరమైన రథమెక్కి, నట్టి భవుని ధ్యాన మందవలయు.

అ ధ్య వోచ ద ధివక్తా ప్రథమోదైవ్యోభిషక్
అహీగ్ంశ్చ సర్వాఞ్జ మ్భయన్త్సర్వాశ్చ యాతుధాన్యః 6

ప॥ అధి - అవోచత్ - అధివక్తా - ప్రథమః - దైవ్యః - భిషక్ -
అహీన్ - చ - సర్వాన్ - జమ్భయన్ - సర్వాః - చ -
యాతుధాన్యః .

చ॥ ప్రథముcడు సర్వదేవతలc బాలన చేసెడిమేటి వైద్యుcడున్
అధికపు వక్తయై దనరు నాతcడు భక్తిని వేడినంతనే
వ్యధలను బాపి నిత్యమును వర్ధిలcజేయుచు నన్ను మెచ్చి దా
నధికునిcజేసి లోకమున నందఱతో ననుcజెప్పుగావుతన్.

తా॥ దేవతలలో ప్రథానుcడును వారిని పాలించువాcడును సర్వ రోగములను బోగొట్టు వైద్యుcడును అధివక్తయునైన రుద్రుcడు - సర్పవ్యాఘ్రము రాక్షసాదులచే నగు సమస్తవ్యధలను పోcగొట్టి నన్ను అధికునిగాc జెప్పుగాక. ఇది సాయనభాష్యాభిప్రాయము.

## పరోక్షకృతము

ఈ మంత్రమునకు ఋషి కణ్వుఁడు. దేవత శంభువు. ఛందస్సు అనుష్టుప్పు. అర్థకృచ్ఛ మనుష్ఠించి యిటుపిమ్మట నైదుదినములు శాకములను మూలములను యవలను చరువును భుజించుచు పగలు అవశ్యకకర్మలయందు దక్కఁ దక్కినప్పుడంతయు నిలుచుండి నిరంతరము జపింపవలెను. పురశ్చరణమగును. అట్టి సిద్ధుఁడైన బ్రాహ్మణునిచే రాజు రక్షచేయింపవలయును. తెల్లయావాలు తండులములు ధూర్వలు యవలు నేతిలోఁ దడిపి సమముగా తన యగ్నియందుగాని మథితాగ్నియందుగాని ప్రతిదినము ఎనిమిదివేలు హోమముచేయునది. విశేషించి యార్ద్రానక్షత్రమునందు పదివేలు హోమమొనర్చవలెను. మఱియు నాదినమందే తిలలతోను బెల్లముతోను, యవలతోను క్షీరముతోను గలిపిన చరువుచేత ఎనిమిదివేలు హోమముచేయవలెను. రాజు దీర్ఘాయువగును. ఉత్తమ మధ్యమాది భేదములచే ముఖ్యకాలమునందు దక్షిణ లీయవలెను. "విభవే సతియో మోహాన్నకుర్యా ద్విధివిస్తరమ్ । నైవ తత్ఫలమాప్నోతి ప్రలోభాక్రాన్తమానసః" అనగా తన కలిమినిబట్టి ఎవ్వఁడధికముగా దక్షిణ లియ్యఁడో అతండాకర్మఫలము నందఁడు. ఆచార్యునకు ద్విగుణ దక్షిణ యిచ్చుటయేగాక ఆయనయే భగవంతుఁడని భావించవలెను. ఇట్లు సర్వకర్మలయందును అగ్నిముందర సౌవర్ణము రాజితముగాని మంత్ర కలశము స్థాపించి యందు దేవునావాహనముగావించి యగ్నియందు హోమము చేయవలెను. పిమ్మట గలశోదకముచే రాజును బ్రోక్షించునది. దానంజేసి రాజు రక్షగలవాఁడగును.

1. భయంకరమార్గమున బోవలసినపుడు ప్రత్తివిత్తులును, ఉప్పును, తెల్లావాలును ఈ మంత్రముచే పదునొకండుమాఱు లభిమంత్రించి తాను బోనెంచు దిక్కునువదలి తక్కిన దిక్కులయందు వేసి శుద్ధుడై దీనిని జపించుచు బోవలెను. ఏ భయమును కలుఁగదు.

వ్యాధిగ్రస్తుఁడు ఏడు అవగింజలను దీనిచే నభిమంత్రితముఁగావించి శిఖయందు బంధించఁగా ఆరోగ్యమగును.

ఇట్లు తెల్లయావాలను గావించగా సమస్త గ్రహములు తొలగును. శొంఠి యొకఫలము మంత్రించి కషాయముకాఁచి దానిచే దనయగ్నియందు ఎనిమిదివేలుగాని యెనిమిదివందలుగాని హోమముచేసి శేషము త్రాగగా గర్భరోగములు నశించును.

కు॥ ఇందుకళ లెసగ మోమున, మందస్మితుఁడౌచు సర్పమండనుఁడౌచున్
పొందుగ బాడబతేజం, బందిన భర్గుండు వానికగుఁ దలపులలోన్.

అసౌ య స్తామ్రో అరుణ ఉత బభ్రు స్సుమఙ్గలః

యే చే మాగ్ం రుద్రా అభి తో దిక్షు

శ్రితా స్సహస్ర శోఽ వైషాగ్ం హేడ ఈమహే. 7

ప॥ అసౌ - యః - తామ్రః - అరుణః - ఉత - బభ్రుః - సుమ
ఙ్గలః - యే-చ - ఇమామ్ - రుద్రాః - అభితః - దిక్షు -
శ్రితాః - సహస్రశః - అవ - ఏషామ్ - హేడః - ఈమహే.

సీ॥ ఏమహారుద్రుఁడీయెల్లలోకములకు, నాదిత్యరూపుఁడై యవతరించి
తామ్రారుణుండౌచుఁ దదుపరి పింగళుండౌచుఁ, బ్రాణులకెల్ల నధికసుఖము
నియ్యను దయాదులందెసగి ప్రత్యక్షమై, పాపపుణ్యంబుల ఫలమునిచ్చు
వేనవేలుగ ధాత్రి విస్తరించిన, రుద్రులౌవారియొక్కయు నంతమూల
మైన రుద్రునియొక్కయు నతనిపేర
బఱగు గణములయొక్కయు బంధురంపు
క్రోధమును మేము విరమించికొనుటకొఱకు
వినతులను జేయుచున్నాము విశ్రుతముగ.

తా॥ ఏరుద్రుఁడు ఆదిత్యస్వరూపముతో ఉదయకాలమం దెఱుపును పిమ్మట కొంచెము ఎఱుపును అటుపిమ్మట పింగళవర్ణములు కలిఁగి మంగళత్వమును భక్తుల కిచ్చుచున్నాడో మఱియు నా యాదిత్యుని కిరణరూపులైన ఏ రుద్రులు మొదలగువారు తత్తుల్యులై అధికముగా ఈ భూమిచుట్టును దిక్కులెల్లను వ్యాపించియున్నారో అట్టివారి క్రోధమును మేము నివారించుకొనుటకు యాచింపుచున్నాము.

అసౌ యోఽవసర్పతి నీలగ్రీవో విలోహితః

ఉతైనంగోపా అదృశ న్నదృశ న్నుదహార్యః

ఉతైనంవిశ్వా భూతాని సదృష్టోమృడయాతినః 8

ప॥ అసౌ - యః - అవసర్పతి - నీలగ్రీవః - విలోహితః - ఉత -
ఏనమ్ - గోపాః - అదృశన్ - అదృశన్ - ఉదహార్యః - ఉత -
ఏనమ్ - విశ్వా - భూతాని - సః - దృష్టః - మృడయాతి - నః.

సీ॥ నీలకంఠుండౌచు చాలలోహితుఁడౌచు, కరము మండలవర్తి కిరణధరుఁడు
నైనట్టి యారుద్రు నవని గోపాలకు, లుదహార్యులును జూచుచుందురింక
నవనిఁగల్గినయట్టి యన్యభూతంబులు, చూచుచుండునుగాదె చోద్యముగను
కైలాసమున నొప్పు ఘనమైన తేజంబు, వేదశాస్త్రాంచిత విధులెగాంచ
గల్గుదురేగాని యితరులు గల్గకుంటఁ
గరుణ నాదిత్య రూపంబు గాంచియెల్ల
వారలకు గూడ దర్శింపఁ బఱగునట్టి
రుద్రుఁడే మమ్ము రక్షించు రూఢిగాను.

తా॥ నల్లని కంఠముగలవాఁడును, యెఱ్ఱనివాఁడును నైన రుద్రుఁడు ఆదిత్యరూపుఁడై యుండెనో ఎవనిని గొల్లలు జలము తెచ్చుకొను స్త్రీలు మొదలగు అజ్ఞానులు లోనుగా సమస్త ప్రాణులును చూచుచున్నారో అట్టియాదిత్యరూపుఁడు పండిత పామరులచేతను సర్వప్రాణులచేతను చూడఁబడగా కైలాసవర్తియైన మహామూర్తిని వేదాంతశాస్త్రాభిజ్ఞులు మాత్రమే చూడగలరు. అట్లందఱకును దర్శనమిచ్చుటకు ఆదిత్యరూపుఁడైన రుద్రుఁడు మమ్ము సుఖింపజేయుగాక.

ఛందస్సు ఏడవమంత్రమునకు ఆస్తారపంక్తి, ఎనిమిదవదానికి షట్పదజగతి. రెంటికిని ఋషి కాలుడు. మరుత్వంతుఁడనికూడా పల్కెదరు. దేవత ఆదిత్యమూర్తియగు రుద్రుడు. రుద్రుని అనుగ్రాహకములయిన అష్టమూర్తుల యందు ఆదిత్యమూర్తియు నొకటియగుటవలన అయ్యాదిత్యమూర్తి ప్రసన్నమగుటకై యీ మంత్రములచే ప్రార్థింపఁ బడుచున్నది. ఒక ప్రాజాపత్య కృచ్ఛ్రము గావించి పదునాఱుదినములు నిరంతరము జపించగా పురశ్చరణ సిద్ధి యగును. అనావృష్టి దోషము గలుగునపుడు దీనిచే ప్రయోగముచేయనగును. మంత్రసిద్ధులగు బ్రాహ్మణులు నైదుగుర రావించి వారలకు శిరోవేష్టనా ద్యలంకారము లొసగి ఆర్ద్రానక్షత్రము మొదలుగాని, అంత్యమందుగాని మొదలుగా పదునొకండు దినములు దీక్షవహింపవలెను. దధి మధు ఘృతములచే దడుపఁ బడిన తిలతండుల యవలచే లక్ష ఆహుతులు వేల్వ వలయును. బ్రాహ్మణులలో నొకడు జపమును నలుగురు హోమమును జేయునది. కడపటిదినమున నెఱ్ఱదామరపువ్వు లెనిమిదివేలచే నారాధింపవలెను. సమాప్తి దనుక నగ్ని హోత్రమును రక్షింపవలెను,

కర్మకాలమున దిరిగి చూచిన పక్షమున నాచమించి ఒక మాఱు జపించి అగ్నిం జూచి కూర్చుండవలయును. కడపట అదిత్యుఁడు మహావర్షముఁ గురియించును. ప్రజ్వలితపూవులు పదివేలు వేల్చెనేని సూర్యుఁడు వరమొసంగును. ఉదయాస్తమయముల నీమంత్రముచే నుపస్థానము చేయునది. గొంతుబంటి నీటిలో సూర్యుని కెదుట నిలుచుండి యామంత్రముల జపించుచు రెండుచేతులనిండ జలమెత్తి యర్ఘ్యమును విడచునది. ఇట్లు ప్రతిదినము ఎనిమివేల చొప్పున తొమ్మిదిదినము లర్ఘ్యమును విడచునది. అంత నాదిత్యుఁడు ప్రసన్నుఁడై సంవత్సరమంతయు నితని కామితము లీడేర్చును. తేనెతోఁ దడుపఁబడిన దాసనపూవు లిరువదియొక్క వేలు వేల్చినయెడల సూర్యుని ప్రసాదమున జతుర్వేదివంశంబున జన్మించి జాతి స్మృతియుఁ బొందును.

తే॥ గీ॥ మండలాంతరవర్తియై మంగళంపు,
రూపముననొప్పి చిఱునవ్వు రూఢిపడఁగ
రవిని గన్పడుముని సహస్రములతోడ
పరగు నాదిత్యు డప్పుడు బంధురముగ.

నమో అస్తు నీలగ్రీవాయ సహస్రాక్షాయ మీఢుషే

అథో యే అస్యసత్వానోఽహంతేభ్యోఽకరం నమః 9

ప॥ నమః - అస్తు - నీలగ్రీవాయ - సహస్రాక్షాయ - మీఢుషే-
అథో - యే - అస్య - సత్వానః - అహమ్ - తేభ్యః - అకరమ్ -నమః.

సీ. కాలకూట ప్రభాకలితకంఠమువాఁడు, వేయినేత్రంబుల వెలుఁగువాఁడు
సర్వ రూపములందు జలధరంబుగనొప్పి, వర్షమున్గురియించువాఁడు మఱియు
నఖిల జగద్యోనియై పురుషాకార, మున వీర్యమునునించు ముఖ్యశక్తి
యైన రుద్రునకివ్వెయౌనమస్కారముల్, మఱియింకతద్భృత్యతతులుప్రమథ

తే॥గీ॥ గణములైయొప్పు వారికిగాకవారి,
కాశ్రయులునౌచు వెల్గొందు నట్టివారి
కింక నారుద్ర సంబంధ మొసఁగి మించు
వారికిదె జేతునే నమస్కారములను.

తా॥ నల్లని కంఠము గలవాఁడును వేయి నేత్రములవాఁడును వర్షము నిచ్చువాఁడును జగత్తులకు యోనియై పురుషాకృతిచే వీర్యషేకము సేయువాఁడును అగు రుద్రునికి నమస్కారము చేయుచున్నాను. ఈ రుద్రుని ఆశ్రయించిన తత్సంబంధులగు ఏ

ప్రథమగణాదులు గలరో వారికి నమస్కారము చేయుచున్నాను.

ఈ మంత్రమునకు ఛందస్సు అనుష్టుప్పు. ఋషియు దేవతయు భవంతుఁ డగు శంభువు. పదునైదుదినములు హవిస్సు భుజించుచు నిరంతరము జపించినచో పురశ్చరణ సిద్ధుఁడగును. పడమరవాకిలిగల శివాలయమునందు శివుని సమీపమున నంతటను అరత్ని ప్రమాణమగు యగ్నికుండము నిర్మించి యందు మథితాగ్నిం బ్రతిష్ఠించి అమావాస్య మొదలుకొని పదిదినములు నిత్యము అర్కపుష్పములు వేయివేల్చి దేవునకు ఘృతపాయసము నివేదనము సేయవలెను. సర్వార్థములు సిద్ధించును. పుత్రార్థి అయిదు లేక మూడు దినములు దీక్షతో శివాలయమునగాని నదీతీరమునగాని యావుల కొట్టమునగాని దేవాలయమందైన దేవుని సన్నిధియందును ఇతర స్థలముననైన కుంభమునందును దేవు నావాహనముచేసి పశ్చిమపార్శ్వమున నగ్నిని బ్రతిష్ఠించి దధి మధు ఘృతములచేఁదడుపఁబడిన జమ్మిసమిధలును, జమ్మి పత్రములును నిత్యము పదునొకండువేలుగాని యెనిమిదివేలుగాని నాలుగువేలుగాని యెనిమిదివందలుగాని వేల్చునది. హోమానంతరమున తామరపువ్వులనుగాని అవి లేనిచోఁ దామరాకులనుగాని నాలుగువేలుగాని యెనిమిదివందలుగాని వేల్చునది. హోమానంతరమున తామరపువ్వులనుగాని అని లేనిచోఁ దామరాకులనుగాని దేవునిమీద నుంచవలెను. కడపటిదినమున బ్రాహ్మణులకు తృప్తిగా భోజనమొసంగవలెను. అధికముగా దాన దక్షిణలీయవలెను. రుద్రరూపులగువారిని భుజింపఁజేసి అధికముగా భూషణాదులొసంగవలెను. ఆచార్యుని దేవుని దక్షిణపార్శ్వమున సన్నిధియందేభుజింప జేసి కేదారసహితముగా అధికమగు దాన దక్షిణలియ్యవలెను. కాంస్య పాత్రమును సువర్ణకుండలమును ఈయవలెను. ఇట్లు చేయునెడల సంవత్సరములోపల శంభుప్రసాదమున పుత్రుఁడొదవును. సంతతి అవిచ్ఛిన్నమగును. దీని ఫలము సప్తజన్మములకు సంబంధించియుండును.

భు॥ శారదాభ్రమువంటి దేహము సర్వదిక్కులఁ బర్వఁగా
మీరు రాజిత పీఠమందున మించి నిర్జరసేవ్యుఁడై
గౌరితోఁ దగి లోకమెల్లను గౌరవంబున మ్రొక్కఁగా
శూరకోటుల దీప్తినందెడి శూలి దర్శనమయ్యెడిన్.

ప్రముఞ్చ ధన్వన స్త్వ ము భయోరార్త్ని యోర్జ్యామ్,
యాశ్చ తే హస్త ఇషవః పరా తా భగవోవప. 10

ప॥ ప్ర - ముఞ్చ - ధన్వనః - త్వమ్ - ఉభయోః - అర్త్ని యోః - జ్యామ్ - యాః - చ - తే - హస్తే - ఇషవః - పరా-తాః - భగవః - వప.

క॥ ఘనరుద్ర నీదు విలునగు, మొనలంగల నల్లెత్రాటి మోపును విడువం
గను నీదు మూపు పొదులన్, బనివడి విడువంగ నీకుఁ బ్రణుతియొనర్తున్.

తా॥ భగవంతుఁడవగు నో రుద్రుఁడా నీధనస్సు యొక్క రెండుమొనల యందు గల నల్లెత్రాటి మోపును దింపుము. మఱియు నీ చేతియందుగల బాణాదులను గూడా విడచిపెట్టుము.

"ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసశ్శ్రియః జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇతీరణా (అనిస్మృతి) మఱియు - ఉత్పత్తించ వినాంశంచ భూతా నామాగతిం గతిమ్. వేత్తి విద్యా మవిద్యాంచ సవాచ్యో భగవానితి అనిస్మృతి. ఉత్పత్తి నాశనములను రాకపోకలను విద్య అవిద్యయు తెలిసిన వాఁడె భగవంతుఁడు.

ఇదివఱకు తొమ్మిది మంత్రములచేత క్రుద్ధదేవుని ప్రసాదనము చెప్పఁబడినది. ఇఁక నతని యుపసంహార కారణములయిన వింటినారి సడలించుట మొదలగునవి ప్రార్థింపఁబడుచున్నవి.

అవతత్య ధను స్త్వగ్ం సహస్రాక్ష శతేషుధే,
నిశీర్య శల్యానాం ముఖా శివోనస్సుమనా భవ. 11

ప॥ అవతత్య - ధనుః - త్వమ్ - సహస్రాక్ష - శతేషుధే - నిశీర్య - శల్యానామ్ - ముఖా - శివః - నః - సుమనాః - భవ.

తే॥గీ॥ లెక్కలేనన్ని కన్నులు నెక్కులైన
పొదులు కల్గిన రుద్రుఁడా పొసగునీదు
ధనువు సడలించి బాణాళి తునుక లెల్ల
తల్లక్రిందందుఁ జేయుమా దయదలిర్ప.

తా॥ పెక్కుకన్నులు పెక్కు అమ్ముల పొదులు గల నో రుద్రుఁడా నీవు నీధనస్సును దించి బాణముల మొగములను అమ్ముల పొదులయందు తల క్రిందులుగా జేసి మాపట్ల మంచి మనస్సుతో దయగలవాఁడవగుము.

విజ్యం ధనుః కపర్దినో విశల్యో బాణవాగ్ం ఉత,

అనేశన్న స్యే షవ ఆభు ర స్యనిషఙ్గధిః. 12

ప॥ విజ్యమ్ - ధనుః - కపర్దినః - విశల్యః-బాణవాౕ - ఉత - అనేశౕ - అస్య - ఇషవః - ఆభుః - అస్య - నిషఙ్గధిః.

సీ॥ జూటధారుండైన మేటి రుద్రుని విల్లు, నారి రాహిత్యమై తీరుగాక
అతని బాణములెల్ల ననివిశల్యంబులై, పొదియు నమ్రస్థితి న్పొందుగాక
ననిప్రయోగాధార మైన వస్తువులెల్ల, నుపయుక్తహీనమై యొప్పుఁగాక
మతికత్తి యొరగూడ మాటుగానుండుచు, ధారణామాత్రమై తనరుగాక

తే॥గీ॥ అనగ నన్నింట గలశక్తి యధికముడిగి
జగములను గాఱియం బెట్టఁ జాలకుండ
నౌత శుభములు చేకూర నన్ని విధుల
ననెడి తాత్పర్యమగు దీనియందు నిజము.

తా॥ జటాజూటముగల రుద్రుని విల్లు అల్లెత్రాడులేని దగుగాక అమ్ములపొది తలక్రిందై బాణముల మొనలు అతిశయింపబడ నట్లగుఁగాక, బాణాధారమైనదియు కొంచెము సమర్థమగుగాక. కత్తి యొఱయు కొంచెము సమర్థమై నామమాత్రమే యగుఁగాక. ఖడ్గముకూడా ఆకర్షించుటకు యోగ్యము గాకుండుగాక. (సాయనభాష్యాభిప్రాయము.)

ఈ మంత్రము పరోక్షకృతము. ఈ మూడురుక్కులకును (10, 11, 12) ఋషి నారదుఁడు. ఛందస్సు అనుష్టుప్పు. దేవత రుద్రుడు. ఒక ప్రాజాపత్యకృచ్ఛ్రము గావించి పరిశుద్ధుఁడై తొమ్మిది దినములు నిరంతరము జపించినచో సిద్ధుఁడగును. ఈ మంత్రములచే యుద్ధకాలమున రాజునాయుధము నభిమంత్రించి దర్భముక్కలు వేయి వేల్చవలయును. ఇందుచే శత్రురాజుల పరాజితులగుదురు.

క॥ ఉదయార్కకోటి సన్నిభ, విదితుఁడు దేదీప్యమాన విద్యుద్భాషా
స్పదుఁడును సర్వాయుధముల, నుదుటుఁడుశంభుండు దోచునొప్పిదమౌచుౕ.

యాతే హేతి ర్మీఢుష్టమ హస్తేబభూవ తే ధనుః,

తయాఽ స్మాన్విశ్వత స్త్వమ యక్ష్మయా పరిబ్భుజ 13

ప॥ యా-తే - హేతిః - మీఢుష్టమ - హస్తే - బభూవ - తే - ధనుః - తయా - అస్మాన్ - విశ్వతః - త్వమ్ - అయక్ష్మయా - పరిబ్భుజ.

తే॥గీ॥ కలనమీఢుష్టమా! నీదు ఖడ్గమేది
యేది నీ దివ్యహస్తమై యొసగు విల్లు
అన్నిటను గూడ నే బాధ లంటకుండ
మమ్ము పాలింపుమా? రుద్ర! మహిమదనర.

తా॥ కోర్కులను వర్షించువాఁడా! (రుద్రుఁడా) నీహస్తమందుగల ఉపద్రవము సేయనట్టి యాయుధముచేతను వింటిచేతను హేతిచేతను ధనస్సుచేతను అన్నిటనుండియు మమ్ము పరిపాలింపుము. సాయనీయము.

నమ స్తే అస్త్వాయుధాయాఽనాతతాయ ధృష్ణవే,
ఉభాభ్యాముత తే నమో బాహుభ్యాం తవధన్వనే. 14

ప॥ నమః - తే - అస్తు - అయుధాయ - అనాతతాయ - ధృష్ణవే - ఉభాభ్యామ్ - ఉత - తే - నమః - బాహుభ్యామ్ - తవ - ధన్వనే.

చ॥ అతి సమర్థము లయ్యు ధనువున కంటనట్టి శరాళికిన్
నుతితమొౘు శరాళిఁ గూర్చక నూలుకొన్న ధనస్సుకున్
అతులమౌచును రెంటికైచను నట్టి బాహుల జంటకున్
క్షితిని సాగిలి వందనంబులఁ జేతునో శివశంకరా?

తా॥ కోర్కులను వర్షించువాఁడా! ఉపద్రవము సేయక నీహస్తమందు గల సమర్థములగు బాణముల కొఱకును, ధనస్సు కొఱకును, హస్తముల కొఱకును నమస్కారమగుఁగాక. భట్ట భాస్కరీయము.

పరి తే ధన్వనో హేతిరస్మాన్ వృణక్తు విశ్వతః,
అథోయ ఇషుధి స్తవాఽఽరే అస్మన్ని ధేహి తమ్ 15

ప॥ పరి - తే - ధన్వనః - హేతిః - అస్మాన్ - వృణక్తు - విశ్వతః - అథో-యః - ఇషుధిః - తవ - ఆరే - అస్మత్ - నిధేహి - తమ్.

ఉ॥ నీదుధనవునందు నెలకొన్న బాణాలు, మమ్ము విడచుఁగాక మఱియు నీదు
తరకసంబులింక దవ్వు మా కొనరించి అరుల యందు జేర్చుమయ్య రుద్ర?

తా॥ నీ ధనుస్సు యొక్క బాణములు మమ్ము బాధింపకుండుగాక మఱియు నీ యమ్ములపొదిని మాకు దూరమందుంచుము. శత్రువులయందుంచుము. భట్ట భాస్కరీయము.

13, 14, 15 మంత్రములు యుష్మచ్ఛబ్దప్రయోగము. వీని ఛందస్సు అనుష్టుప్పు, ఋషియు దేవతయు భగవంతుఁడు. ఒక ప్రాజాపత్యకృచ్ఛ్రము చేత తన్ను శుద్ధుని గావించుకొని తొమ్మిది దినములు నిరంతరము జపింపవలెను. మంత్రసిద్ధియగును. యుద్ధ కాలమున పదునొకండు వేల దీపములకుఁ జాలిన తైలమును ఒక గొప్ప పాత్రయందుంచి యందు దేవు నావాహనము చేసి చుట్టును దిక్పాలకుల నావాహనము చేసి యారాధించి యేడు దినములా తైలమును స్పృశించుచు ప్రతిదినము ఎనిమిదివే లావృత్తిలు జపింపవలెను. శత్రురాజ్యము సమీపించినపుడు అసిద్ధతైలముచేఁ బదునొకండు వేల దీపములు వెలిగించి యెత్తించుకొని రాజును వదలి సేనాపతి సేనాసహితుండై ముందు నడవ వలెను. ఆ దీపజ్వాలలను జూచి శత్రువులు నశింతురు.

2. మంత్ర సిద్ధులగు బ్రాహ్మణులు సిద్ధవేషులై శత్రునగరము బ్రవేశించి అభిచారమిట్లు ప్రయోగించునది. శత్రురాజు ఉపయోగించు వస్తువులను ఈ మంత్రము లుచ్చరించుచు స్పృశించియు జూచియు స్పర్శన దర్శనముల కశక్యమగు వానిని గూర్చి వినియు, "అభిచారోస్తు" యను దాని నంతమునఁజేర్చి యీ మంత్రముల జపింపవలెను.

3. ప్రకారాంతము ఒక శంకువు నీ మంత్రములచే వేయిమాఱు లభిమంత్రించి శత్రు పట్టణమందుజేరిన చతుష్పథంబున కాని దేవాలయము నందుగాని దేవోద్యానమునగాని ప్రహరియందుగాని అగడ్తయందుగాని పాతునది. ఆ నగరము శివుని కోపమునంజేసి మూడు సంవత్సరములలో వ్యాధిచే నశించును. ఆచార్యునకు రాజ్యముతో సరియయిన దక్షిణ నీయవలెను.

క॥ నతులైన సురల శిరముల, కృతమౌ సుమధామ రజము గీల్కొను పద స
న్నుతమై విలుగైకొని పా, ర్వతితో శంభుండు గరుణ భాసిలఁదోచున్.

సాయనీయము. భగవంతుఁడగు రుద్రుని ప్రధానరూపము ప్రథమానువాకమునఁ బ్రసన్నము గావింపఁబడెను. లోక నిర్వాహమునకు హేతువులైన యా రుద్రుని లీలావిగ్రహముల ప్రసాదనము తొమ్మిదవ యనువాకములచేఁ జేయఁబడుచున్నది. మొదటి యనువాకంబున ఋక్కులు, తక్కిన యెనిమిదింటను యజుస్సులు. రెండు వాక్యములుగలది ఋక్కు. ఏకవాక్యరూపము యజస్సు. ఆ యజస్సులలో మొదటి మూడనువాకముల

యందు ఉభయతో నమస్కారములు. తక్కిన యయిదింటియందు అది యందు మాత్రమే నమశ్శబ్దము. రెండవ మనువాకంబున పదమూడు యజుస్సులు.

భట్ట భాస్కరీయానుసారముగా ప్రథమానువాకమున భగవంతుఁడగు రుద్రునిఁ బ్రసన్నముగావించి అతండుపసంహరించుటకు సాధనములయిన ఆయుధముల బ్రసన్నముచేసి ఉపసంహరింపఁజేసి యిఁక నెనిమిదింట నాయన విశ్వరూపమును స్తుతించుటయు, సమస్కరించుటయుఁ గావింపఁబడుచున్నది. అందుకొన్ని యజుస్సులు ఉభయతో నమస్కారములు (ఘోర తరములు) కొన్ని అన్యతరతో నమస్కారములు (శాంతతరములు). బహువచనాంత శబ్దములకు రుద్రునిచే సృష్టులయి రుద్రసదృశులైన రుద్రులని యర్థము. రుద్రపర్యాయములు కానివానికి అధిష్ఠాన బుద్ధిచే రుద్రుఁడర్థమని తెలియునది.

ప్రథమానువాకము సంపూర్ణము.

## ద్వితీయానువాకారంభః

నమో హిరణ్యబాహవే సేనాన్యే దిశాంచ పతయే నమః. 1

ప॥ నమః - హిరణ్యబాహవే - సేనాన్యే - దిశామ్ - చ-పతయే - నమః.

క॥ భూషణములు కలవాఁడును, భీషణగతి యుద్ధమందు పెక్కుదళములన్
రోషించినడుపు వాఁడును, తోషణుఁడై దిక్కులేలు ధూర్జటి నెంతున్.

తా॥ చేతులయందు బంగారపు ఆభరణములను తాల్చినట్టియు యుద్ధములందు సేనాధ్యక్షుఁడైనట్టియు రుద్రునకు నమస్కారము. మఱియు దిక్కులయొక్క పతియైన రుద్రునకు నమస్కారము.

నమో వృక్షేభ్యో హరికేశేభ్యః పశూనాంపతయేనమః. 2

ప॥ నమః - వృక్షేభ్యః - హరికేశేభ్యః- పశూనామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ హరితపత్రములుగ నమరిన గేశాళి
చెట్లరూపులైన శివుల కెల్ల
నతులు పశుపతిగను క్షితి శోభఁగాంచిన
యట్టి భవ్యమూర్తి కౌను నతులు.

తా॥ పచ్చవన్నెగల పత్రరూపములైన వెంద్రుకలుగల వృక్షరూపులగు రుద్రులకొఱకు నమస్కారము మఱియు పశుపతికొఱకు నమస్కారము.

నమ స్సస్పిఞ్జరాయ త్విషీమతే పథీనాం పతయే నమః. 3

ప॥ నమః - సస్పిఞ్జరాయ - త్విషీమతే - పథీనాం - పతయే - నమః.

ఆ॥ లేతకసవు పోల్కి పీతవర్ణుఁడు మహా, తేజుఁడైన రుద్రుఁ దెల్తునింక
నర్చిరాదియైన యట్టి మార్గంబుల, ముక్తినిచ్చు రుద్రమూర్తినెంతు.

తా॥ లేతగడ్డివలె రక్త పీతవర్ణుఁడును, స్వయంప్రకాశుఁడును అగు రుద్రునకు నమస్కారము మఱియు అర్చిరాది మొదలగు సమస్త సన్మార్గములను ప్రవర్తింపఁజేయు రుద్రునకు నమస్కారము.

నమో బభ్లుశాయ వివ్యాధినే౽న్నానాం పతయే నమః. 4

ప॥ నమః - బభ్లుశాయ - వివ్యాధినే - అన్నానామ్ - పతయే - నమః
ఆ॥వె॥ వృషభవాహనమున విలసిల్లి వైరులఁ
రూ పడంచు నట్టి రుద్రునకును
వసుధ నన్నములకు బాలకుండై యొప్పు
పశుపతికి యొనర్తు వందనంబు.

తా॥ కపిలవర్ణములతో మిళితమైన గోరోజనపు వన్నె గలవాడును వృషభవాహనమునం దొప్పుచు శత్రువులను బాధించువాఁడు అగువాని కొఱకు నమస్కారము. మఱియు ఓషధులకు స్వామియైన రుద్రునికొరకు నమస్కారము.

నమో హరికేశా యో పవీతినే పుష్టానాం పతయేనమః. 5

ప॥ నమః - హరికేశాయ - ఉపవీతినే - పుష్టానామ్ - పతయే - నమః
ఆ॥వె॥ నఱపులేక యొప్పు నల్లని కేశాళి
చేత మంగళోపవీత మొప్పఁ
బూర్ణ గుణములందు పొల్పారు పురుషుఁడౌ
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ నల్లని వెంద్రుకలు గలవాఁడును (నిత్యయౌవనుఁడనుట) మంగళాచారము కొఱకు యజ్ఞోపవీతమును ధరించినవాఁడును, సంపూర్ణగుణపుష్టి కలవాఁడును అగు రుద్రునకు నమస్కారము.

పుష్టులనఁగా వాక్పుష్టి, జ్ఞానపుష్టి, ఇంద్రియపుష్టి, క్షేత్రపుష్టి, భాగ్యపుష్టి, ప్రజాపుష్టి, పశుపుష్టి, ధర్మపుష్టి, ధాన్యపుష్టి, యోగపుష్టి అని పది.

నమో భవస్యహేత్యై జగతాం పతయేనమః. 6

ప॥ నమః - భవస్య - హేత్యై - జగతామ్ - పతయే - నమః.
క॥ సంసార బంధకంబగు, హింసల నరికట్టు నట్టి యాశునకును తా
సంసిద్ధ పాలకుండగు, సంసారికి నతులు ధాత్రి సాగిలి చేతున్.

తా॥ సంసార బాధలను ఛేదించునట్టి రుద్రునకు నమస్కారము. మఱియు లోక పాలకుడైన రుద్రునకు నమస్కారము.

నమో రుద్రా యాఽఽ తతావినే క్షేత్రాణాంపతయే నమః. 7

ప॥ నమః - రుద్రాయ - అతతావినే - క్షేత్రాణామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ విరివిసేయబద్ధ వింటిచే రక్షించు
వాఁడు శత్రువులను వసుధఁగూల్చు
వాఁడు క్షేత్రములకుఁ బాలకుండైనట్టి
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ మోపెట్టఁబడిన ధనస్సుచేత శత్రుసంహారము చేసి భక్తులను రక్షించువాఁడు అగు రుద్రునకు నమస్కారము. మఱియు క్షేత్రపాలకుఁడైన రుద్రునకు నమస్కారము.

నమ స్సూతా యాఽ హన్త్యాయ వనానాంపతయేనమః. 8

ప॥ నమః - సూతాయ - అహన్త్యాయ - వనానామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ సారథిత్వమందు సరిలేనివాఁడౌచు
వధకు నలవిగాని వాఁడు నౌచు
వనుల కెల్లఁ దానె బాలకుండై మించు
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ సారథియును వధకు నలవి గానివాఁడును అగు రుద్రునకు నమస్కారము. మఱియు వనపాలకుఁడగు రుద్రునకు నమస్కారము.

నమో రోహితాయ స్థపతయే వృక్షాణాం పతయేనమః. 9

ప॥ నమః - రోహితాయ - స్థపతయే - వృక్షాణామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ ఎఱుపు వర్ణమందు యొసఁగుచు ప్రభువైన
వానిఁ గూర్చి చేతు వందనంబు
మహిని వృక్షములకు మఱి రక్షకుండైన
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ ఎఱ్ఱని వన్నెకలవాఁడు ప్రభువైనవాఁడు అగు రుద్రునకు నమస్కారము. మఱియు వృక్షపాలకుఁడైన రుద్రునకు నమస్కారము.

నమో మన్త్రిణే వాణిజాయ కక్షాణాం పతయేనమః. 10

ప॥ నమః - మన్త్రిణే - వాణిజాయ - కక్షాణామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ రాజ సభలయందు రాజించు మంత్రియై
వణిజులందు బ్రాడ్వి వాకుఁడౌచు
వనములందు గుల్మ పాళిగా నొప్పెడి
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ రాజసభలయందు ప్రధానమంత్రియు (మంత్ర ప్రతిపాద్యుఁడన్న మాట) వ్యాపారస్తులయందు తగవరియు (కర్మవ్యాపారములయందు కర్మ సాక్షి యన్నమాట) వనములందు గుల్మాదులు (నదీ నదములు, గుహలు, గుల్మములు మొదలైన కక్షములు) అగు రుద్రుని కొఱకు నమస్కారము.

నమో భువన్తయే వారివస్కృతా యౌ షధీనాం పతయేనమః. 11

ప॥ నమః - భువన్తయే - వారివస్కృతాయ - ఓషధీనామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ ధాత్రి రక్షఁజేసి ధనము గల్పించుచు
నోషధాళికెల్ల నొజ్జయౌచు
భక్త వత్సలతను బరఁగి సర్వంబైన
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ భూ రక్షకుడు (ప్రపంచ కాధారుఁ డన్న మాట) ధనము చేయు వాఁడు (భక్తులకు ఇహమందు ధనసహాయము చేసి పరమందు మోక్షమిచ్చు వాఁడన్న మాట) ఓషధులకు నాయకుఁడు (ధాత్రియందు సమస్త ఓషధులను తనయందు కలవాఁడగుటయేగాక భక్తులపట్ల వారి అనుష్ఠానములకు తానె ఫలితమగునన్న మాట). అట్టి రుద్రునికొఱకు నమస్కారము.

నమ ఉచ్చైర్ఘోషాయాఽఽక్రన్దయతే పత్తీనాం పతయే నమః. 12

ప॥ నమః - ఉచ్చైర్ఘోషాయ - ఆక్రన్దయతే - పత్తీనామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ యుద్ధకాలమందు యుగ్రనాదం బొప్ప
శత్రువులకు ఖేద జనకుఁడౌచు
నిలఁబదాతి సైన్యములకు నాథుండైన
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ యుద్ధమందు హంకార హుంకారాదులచే శత్రుభయంకరముగా గర్జించువాఁడు (భక్తులయందు ప్రణవనాదస్వరూపుడు) అట్టి రుద్రునికొఱకు నమస్కారము. మఱియు పదాతిసైన్యములకు నాయకుడు (సమస్త పాపపంక్తులను కాలమట్టి నేలరాయువాడు) అగు రుద్రునకు నమస్కారము. పత్తియనగా "ఏకోరథో గజశ్చైకోనరాః పంచపదాతయః త్రయశ్చతురగాస్తద్ జ్ఞై పత్తిరిత్యభిధీయతే" ఒకరథము ఒకయేనుగు అయిదుగురు కాలి బంట్లు మూడు గుఱ్ఱములు చేరిన సేనాభాగమునకు పత్తియని పేరు.

నమః కృత్స్న వీతాయ ధావతేసత్త్వనాం పతయేనమః. 13

ప॥ నమః - కృత్స్నవీతాయ - ధావతే - సత్త్వనామ్ - పతయే - నమః.

ఆ॥వె॥ వాహినులును దానె బరివేష్ఠితుండౌచు
నరిసమూహములను దఱిమి తఱిమి
శరణు జొచ్చునట్టి సాత్వికులను బ్రోచు
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ సమస్త సైన్యములయందును పరివేష్ఠించియుండు వాడును శత్రు సైన్యములను తఱుమువాడును అగు రుద్రునకు నమస్కారము. మఱియు భక్తులైన సాత్వికులను రక్షించువాఁడగు రుద్రునకు నమస్కారము. (సమస్త జగత్తులయందును నిండియుండువాడును అరిషడ్వర్గాదులను నాశముచేయువాడును భక్తులపట్ల సత్వగుణ ప్రధానుడును అన్నమాట).

ఈయనువాకమునకు ఋషి మండూకుడు. ఛందస్సు మహాగాయత్రి. దేవత రుద్రుడు. అర్ధకృచ్ఛ్రము గావించి చరువు భుజించుచు నెనిమిదివేలు జపించునది. పూర్ణమగువఱకు సంధ్యాకాలములందు శివాలయమునకు పదునొకండు ప్రదక్షిణముల చొప్పున సేయుచుండవలెను. జపము ముగిసిన పిమ్మట శివుని బూజించి తత్సన్నిధానమున పదునొకండుగురు బ్రాహ్మణులను భుజింపజేయునది. ఇట్లు చేసినచో పురశ్చరణమగును. వీని ప్రయోగము రాజులకు జెప్పబడుచున్నది.

1. ప్రతి ఋతువునందును తైలముచే దడుపడిన యెఱ్ఱయావలు పదివేలు హోమముచేయునది. శత్రువులు నశింతురు.

2. ఆవపిండిచే దేవునకు లేపనముచేసి శత్రువు పేరుచ్చరింపుచూ ఎనిమిదివేలు

జపించగా పదునొకండు రాత్రులలో శత్రురాజులకు మహాజ్వరములగును. దానిచే వారలు నశింతురు.

3. యుద్ధము సమీపించునప్పుడు దేవునిమీద పసుపు పుట్టము గప్పి తాను శుద్ధుడై కుడిచేతి యంగుష్ఠముచే దాని స్పృశించుచు అనువాకాంతమున "గచ్ఛ" చేర్చి యెనిమిది వేలు ఐదుదినములు జపించవలెను. శత్రురాజుల కుచ్చాటనమగును.

4. మధుఘృతంబులచే దడుపబడిన పాలాశములుగాని అశ్వత్థములు గాని వైకంకతములు గాని అపామార్గములు గాని సమిధలు పదివేలు వేల్చగా బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులు వశంగతులగుదురు.

5. తేనెచే దడుపబడిన తెల్లగలువలు చెంగలువలు నల్లగలువలు పదివేలు వేల్చెనేని రాజ్యలక్ష్మిని పొందును.

6. కమలములు పదివేలు హోమము చేసెనేని శ్రీమంతుడగును.

7. కపిలగోవు నేతిచే దడుపబడిన ఫలాశ పుష్పములు పదివేలు వేల్చెనేని మేధావియగును.

8. పదునొకండువేల యావృత్తుల్ యనువాకము జపించెనేని శత్రువులను జయించును.

9. నిత్యము నూటయెనిమిదిగాని, యిరువదియెనిమిదిగాని యావృత్తులు జపపూర్వకముగా ప్రదక్షిణ నమస్కారములు యావజ్జీవము సేయునతడు ఈలోక సౌఖ్య మనుభవించి అంతమునం గైలాసము ప్రాప్తించును.

క. ముత్యాభరణాంచితుఁడును, నత్యంతము గంగతోడ నంబికతోడన్
నిత్యము గల్పచ్ఛాయను, సత్యాశ్రయుఁడైన భవుఁడు సాక్షాత్కరుఁడౌ.

ద్వితీయానువాకము సంపూర్ణము

## తృతీయానువాకారంభః

నమ స్సహమానాయ నివ్యాధిన అవ్యాధినీనాం
పతయేనమః 1

నమః - సహమానాయ - నివ్యాధినే - అవ్యాధినీనామ్ - పతయే - నమః

ఆ॥వె॥ శత్రుసైన్యములను సమయించువాఁడౌచు
నధిక రీతిఁ గొట్టు నతఁడునౌచు
నెల్లఁ గెల్చునట్టి హెచ్చైన సేనకు
పతికి నాకికి న్నుతి యొనర్తు.

తా॥ శత్రువులను జయించువాఁడును (పొరపాటున భక్తులపరాధములు చేసినను క్షమించునన్న మాట) దుష్టులను అధికముగా కొట్టు స్వభావము కలవాడును అగు రుద్రునికొఱకు నమస్కారము. అంతటను వ్యాపించి భక్తులు కానివారిని బాధించు సేనలకు అధికారియైన రుద్రునకు నమస్కారము.

నమః కకుభాయ నిషఙ్గిణే స్తేనానాం పతయేనమః 2

నమః - కకుభాయ - నిషఙ్గిణే - స్తేనానాం - పతయే - నమః

ఆ॥వె॥ ఎల్లలోకములకు హెచ్చైన వాఁడౌచు
ఖడ్గధారియైన ఘనుని గూర్చి
దొంగలందు పెద్దదొర కంతరాత్మయై
నట్టి రుద్రునకును నంజలిడుదు.

తా॥ సర్వలోకములందు ప్రధానుఁడును లేక ఉన్నతుడును ఖడ్గధారియు నగు రుద్రునికొఱకు నమస్కారము. మఱియు దాగియుండి దొంగిలించునట్టి వారికి నాయకుడైన వాని హృదయమైన రుద్రునికొఱకు నమస్కారము.

కకుభశబ్దార్థము : 1. ఏఱు మద్దిచెట్టు నందును, 2. దిక్కునందును, 3. కాంతియందును, 4. అందమునందును, 5. సంపెంగపూల దండయందును, 6. శిఖరమునందును, 7. ఊపిరియందును వర్తించునుగనుక, (1) ఏఱు మద్ది చెట్టువలె యున్నతమైన వాడనగా ప్రధానభూతుడు. (2) సమస్త జగత్తులకును తానే దిక్కైనవాడు. (3) అసమానమైన తేజస్సు

కలవాడు. (4) దివ్యమంగళ విగ్రహుండు. (5) పూలదండవలె మనోజ్ఞమైనవాడు. (6) కైలాస శిఖరమందుండువాడు లేక సర్వమునకు శిఖరరూపమైన వాడు. (7) జీవకోట్లయందు ఊపిరి అనగా ప్రాణమైన రుద్రుడు స్తేనాది శరీరములందు జీవరూపము, ఈశ్వరరూపము నను రెండు రూపములచే నుండును. అందు జీవరూపము వాచ్యార్థము. ఆ జీవుడు చౌర్యాది దోషములచే నిందనీయుడును, ఇక ఈశ్వర రూపము లక్ష్యార్థము. ఈశ్వరరూపము పాపక్షయ హేతువగుటవలన పరమపురుషార్థము కావున లక్ష్యార్థము వివక్షించి లౌకికశబ్దములు ప్రయోగింపబడునని తెలియవలెను. లక్ష్యార్థమనగా ముఖ్యార్థవాచకము.

నమో నిషఙ్గిణ ఇషుధిమతే తస్కరాణాం పతయేనమః 3

నమః - నిషఙ్గిణే - ఇషుధిమతే - తస్కరాణామ్ - పతయే - నమః

క॥ ధనువున సంధించుటకై, ఘన బాణముగొను హరునకుఁగల పొదులను మూ
పున దాల్చి యెల్లచోరుల, ననయము పాలించుభవున కగు చేమోడ్పుల్.

తా॥ ధనుస్సునందు సంధించుటకై చేతబట్టిన బాణము కలవాడును మూపున ధరించు బాణాధారముకలవాడును అగు రుద్రునకు నమస్కారము. మఱియు చోరపాలకుడగు రుద్రునకు నమస్కారము.

నమో వఞ్చతే పరివఞ్చతే స్తాయూనాం పతయేనమః 4

నమః - వఞ్చతే - పరివఞ్చతే - స్తాయూనామ్ - పతయే- నమః

సీ॥ క్షితిపతి కాప్తుఁడై యతనికి దానుగా
వించు కార్యములలో వేడ్కతోడ
ద్రవ్యంబుగాఁజేయు ధనవంచకునిరూపు
దానౌచు ప్రభువుఁగాఁ దానొనర్చు
వ్యవహారములయందు పరివంచకునిరీతి
గనిన రుద్రునకు వందనము మఱియుఁ
బాలక గృహములోపల మిత్రునట్లుగా
నితరు లెవ్వరు దన్ను నెఱుఁగనట్లు

నపహరింపచెడివారల కధికుఁడౌచు
సర్వశక్తుల దనయందె చాలియుండి
జగము పాలించు వాఁడైన శంభువునకు
మహిని సాగిలఁబడి నే నమస్కరింతు.

తా॥ ఆప్తునివలె నటించుచూ మోసము చేయువాడును, అన్ని వ్యవహారములందును మోసము చేయువాఁడును అగు రుద్రునికొఱకు నమస్కారము. మఱియు స్వామికి స్వీయునివలె యితరులకు తెలియకుండ యపహరించెడి వారలకు నాయకుఁడైన రుద్రుని కొఱకు నమస్కారము.

వంచకుడనగా తన యేలిక కాప్తుఁడైన వానివలె నటించుచు అతని వ్యవహారములలో మోసము చేసి ద్రవ్యము కాజేయువాడు.

స్తాయువు లనగా తనస్వామియొక్క ఇంటియందె పగలుగాని రాత్రి గాని యితరులకు తెలియకుండా ద్రవ్య మపహరించువారు.

నమో నిచేరవే పరిచరా యా రణ్యానాం పతయేనమః 5

నమః - నిచేరవే - పరిచరాయ - అరణ్యానామ్ - పతయే - నమః

క॥ దొంగిలుట కావకాశపు, సంగతి నారయుచు వేద్క స్వామిగృహమునన్
దొంగి మఱి జాగరూకత, సంగడుల న్దొంగిలించ నగు రూపమునన్

ఆ॥వె॥ దారి నడచువారి దండించి ధనమెల్ల
నపహరించ మఱియు నడవులందుఁ
గల్గు నట్టి దొంగ గమి నేస్తకాఁడైన
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ అపహరించుట కెప్పు డవకాశము చిక్కునాయను తలంపుతో తిరుగువాడును, అట్టి తలంపుతో నెల్లచోట్లయందు తిరుగువాడును అగు రుద్రునకు నమస్కారము. అరణ్య వాసులగు దొంగలకు ప్రభువైన రుద్రునకు నమస్కారము.

నమ సృకావిభ్యో జిఘాగ్ం సద్భ్యో ముష్ణతాం పతయే నమః 6

నమః - సృకావిభ్యః - జిఘాగ్ంసద్భ్యః- ముష్ణతామ్ - పతయే - నమః

నమో౽ సిమద్భ్యో నక్తఞ్చరద్భ్యః ప్రకృన్తానాం పతయే నమః 7

నమః - అసిమద్భ్యః - నక్తఞ్చరద్భ్యః - ప్రకృన్తానామ్ - పతయే - నమః

సీ. దంభోళిచే వారి తనవులు గాపాడుకొనుచుఁ బ్రాణులఁ జంపఁగోరువార
లైనచోరుల రూపమంది దీపించఁగాఁ గల్గువానికి నమస్కార మిదియ
సేద్యగాఁడై చోరవిద్యచే భూస్వామిధాన్యము న్హరియించు తంటగీంద్ర
నాథునిరూపమై నానావిధంబుల మీఱువానికి నమస్కార మిదియ.
కత్తిఁ దాల్చి తిరుగు ఘనచోరునకు రాత్రు
లందు దారివచ్చు నట్టివారి
దోచి బాధపెట్టు దొంగల దొరకొను
దొంగిలించు దొరకు దోయిలిడుదు.

తా॥ 1. దృఢమైన అయుధముచేఁ దమశరీరమును గాపాడు కొనుచు ప్రాణులను జంపగోరువారలైన చోరులరూపముగల రుద్రునకు నమస్కారము.

2. సేద్యగాండ్రయి తమయేలిక ధాన్యమును దొంగిలించువారి పాలకుఁడగు రుద్రునకు నమస్కారము.

3. కత్తి గలవారల కొఱకు కత్తి దాల్చిన చోరుల కొఱకును రాత్రి యందు దిరుగుచు దారివచ్చు వారిని బాధించు దొంగలకొఱకును రూపము గల రుద్రునకు నమస్కారము.

4. చంపి దొంగిలించు దొంగలకు దొరయైనవానికిని ఇంకను దొంగిలించువారికి పాలకుఁడైన వానికిని నమస్కారము.

నమ ఉష్ణీషిణే గిరచరాయ కులుఞ్చానాం పతయే నమః 8

నమః - ఉష్ణీషిణే - గిరిచరాయ - కులుఞ్చానామ్ - పతయే - నమః

కం॥ తలపాగఁ దాల్చి పెద్దగ
నలువొప్పఁగఁ దిరుగు చోరనాథుని కొఱకున్
మలలందు తిరిగి దోచుచు
నలరెడి దస్యువిభునకు నగుఁజేమోడ్పుల్.

తే॥గీ॥ అంతియెగాక గాశ్యపి నపహరించు
దొంగలకు నేతయైయొప్పు ధూర్జటికిని

నఖిలమైయొప్పు నాదిగృహస్తునకును
గోరిసల్పెద నే నమస్కారములను.

తా॥ తలపాగ ధరించి పెద్దమనుష్యులవలె దొంగతనమునకై తిరుగు వారియొక్కయు కొండలయందు గూఢముగా దిరుగుచూ దొంగిలించువారి యొక్కయు రూపముగల రుద్రునకు నమస్కారము.

మఱియు భూమి నపహరించునట్టి దొంగలకు నాధుఁడైన రుద్రునకు నమస్కారము.

**నమ ఇషుమద్భ్యో ధన్వావిభ్యశ్చ వోనమః. 9**

నమః - ఇషుమద్భ్యః - ధన్వావిభ్యః - చ - వః - నమః

ఆ॥ వసుధ శత్రువులను భయమందఁ జేయఁగా
బాణములను దాల్చి బరగువారు
మఱియు ధనువునందు కొఱకె ధరించిన
వారలైన రుద్రులార నతులు.

తా॥ రుద్రులారా! వింటి నెక్కు బెట్టు వారలైన మీ కొఱకు (శత్రువులను భయపెట్టుటకు) నమస్కారము. మఱియు బాణమును సంధించు వారలైన మీ కొఱకు నమస్కారము.

**నమ ఆతన్వానేభ్యః ప్రతిదధానేభ్య శ్చ వోనమః 10**

నమః - ఆతన్వానేభ్యః - ప్రతిదధానేభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ రుద్రులార ధనువు రూఢిగా మోపెట్టు
నట్టి మీ కొనర్తు నంజలులను
పరగ మోపొనర్చి బాణమున్ సంధించు
నట్టిమీకు మఱియు నంజలిడుదు.

తా॥ రుద్రులారా! వింటియందు అల్లెత్రాటి నెక్కుబెట్టు మీకు నమస్కారము. బాణము సంధించువారలగు మీకు నమస్కారము.

**నమ ఆయచ్ఛద్భ్యో విసృజద్భ్య శ్చ వోనమః. 11**

నమః - ఆయచ్ఛద్భ్యః - విసృజద్భ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ అంత నల్లెత్రాటి నాకర్షణముచేయు
నట్టి మీకొనర్తు నంజలులను
పరcగ ధనువునందు బాణమున్ సంధించు
వారలైన మీకు వందనంబు.

తా॥ రుద్రులారా! అల్లెత్రాటి నాకర్షించువారలైన మీకు నమస్కారము. బాణప్రయోగము చేయుచున్న మీకు నమస్కారము.

**నమోఽ స్యద్భ్యో విధ్యద్భ్య శ్చ వోనమః. 12**

నమః - అస్యద్భ్యః - విధ్యద్భ్యః - చ - వః - నమః.

ఆ॥ బాణమట్టిబట్టి పాఱునట్లుగc జేయు
వారలైన మీకు వందనంబు
శత్రుదేహములను చాలగా జొప్పించు
నట్టి మీకొనర్తు నంజలులను.

తా॥ రుద్రులారా! బాణమువేయుచున్న మీకు నమస్కారము. దానిని శత్రుదేహములో గ్రుచ్చుచున్న మీకు నమస్కారము.

**నమ ఆసీనేభ్య శ్శయానేభ్య శ్చ వోనమః. 13**

నమః - ఆసీనేభ్యః - శయానేభ్యః - చ - వః - నమః.

ఆ॥వె॥ కూర్చుcజెంద వేడ్క గూర్చుండి యున్నట్టి
మీకొనర్తు సతము మేటి నతులు
అంతశయనమంది నట్టి మీకొఱకును
బ్రణుతు లాచరింతు భవ్యులార.

తా॥ కూర్చుండియున్న మీకొఱకు నమస్కారము. పరుండియున్న మీకొఱకు నమస్కారము.

**నమ స్స్వపద్భ్యో జాగ్రద్భ్య శ్చ వో నమః. 14**

నమః - స్వపద్భ్యః - జాగ్రద్భ్యః - చ - వః - నమః

నమ స్తిష్ఠద్భ్యో ధావద్భ్య శ్చ వోనమః. 15

నమః - తిష్ఠద్భ్యః - ధావద్భ్యః - చ - వః - నమః.

తే॥ అంత నిదురవోవు నట్టి మిమ్ము నుతింతు
మేలుకొన్న యట్టి మిము భజింతు
అంత నిలచియున్న యట్టి మిమ్ము నుతింతు
బర్వులెత్తు మీకుఁ బ్రణుతులిడుదు.

తా॥ నిదురించుచున్న మీకు నమస్కారము. మేలుకొన్న వారలగు మీకు నమస్కారము. నిలిచియున్న మీకు నమస్కారము. పరుగెత్తుచున్న మీకు నమస్కారము.

నమ స్సభాభ్య స్సభాపతిభ్య శ్చ వోనమః. 16

నమః - సభాభ్యః - సభాపతిభ్యః - చ - వః - నమః

నమోఅశ్వేభ్యోఽశ్వపతిభ్యశ్చ వోనమః. 17

నమః - అశ్వేభ్యః - అశ్వపతిభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ గుంపుగూడి వేడ్క కూర్చున్న వారికి
వారి కొడయలైన వారలకును
నశ్వరూపులైన నధిదేవతలకును
గోరి నతులు రుద్రులార జేతు.

తా॥ సభలుగా జేరి కూర్చున్న మీకు నమస్కారము. ఆసభలకు ప్రభువులైన మీకు నమస్కారము. గుఱ్ఱముల రూపములైన మీకొఱకు నమస్కారము. వాటికి ప్రభువులైన మీకు నమస్కారము.

ఈ యనువాకమున తొమ్మిదవ మంత్రమునుండి నమస్కరింపబడిన వారు దేవుని యనుచరులు లేక ఆయన లీలావిగ్రహ విశేషులు. ఈ యనువాకమునకు ఋషి మహాదేవుడు. ఛందస్సు బృహస్పతి. దేవతయు మహాదేవుడే. ఒక ప్రాజాపత్యముచేసి యయిదు వేలావృత్తులు జపించినచో. ఋరశ్చరణ సిద్ధియగును. దేశము వ్యాధులచే పీడింప బడుచున్నప్పుడు రాజు -

పదునొకొండుగురు సిద్ధులగు బ్రాహ్మణులను సంపాదింపవలెను. అందైదుగురు జపమును, ఐదుగురాజ్యహోమమును జేయవలెను. ఒకడు నమశ్శబ్దము వచ్చునప్పుడు తిలౌదనము వేల్చుచుండునది. ఇట్లు లక్షావృత్తులు గావించినచో జనపథంబునందు వ్యాధులుండవు.

నువ్వులపిండి గలిపిన యపూపములు అహుతి ప్రమాణము గలవి పదునొకండు వేలు వేల్వవలయును. వాహనములకు సామాన్యవ్యాధి నశించును.

వాహనముల కొట్టమునందు నేయిగలిపిన యుత్తరేణు బియ్యముచే నెనిమిది వేలాహుతులు వేల్చునట్లయిన వాహనముల వ్యాధులడగును.

శివాలయమందు నేతితో దడుపబడిన శుద్ధతండులములచే లక్షాహుతులు వేల్చగా ప్రధానమంత్రి వ్యాధి యడగును. ధూర్వల చేత నపామార్గముల చేత నెనిమిదేసి వేలాహుతులు వేల్వగ నితర మంత్రుల కారోగ్యము కలుగును.

ఇక రాజునకు వ్యాధి గలిగినపక్షమున సిద్ధులగు ఇరువదియొకండు గురుబ్రాహ్మణులు అన్ని ప్రక్కల రాజుయొక్క ప్రమాణముగల కుండమునిర్మించి యందు మథితాగ్నిం బ్రతిష్ఠించి హోమముచేయవలెను. అందొక్కడు బ్రహ్మగను తక్కిన యిరువది మంది ఇద్దఱేసి యొకటిగా జేరి యొక్కొక్క హోమ ద్రవ్యముచే వేల్వవలయును. (తండులములు, తిలలు, చామలు, నీవారము, అపామార్గము, ధూర్వలు, కమలములు, కింజల్కములు, శుద్ధోదనము, అజ్యము) ఈ పది హోమద్రవ్యములు. ఇవ్వి అవునేతిలో దడుపబడినవై యుండవలెను. అయగ్ని కుండమునకు నైరృతిదిశను జలపూర్ణకలశము బ్రతిష్ఠించి బ్రహ్మ దానిని స్పృశించుచు జపము చేయవలెను. ఇట్లు ప్రతిదినము ఏడు నాడికలు నిరంతరము గావింపవలెను. ఇట్లొక అమావాస్య మొదలుకొని మఱల అమావాస్యవఱకు జేయునది. రాజునకు వ్యాధి అధికముగా నున్నచో నుదయము మొదలు అస్తమయముదనుక హోమముచేయవలెను.

సంపూర్ణముగా దక్షిణలీయవలెను. అచార్యునకు ద్విగుణ దక్షిణ నీయవలెను. రాజు ఉపభోగించు వస్తువులను గలశజలముచే బ్రోక్షించ వలెను. రాజారోగ్యవంతుడగును.

నువ్వులు నేయి కలిసిన శుక్లతండులములచే నీయనువాకము పఠించుచు నెనిమిది వేలాహుతులు ప్రతిదినమును వేల్వగా రాజు దీర్ఘాయువగును.

నేయి చేతను దేనెచేతను దడుపబడిన తిలవ్రీహియవలచే నెనిమిది వేల అహుతులు వేల్చినయెడ ఇతరుల రోగములు నశించును.

ఇక నీయనువాకముచే నభిచారములు చెప్పబడును. శత్రురాష్ట్రమునకు రోగపీడ గోరువాడు "రిపురాష్ట్రం సముద్దిశ్యాభిచారం కరోమి ఫట్ స్వాహా" అని మంత్రాంతమున

నుచ్చరించుచు పంది మొదలగువాని మాంసముచే లక్షహోమము చేయునది. ఒక మాసమున శత్రురాష్ట్రమును అందలి ప్రజలును ఘోషింతురు. ఎఱ్ఱనూలుచే జుట్టబడిన వికంకతసమిధలచే లక్ష హోమము చేసిన యెడల శత్రువునకు మహాజ్వరము కలుగును. శత్రుదేశము నందలి జనులు వాడుకొనుజలము మొదలగువానిని తాకిగాని చూచిగాని లక్షజపముచేయునది. ఆవస్తువు నుపభోగించినవాడు ఒక సంవత్సరములో నాశనమగును. శ్మశానాగ్నియందు జిల్లేడు సమిధలచే లక్ష హోమము గావించె నేని శత్రుపట్టణము నశించి అర్కారణ్యమగును.

చాముండాలయమందు దక్షిణాభిముఖుడై నూనెచే దడుపబడిన మినుములు నువ్వులచే బదునొకండు వేలాహుతులు వేల్చునది. శత్రుదేశపు జనులు మసూచికచే బాధింపబడుదురు.

పడమటి వాకిలిగల శివాలయమునందు దేవుని పాదపీఠమున అపస్మారి యగు నగ్నిని ధ్యానించి ఏడువేలు జపముచేయవలెను. మంత్రాంతమున "శత్రురాజ్యే ప్రజ్వలజ్వాలాపస్మారిన్" అని పఠింపవలెను. ఇందుచే శత్రు వపస్మారరోగము గలవాడగును.

మఱియు శత్రురాజు ఎల్లచోట్ల నుండునట్లు తలచుచు తెల్లని బియ్యపు పిండిచే లక్షహోమము చేసినచో శత్రురాజు రాజయక్ష్మపొంది దానిచేతనే నశించును.

సీ॥ శిరమునందున బింభవర మొప్పఁగాశుద్ధ
విధుసమంబౌ మోమువిధమువాఁడు
రూపయౌవన కళారూఢాంచితుండును
నిరువదేడుల ప్రాయ మెసగువాఁడు
ముదువఁగా బడినట్టి జడలుగల్గినవాఁడు
కడిమిపూసలదండ లిడినవాఁడు
తనతో సమానమై తనమేన నొప్పెడి
భూషితార్యనుగాంచి పొంగువాఁడు
పిల్లలెందరొ దనచుట్టు గొల్లుమనఁగ
వేలుకుక్కలు భౌ యంచు వెల్లివిఱియ
బల్కిరాతపు రూపాన బఱగునట్టి
యభవుఁడె వానికగుపించు నంచితముఁగ.

తృతీయానువాకము - సంపూర్ణము

## చతుర్థానువాకారంభః

నమ అవ్యాధినీభ్యో వివిధ్యన్తీభ్య శ్చ వో నమః. 1

నమః - అవ్యాధినీభ్యః - వివిధ్యన్తీభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ సర్వమొప్ప గెల్వు సాధ్వీ స్వరూపులౌ
మీకుఁ గేలుమోడ్తు మిక్కుటముగ
మఱియుఁ గొట్టునట్టి మహిళాస్వరూపము
వారలైన మీకు వందనంబు.

తా॥ రుద్రులారా అంతటను గెల్చునట్టి స్త్రీమూర్తులైన మీకు నమస్కారము. విశేషించి కొట్టునట్టి స్త్రీమూర్తులగు మీకు నమస్కారము.

నమ ఉగణాభ్య స్తృగ్ం హతీభ్య శ్చ వో నమః. 2

నమః - ఉగణాభ్యః - తృగ్ం హతీభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ సప్తమాతృకలను శక్తులై యొప్పెడి
మీకు దోయిలిడుదు మిక్కుటముగ
మఱియు హింససేయు మహనీయ దుర్గాదు
లైన మీకొనర్తు నంజలులను.

తా॥ రుద్రులారా! సప్తమాతృకలు మొదలుగాగల శక్తులరూపముగల మీకొఱకు నమస్కారమగుగాక. మఱియు హింసించుటకు సమర్థలగు దుర్గ మొదలైన రూపముగల వారగు మీకు నమస్కారము.

ఇరువదియేడు రథములు, అన్ని యేనుగులు, ఎనుబదియొక్క గుఱ్ఱములు, నూటముప్పదియయిదుగురు కాల్బరునుగల సేనావిశేషము గణమనబడును. ఇట్లతిశయించిన గొప్ప సేనలుగలవారలైన స్త్రీ దేవతలరూపము గల మీకు నమస్కారమన్నమాట.

నమో గృత్సేభ్యో గృత్సపతిభ్య శ్చ వో నమః. 3

నమః - గృత్సేభ్యః - గృత్సపతిభ్యః - చ - వః - నమః

తే॥గీ॥ ఆశపడునట్టి ధర్మంబునందుమీకు
నామస్ పూర్వకంబైన - నతులొనర్తు
వీకదళ్ళాలకులు నైన మీకొఱకును
భక్తి యుక్తిని గావింతు వందనంబు.

తా॥ విషయలోలుర రూపముగల మీకొఱకు నమస్కారము మఱియు విషయాసక్తుల పాలకులైన మీకు నమస్కారము.

గృత్సులనగా బుద్ధిమంతులుగా జీవించువారనియు యొకరూపము.

నమో వ్రాతేభ్యో వ్రాతపతిభ్య శ్చ వోనమః. 4

నమః - వ్రాతేభ్యః - వ్రాతపతిభ్యః - చ - వః - నమః

క॥ నానావిధ జాతులుఁగా, గానంబడు రూపములను కమనీయులునై
మానక తత్ప్రభువులుఁగా, నానందితులైన మీకు నంజలు లిడుదుఁ.

తా॥ రుద్రులారా! నానాజాతుల రూపముగల మీకు నమస్కారము. ఆ సమూహములకు ప్రభువులైన మీకు నమస్కారము.

నమో గణేభ్యో గణపతిభ్య శ్చ వోనమః. 5

నమః - గణేభ్యః - గణపతిభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ ప్రమధుల నెడి భూత పతులైన మీకును
భక్తితోడఁ జేతుఁ బ్రణతులింక
మఱియు వాని పతుల మహిమ రూపించెడు
నట్టి మీకు నతుల నాచరింతు.

తా॥ రుద్రులారా! ప్రమధులను భూతరూపములుగల మీకు నమస్కారము. అట్టి గణములకు పాలకులయిన రూపముగల మీకు నమస్కారము.

నమో విరూపేభ్యో విశ్వరూపేభ్య శ్చ వోనమః. 6

నమః - విరూపేభ్యః - విశ్వరూపేభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ అతివిరూప సత్వులైన మీకొఱకింక
చాలభక్తి తోడఁ గేలుమోడ్తు
మఱియు విశ్వరూప మహిమఁ జెన్నొందెడి
వారలైన మీకు వందనంబు.

తా॥ వికృతాకారులు (దిగంబరులు హెచ్చు తక్కువలైన యవయవములు గలవారు) అగు మీకు నమస్కారము.

సర్వరూపధారులైన మీకు నమస్కారము.

నమో మహద్భ్యః క్షుల్ల కేభ్య శ్చ వోనమః. 7

నమః - మహద్భ్యః - క్షుల్లకేభ్యః - చ - వః - నమః

క॥ అణిమాదులందు సిద్ధిత, గుణమయులైనట్టి మిమ్ముఁగూర్చి నతింతున్
అణిమాది సిద్ధులందని, గుణహీనులకొఱకు గూడ కోరినతింతున్.

తా॥ రుద్రులారా! అణిమాద్యష్టైశ్వరములందు గొప్పవారల రూపము గల మీకు నమస్కారము.

అట్టి అణిమాది సిద్ధులులేని రూపముగల మీకు నమస్కారము.

ఎవరు జ్ఞానము చేతను ఆకారముచేతను ప్రభావముచేతను గొప్పవారలును, ఎవ్వరు సూర్య చంద్ర నక్షత్రసహితమగు ఆకాశమును భూమియందు నిర్మించియు, అష్టైశ్వర్యముల నొందియు నాశ్చర్యపడరో ఎవ్వరి కార్యములచే భగవంతునకు తృప్తియగునో వారు మహచ్ఛబ్దవాచ్యులు. ఇక అణిమ, గరిమ; మహిమ, లఘిమ, ప్రాప్తి, (మనస్ఫూర్తి) ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము, ఈ యెనిమిది అష్టైశ్వర్యములు. ఇవ్వి కలవాడు భగవంతుడు.

నమో రథిభ్యో ఽ రథేభ్య శ్చ వోనమః. 8

నమః - రథిభ్యః - అరథేభ్యః - చ - వః - నమః

తే॥ రథముగలవారికిని వేడ్క రథమునెక్కి
యున్నవారికి వందనం బొప్పఁ జేతు
నంతియేగాక రథము లేనట్టివార
లైన మీ కేను గావింతు నంజలులను.

తా॥ రథమారోహించియున్న రూపముగల మీకొఱకు నమస్కారము. రథములేనట్టి రూపముగల మీకొఱకు నమస్కారము.

నమో రథేభ్యో రథపతిభ్య శ్చ వోనమః. 9

నమః - రథేభ్యః - రథపతిభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ స్యందనస్వరూప శాలురౌ మీకును, నధికవందనంబు లాచరింతు
నట్టివాని కెల్ల నధిపతులైమించు, వారలైనమీకు వందనంబు.

తా॥ రథముల రూపముగల మీకు నమస్కారము. రథములకు నాథులగు రూపముగల మీకు నమస్కారము.

రథశబ్దము - రథమునకును శరీరమునకును అన్వయించును. "అర్కాబ్జనేమిర్వేదాశ్వస్త్రయ స్త్రింశన్మరున్మయః, పురారేః కల్పితో దేవైనరథో బ్రహ్మాసారథిః" (భవిష్యత్పురాణము) అనగా సూర్యచంద్రులు చక్రములుగా గలదియు ముప్పదిమూడు కోట్ల దేవతలవికారమైనదియు బ్రహ్మాసారథిగా గలదియు నాలుగువేదములు గుఱ్ఱములుగా గలదియు నగు పురహరుని రథము దేవతలచే నిర్మించబడినది అనగా దేవునియొక్క రథావయవములన్నియు దేవతల శరీరములే అయియున్నవి.

నమ స్సేనాభ్య స్సేనానిభ్య శ్చ వోనమః. 10

నమః - సేనాభ్యః - సేనానిభ్యః - చ - వః - నమః

ఆ॥వె॥ సేనరూపమొప్ప సిద్ధమౌ మీకును, భక్తితో నొనర్తు వందనంబు
వాని నాయకులుగ వర్థిల్లుమీకును, వందనములఁ జేతు భవ్యులార.

తా॥ రుద్రులారా! సేనలరూపమైన మీకు నమస్కారము. సేనాపతుల రూపమైన మీకు నమస్కారము.

నమః క్షత్తృభ్య స్సంగ్రహీతృభ్యశ్చ వోనమః. 11

నమః - క్షత్తృభ్యః - సంగ్రహీతృభ్యః - చ - వః - నమః

తే॥గీ॥ అశ్వములను దోలునట్టి మీ కొఱకును
నధిక నతులొనర్తు నంచితముగ

మఱియుఁ బగ్గములను మహనీయముగ బట్టి
తోలు నట్టి మీకు దోయి లిడుదు.

తా॥ రుద్రులారా! గుఱ్ఱములను మరపువారలగు మీకొఱకు నమస్కారము. సారథుల రూపముగల మీకు నమస్కారము.

నమ స్తక్షభ్యో రథకారేభ్య శ్చ వోనమః. 12

నమః - తక్షభ్యః - రథకారేభ్యః - చ - వః - నమః

తే॥గీ॥ తక్షరూపమందు దనరారు మీకును
వందనంబొనర్తు భక్తితోడ
ఘనత రథము సేయు కరుమలవాండ్రుగా
నైన మీకొనర్తు నంజలులను.

తా॥ రుద్రులారా! వడ్రంగులరూపముగల మీ కొఱకు నమస్కారము. రథముసేయు రూపముగల మీకు నమస్కారము.

వడ్రంగి = విస్తారముగా కొయ్యతో సంబంధించిన పనిచేయువాఁడు, కరుమల = విస్తారముగా ఇనుము సంబంధమైన పనిచేయువాడు.

నమః కులాలేభ్యః కర్మారేభ్య శ్చ వోనమః. 13

నమః - కులాలేభ్యః - కర్మారేభ్యః - చ - వః - నమః

తే॥ కుమ్మరీంద్రరూపు కొమరొప్పు మీకును, వందనం బొనర్తు భక్తితోడ
మఱియుఁ గర్మరీల మహితస్వరూపంబు, నందినట్టి మీకు నంజలిడుదు.

తా॥ కుమ్మరివాండ్ర రూపముగల మీకు నమస్కార మగుగాక. కర్మరుల రూపముగల మీకు నమస్కారమగుగాక.

నమః పుఞ్జిష్టేభ్యో నిషాదేభ్య శ్చ వోనమః. 14

నమః - పుఞ్జిష్టేభ్యః - నిషాదేభ్యః - చ - వః - నమః.

ఆ॥వె॥ పక్షిజాలములను బంధింప నేర్చిన
యట్టి మీకొనర్తు నయ్య మ్రొక్కు

మఱియు మత్స్యములను బ్రమందఁజేసెడివార
లైన మీ కొనర్తు నంజలులను.

తా॥ పక్షులను బంధించువారి రూపముగల మీకు నమస్కారము. మత్స్యములను చంపువారల రూపముగల మీకు నమస్కారము.

నమ ఇషుకృద్భ్యో ధన్వకృద్భ్యశ్చ వోనమః. 15

నమః - ఇషుకృద్భ్యః - ధన్వకృద్భ్యః - చ - వ - నమః.

తే॥గీ॥ బాణములను జేయు భవ్యులౌ మీకును
నంజలిడుదు భక్తి నదియుఁగాక
ధనువులొప్పఁజేయు ఘనులైన మీకును
కేలుమొగ్గి జేతుఁ జాలభక్తి.

తా॥ రుద్రులారా! మంచిబాణములు చేయువారి రూపముగల మీకు నమస్కారము. మంచి ధనుస్సులను చేయువారి రూపముగల మీకు నమస్కారము.

నమో మృగయుభ్య శ్శ్వనిభ్య శ్చ వోనమః. 16

నమః - మృగయుభ్యః - శ్వనిభ్యః - చ - వః - నమః.

తే॥గీ॥ వేటలాడువారి విధమైన మీకును జేతు వందనంబు ప్రీతితోడ
తలప శునకపాలకుల రూపమున నొప్పునట్టి మీకుఁ జేతు నంజలులను.

తా॥ వేటకాండ్ర రూపముగల మీకు నమస్కారము. కుక్కలను పాలించువారి రూపముగల మీకు నమస్కారము.

నమ శ్శ్వభ్య శ్శ్వపతిభ్య శ్చ వోనమః. 17

నమః - శ్వభ్యః - శ్వపతిభ్యః - చ - వః - నమః.

ఆ॥వె॥ కోర్కె శునకపాళి కొఱకైన రూపంబు
నందినట్టి మీకు నంజలిదిగో
మఱితదీయ నాథ మహిమ రూపించిన
వారలైన మీకు వందనంబు.

తా॥ కుక్కలరూపముగల మీకు నమస్కారము. వాని క్షేత్రపాలకులైన మీకు నమస్కారము.

ఇందు దేవుడు విలాసార్థము ధరించు నానామూర్తులందు ప్రధానీకరించి స్తోత్రము సేయబడెను. తృతీయానువాకమున ఘోరమూర్తిని ప్రధానీకరించి స్తోత్రము సేయబడెనని విభాగము. ఇక నీయనువాకమున కొక ప్రాజాపత్యకృచ్ఛ్రమున్కు తదర్థమును చరించి తొమ్మిదివేలు జపించి యెనిమిది వేలు ప్రదక్షిణములు సేయవలెను. అంతవఱకు నిరంతరము జపించుచుండునది. పురశ్చరణ సిద్ధుడగును. ఇందు తిథ్యాదినియమములేక ఇష్టమగునప్పుడు సేయవచ్చును. రాజయక్ష్మ పీడితుడగువాడు సిద్ధుడగు బ్రాహ్మణునిచే శాంతి చేయించుకొనవలెను. ఆ సిద్ధుడు రోగపీడితునింట బాహుప్రమాణ మగు కుండము గావించి యతని యగ్నిం బ్రతిష్ఠించి దానిముందట వేది నిర్మించి అందు జలపూర్ణమును తంతువేష్టితమునగు నూతనఘటము ప్రతిష్ఠించి దానియందీ యనువాకముచే దేవు నావాహముచేసి గంధాదులచే బూజించి కర్పూరగంధము తామరసపుష్పము ఉశీరాది దశాంగధూపము ఆజ్యదీపము సమర్పించి పదునొకొండు దినములు దీక్షవహించి చేయవలెను. ప్రారంభ దినమున ఆవాహనాది మంత్రపుష్పాంతము నారాధించి ఈ యనువాకముచే పదునొకండు మాఱులు ప్రతినమస్కారముగా నేతిచే హోమము చేసి తత్సన్నిధానమునం దిరువదియొక్క వేలు జపించవలెను. తుదివఱకు అగ్నిని రక్షింపవలెను. మఱునాడు నిత్యకార్యానంతరము నేతిచేతను తేనెచేతను దడుపబడిన తిలలాజదూర్వా వ్రీహి యవలచే నీయనువాకము పదునొకండావృతులుగా బ్రతినమస్కారము హోమము సేయవలెను. ఆ పిమ్మట మూడుదినములు నిత్యమును తేనె గలిపిన నేతిచే వేల్వవలయును. అటుపిమ్మట నట్లే యొనర్చునది. ఆఱవదినమున నశ్వత్థసమిధల చేతను, నేడవదినమున నుత్తరేణు సమిధలచేతను హోమముచేయునది. అటుపిమ్మట నొకదినము నిత్యకర్మలకు విరోధము లేకుండునట్లు ఉదయము మొదలు అస్తమయపర్యంతము జపము సేయవలెను. తొమ్మిదవదినమందు తేనెగలిపిన నేతిచే హోమము సేయునది. పదియవదినమందు ఉదయము మొదలు అస్తసమయ పర్యంతము జపించునది. పదునొకండవ దినమందు ఈ యనువాకము జపించుచు నెనిమిది వేల తామరసపుష్పములచే ప్రతినమస్కారము జేయుచు దేవుని బూజింపవలెను. పిమ్మట గౌరీపూజ చేయవలెను. అంత బ్రాహ్మణాశీర్వాదము పొందవలెను. వేఱువేఱుగా దక్షిణలీయవలెను. అటుపైని కర్మదక్షిణ నీయవలెను. సమ్మిష్టి గోదానమియ్యవలెను. అనంతరము దేవోద్వాసనము సేయవలెను. అంత గలశజలముచే కర్తను స్నానము సేయించవలెను. లేదా ప్రోక్షించవలెను. అప్పుడు రాజయక్ష్మ నశించి శంభుప్రసాదముచే దీర్ఘాయువగును. మేహపీడితుడు తనయగ్ని యందు

ప్రతినమస్కారముగా తొమ్మిది వేలాహుతులు వేల్చగా దత్శాంతియగును. ఈ యనువాకము లక్షసార్లు జపించినట్లయి కుష్ఠ మొదలగు వ్యాధులు నశించును.

ప్రతి నమస్కారము ఒక్కొకటిచొప్పున నెనిమిది వేల యెఱ్ఱదామర పూవులను బొడ్డుబంటి నీటి ప్రవాహమున నిలుచుండి ఈ యనువాకమును జపించుచు జలమునందు వేసి భృంగిరిటి పూజచేసినచో మహాజ్వరము నశించును. దీనికి విద్వాంసుడైన బ్రాహ్మణుడే గురువుగానుండవలెను. లేనిచో విఘ్నమగును.

చ॥ ఎసఁగు విభూతి చేత దనువెల్లను శోభితమైన వానిని
నృసదన మొప్పఁగా వెలుఁగు బాడబనేత్రము సొంపుఁ గూర్పఁగా
నసదృశమైన వానిని గజానను నందుచు నందిరాట్టు న
న్నసితపు కాంతిఁ దేజరిలు వానిని రుద్రునిఁ గాంచఁగా నగుౕ.

చతుర్థానువాకము సంపూర్ణము

## పంచమానువాకారంభః

నమో భవాయ చ రుద్రాయ చ. 1

నమః - భవాయ - చ - రుద్రాయ - చ.

క॥ జీవుల కనాదికారణ, మై వర్ధిలినట్టివాని కగు చేమోడ్పున్
అవిధి నిరోధనంబుల, దౌవిషమును బాపువాని కగు వందనముల్

తా॥ ప్రాణులకు కారణమైన వాని కొఱకును దుఃఖమును పోగొట్టు వాని కొఱకును నమస్కారము.

చతుర్థానువాకముతో నుభయతో నమస్కారములగు యజుస్సులు ముగిసెను. ఇందు నమస్కారము మొదలుగాగల యజుస్సులలో వాడబడును. భవాయచ = అనగా ఎల్లప్పుడు అన్నిచోట్ల నుండువాడనియు, ఒకప్పుడు లేనివాడు కాడనియు లేక "సర్వం భావయతి" సమస్తమును కలుగ జేయువాడనియు లేక "సర్వైఃభావ్యతే" అందఱిచేత ధ్యానింపబడు వాడనియు లేక "అస్మిన్ సర్వమ్ భవతి" సమస్తము ఇతనియందుంచుకొన్న వాడనియు భావములు. రుద్రాయచ = అనగా "సర్వమ్ అంతకాలే రోదయతి" ఇతి రుద్రః. ప్రళయకాలమందు సమస్తము నేడిపించువాడు.

నమశ్శర్వాయ చ పశుపతయే చ. 2

నమః - శర్వాయ - చ - పశుపతయే - చ.

ఆ॥వె॥ ఎల్లపాపములను హింసించు నతనికి
మఱియు బురుష పశు సమాజపతికి
నధిక వందనంబు లనిశంబు గావింతు
మోక్షసిద్ధి కొఱ కమోఘముగను.

తా॥ పాపములను బోగొట్టువాని కొఱకును అజ్ఞానులగు పురుషులకు పాలకుడైనవాని కొఱకును నమస్కారము.

నమో నీలగ్రీవాయ చ శితికణ్ఠాయ చ. 3

నమః - నీలగ్రీవాయ - చ - శితికణ్ఠాయ - చ.

ఆ॥వె॥ కప్పుగల్గినట్టి కంఠమధ్యంబును
తక్కుమేను తెల్లదనము మిగులు
నట్టిదీప్తిఁగాంచి యధికుఁడై యొప్పెడి
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ నల్లని కంఠమధ్యముగలవాని కొఱకును తెల్లనైన తక్కిన కంఠ ప్రదేశముగలవాని కొఱకును నమస్కారము.

కాలకూటధారణముచే భగవంతుని కంఠమునందు కొలదిభాగము మాత్రమే నల్లనై తక్కిన కంఠమంతయు తెల్లగనే యుండునని భావము.

**నమః కపర్ది నే చ వ్యుప్తకేశాయ చ.** 4

నమః - కపర్దినే - చ - వ్యుప్తకేశాయ - చ.

తే॥ జూటధారియగుచు మేటియౌ వానికి
మఱియు బోడియైన శిరముఁ గల్గి
యజ్ఞక ర్తయగుచు నవల శోభించెడి
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ జటాజూటముగలవాని కొఱకును ముండితమైన శిరస్సుగలవాని కొఱకును నమస్కారము.

అర్ధముండి = వ్యుప్తకేశు డనంబడును. ఇతడు యజమూర్తికధిష్ఠాత.

**నమ స్సహస్రాక్షాయ చ శతధన్వనే చ.** 5

నమః - సహస్రాక్షాయ - చ - శతధన్వనే - చ

ఆ॥వె॥ వేయి కన్నులొప్ప వెల్గుభవ్యునకును
నూఱు ధనువులందు చారుమూర్తి
యౌచు మహిమఁగాంచి యభువుఁడై యొప్పెడి
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ వేయి కన్నులుగలవాని కొఱకును, నూఱుధనుస్సులు గలవాని కొఱకును నమస్కారము.

వేయికన్నులుగల ఇంద్రరూపుడైనవాడును, హెచ్చు భుజములుగల అనంతమూర్తియు

నితడేయగునని భావము.

ఆరు మొదలు 15 వరకుగల మంత్రార్థముల కనువాదము ఒక్కొక్క మంత్రమునకు పద్యములో రెండేసి పాదములే వాడబడును.

నమో గిరిశాయ చ శిపివిష్టాయ చ. 6

నమః - గిరిశాయ - చ - శిపివిష్టాయ - చ

ఆ॥వె॥ వెండికొండయందు విలసిల్లు నతనికి
మతి ప్రవిష్టరూప మండితునకు.

తా॥ కైలాస పర్వతమందుండు వానికొఱకును, విష్ణుస్వరూపుఁడైన వాని కొఱకును నమస్కారము.

గిరిశాయచ - యనగా కైలాసనాధుని కొఱకనియు, "గిరామ్ ఈశః వాచకములైన వేదములకు నాధుడు అనగా ప్రణవమునకు నాధుడనిభావము. శిపివిష్టార్థము = శివుని యందును విష్ణునందును కూడా స్ఫురించుటజేసి సర్వ ప్రాణులయందును అంతర్యామి రూపమున వ్యాపించినవా డితడేననిభావము. ఇది శివకేశవుల కభేదమును దెలుపుచున్నది.

నమో మీఢుష్టమాయ చే షుమతేచ. 7

నమః - మీఢుష్టమాయ - చ - ఇషుమతే - చ.

తే॥ వారివాహమౌచు వర్షించువానికి
బాణధారియైన వానికొఱకు.

తా॥ మేఘరూపమున వర్షించువాని కొఱకును, బాణములు ధరించిన వారి కొఱకును నమస్కారము. (మహాశూరుడని భావము)

నమో హ్రస్వాయ చ వామనాయ చ. 8

నమః - హ్రస్వాయ - చ - వామనాయ - చ.

ఆ॥వె॥ అల్పరూపమైన యట్టి దేవునకును
వామనుండునైన వానికొఱకు.

తా॥ పొట్టివాని కొఱకును, సంకుచితమైన యవయవములు గలవాని కొఱకును నమస్కారము.

నమో బృహతే చ వర్షీయసే చ. 9

నమః - బృహతే - చ - వర్షీయసే - చ.

ఆ॥వె॥ రూపమందుగొప్ప రూపించువానికై
వరగుణుండునైన వానికొఱకు.

తా॥ ఆకారముచే గొప్పయైనవానికొఱకును గుణములచే నధికుడైన వానికొఱకును నమస్కారము.

నమో వృద్ధాయ చ సంవృధ్వనే చ. 10

నమః - వృద్ధాయ - చ - సంవృధ్వనే - చ.

ఆ॥వె॥ వయసు జెల్లినట్టి వర్ధిష్ఠువునకును
వేదనుత్యుఁడైన విజ్ఞునకును.

తా॥ వయసుచే నధికుని కొఱకును వేదములచే పొగడబడిన వాని కొఱకును నమస్కారము.

వృద్ధుడనగా భక్తుల స్తోత్రములచే వృద్ధిబొందుచున్న వాడినియు లేక భక్తులకు వృద్ధిబొందించువాడనియు భావము.

నమో అగ్రియాయ చ ప్రథమాయ చ. 11

నమః - అగ్రియాయ- చ - ప్రథమాయ - చ.

ఆ॥వె॥ జగముకన్న ముందు జనియించి నతనికి
మఱియుఁ బ్రథమపురుషవరుని కొఱకు.

తా॥ జగత్తు పుట్టుటకు ముందున్న వాని కొఱకును ముఖ్యుఁడైనవాని కొఱకును నమస్కారము.

నమ ఆశవే చా జిరాయచ. 12

నమః - ఆశవే - చ - అజిరాయ - చ.

ఆ॥వె॥ నెరసి జగములెల్ల నిండినవానికి
గమనమందు మిగులు ఘనుని కొఱకు.

తా॥ శీఘ్రముగా వ్యాపించువాని కొఱకును, గమనమందు సమర్థుడైన వానికొఱకును నమస్కారము.

నమ శ్శీఘ్రియాయ చ శీభ్యాయ చ. 13

నమః - శీఘ్రియాయ - చ - శీభ్యాయ - చ.

ఆ॥వె॥ గమన వేగమందు ఘనుఁడైనవానికి
వెల్లువలను నొప్పు వేల్పునకును.

తా॥ వేగముగా నడచువాని కొఱకును, జలప్రవాహముల యందున్న వాని కొఱకును నమస్కారము.

నమ ఊర్మ్యాయ చా వస్వన్యాయ చ. 14

నమః - ఊర్మ్యాయ - చ - అవస్వన్యాయ - చ.

ఆ॥వె॥ తరగలందునొప్పు ధన్యుని కొఱకును
నిలువ నీటనొప్పు నిత్యునకును.

తా॥ తరంగములంయందున్న వానికొఱకును నిశ్శబ్దమగు జలమునందున్న వానికొఱకును నమస్కారము.

నమస్స్రోతస్యాయ చ ద్వీప్యాయ చ. 15

నమః - స్రోతస్యాయ - చ - ద్వీప్యాయ - చ.

ఆ॥వె॥ స్రోతలందు గల్గు పూతునికొఱకును
ద్వీపములను నొప్పు ధీరునకును.

తా॥ ప్రవాహములందున్న వాని కొఱకును, జలమధ్యమందుగల భూమి యందున్న వాని కొఱకును నమస్కారము.

ఇట్టి భేదవిధుల నెసగి రూపించిన
మహిత రుద్రునకు నమస్కరింతు.

ఇది అరు మొదలు పదిహేనువఱకు వ్రాసిన అనువాద పద్యములకు సమ్మిష్టిగా వ్రాయబడినది. అనగా నీ యనువాకములో వ్యాపార భేదము నవలంబించి నమస్కారములు చెప్పబడినవి.

పంచమానువాకము సంపూర్ణము

## షష్ఠమానువాకారంభః

॥ । ।
**నమో జ్యేష్ఠాయ చ కనిష్ఠాయ చ.** 1

నమః - జ్యేష్ఠాయ - చ- కనిష్ఠాయ - చ.

తే॥గీ॥ అన్ని విధుల నధికుఁడై మించువానికి
మఱియు నల్పుఁడైన మాయకునకు.

తా॥ విద్య, వయస్సు, ఐశ్వర్యము మొదలగువానిచే నధికుడైన వాని కొఱకును, అ యన్నిటియందు తక్కువైన వాని కొఱకును నమస్కారము.

। । ।
**నమః పూర్వజాయ చా పరజాయ చ.** 2

నమః - పూర్వజాయ - చ - అపరజాయ - చ.

తే॥గీ॥ పూర్వజనితుఁడైన పుణ్యశీలునకును
అపరరూపుఁడైన యతనిఁగూర్చి.

తా॥ సృష్టికి మొదట హిరణ్యగర్భ రూపమునఁ బుట్టినవానికొఱకును వెనుకకాలమందు (అనగా ప్రళయకాలమందు) కాలగ్ని మొదలగు వాని రూపమునఁబుట్టినవాని కొఱకును నమస్కారము.

। । ।
**నమో మధ్యమాయ చా పగల్భాయ చ.** 3

నమః - మధ్యమాయ - చ - అపగల్భాయ - చ.

ఆ॥ నడిమి కాలమందు బొడసూపువానికి
జ్ఞానహీనుఁడైన వానికొఱకు

తా॥ మధ్యకాలమందు పుట్టినవాని కొఱకు (దేవనరతిర్యగ్యాదిరూపముల నన్నమాట) ఇంద్రియజ్ఞానమే లేని శిశువైన వాని కొఱకును నమస్కారము.

। । ।
**నమో జఘన్యాయ చ బుధ్నియాయ చ.** 4

నమః - జఘన్యాయ - చ - బుధ్నియాయ - చ.
ఆ॥ జఘన భాగములను జన్మించు నతనికి
బుధ్నములను బుట్టు పూజ్యునకును.
తా॥ జఘనభాగమునందు బుట్టినవానికొఱకు (అనగా పశువులు మొదలగువాని పశ్చాద్భాగమందు బుట్టిన దూడలు మొదలగువాని కొఱకు) మూలమునుండి పుట్టినవాని కొఱకనగా వృక్షాదులయందైన కొమ్మలు మొదలగువాని కొఱకు) నమస్కారమగుగాక.

నమ స్సోభ్యాయ చ ప్రతిసర్యాయ చ. 5

నమః - సోభ్యాయ - చ - ప్రతిసర్యాయ - చ.
తే॥గీ॥ ఉభయ లోకమందు నొప్పెడి వానికి
కర్మపాకుఁడైన ఘనునిగూర్చి.
తా॥ పాపపుణ్యములతో గూడిన మనుష్యలోకమందున్న వాని కొఱకును వివాహాది కర్మలచే సంస్కరింపబడు రూపముగలవాని కొఱకును నమస్కారము.

నమో యామ్యాయ చ క్షేమ్యాయ చ. 6

నమః - యామ్యాయ - చ - క్షేమ్యాయ - చ.
తే॥ నరకలోకమునకు నాధుని కొఱకును
మోక్ష హేతువైన ముఖ్యునకును.
తా॥ నరకలోకమునందు యముని రూపమున బాపులను శిక్షించువాని కొఱకును (క్షేమ మనగా మోక్షము దానికి యోగ్యుడైనవాడు జ్ఞాని.) అట్టి రూపమైనవాని కొఱకును నమస్కారము.

నమ ఉర్వర్యాయ చ ఖల్యాయ చ. 7

నమః - ఉర్వర్యాయ - చ - ఖల్యాయ - చ.
ఆ॥ భూమియందు నొప్పి పూజ్యుఁడౌ వానికి
కళ్ళములను గల్గు ఘనునిఁగూర్చి.
తా॥ ఎల్లసస్యములతో నొప్పు భూమియందున్న వాని కొఱకును ధాన్యము నూర్చు ప్రదేశమందున్న వాని కొఱకును నమస్కారము.

నమః శ్లోక్యాయ చా వసాన్యాయ చ 8

నమః - శ్లోక్యాయ - చ - అవసాన్యాయ - చ.

అ॥ వేదమంత్రములను విలసిల్లువానికి
మోక్షహేతువైన ముఖ్యునకును.

తా॥ వైదిక మంత్రములందున్నవాని కొఱకును వేదావసానము ఉపనిషత్తులు అందు ప్రతిపాదించబడునది మోక్షము. అందున్నవాని కొఱకును (అనగా వేదాంత ప్రతిపాదితుడైనవాడు లేక జీవితావసానమునందున్నవాడు అని భావము) నమస్కారము.

నమో వన్యాయ చ కక్ష్యాయ చ. 9

నమః - వన్యాయ - చ - కక్ష్యాయ - చ.

అ॥ అడవులందు జన్మ మందినవానికి
కక్షములను గల్గు ఘనునిఁగూర్చి.

తా॥ అడవులందు వృక్షాదుల రూపముననున్న వాని కొఱకును బోదెలేని లతాదుల రూపముననున్న వాని కొఱకును నమస్కారమగుగాక.

నమ శ్రవాయ చ ప్రతిశ్రవాయ చ. 10

నమః - శ్రవాయ - చ - ప్రతిశ్రవాయ - చ.

అ॥ వె॥ శబ్దరూపుఁడైన శక్తివంతునకును
మాఱుశబ్దమైన మాన్యునకును.

తా॥ ధ్వని స్వరూపమైన వానికొఱకును ప్రతిధ్వని స్వరూపమైన వానికొఱకును నమస్కారమగుగాక.

నమ ఆశుషేణాయ చా శురథాయ చ. 11

నమః - ఆశుషేణాయ - చ - ఆశురథాయ - చ.

ఆ॥వె॥ శీఘ్రగామియైన సేనాసమేతున
కట్టి రధముగల్గు యాతనికిని.

తా॥ శీఘ్రమ...గా నడచు సేన గలవానికొఱకును శీఘ్రముగా బోవు రధముగలవాని కొఱకును నమస్కారము అగుగాక.

|
నమశ్శూరాయ చా వభిన్దతేచ. 12

నమః - శూరాయ - చ - అవభిన్దతే - చ.

ఆ॥వె॥ సమరమందు ధైర్య శాలియౌ నతనికిఁ
బగఱఁ గూల్చునట్టి బలయుతునకు.

తా॥ యుద్ధమునందు ధైర్యముగలవాని కొఱకును శత్రుసైన్యములను బ్రద్దలుగొట్టువాని కొఱకును నమస్కారమగుగాక.

| | |
నమో వర్మిణే చ వరూథినే చ. 13

నమః - వర్మిణే - చ - వరూథినే - చ.

ఆ॥వె॥ బొందళంబుదాల్చి పొంగారు నతనికి
మంచి గృహముగల్గు నంచితునకు.

తా॥ కంచుకముగలవాని కొఱకును, మంచిగృహము గలవాని కొఱకును నమస్కారము.

| | |
నమో బిల్మినే చ కవచినే చ. 14

నమః - బిల్మినే - చ - కవచినే - చ

తా॥వె॥ బొమిడికమునుదాల్చు పూజనీయునకును
కవచరక్షణంబు గల్గుపతికి.

తా॥ శిరః కవచముగలవాని కొఱకును, దేహకవచముగలవాని కొఱకును నమస్కారమగుగాక.

| | |
నమ శ్శ్రుతాయ చ శ్రుతసేనాయ చ. 15

నమః - శ్రుతాయ - చ - శ్రుతసేనాయ - చ.

ఆ॥వె॥ శృతులచేత సతము నుతితుఁడౌ వానికి
ఖ్యాతియైన సేన గల్గు పతికి
ఇట్టిముఖ్యమైన హెచ్చురీతులనొప్పు
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ వేదములయందు ప్రసిద్ధుడై వేదములవలననే తెలియబడువాని కొఱకును ప్రసిద్ధమైన సేనగలవాని కొఱకును నమస్కారమగుగాక. దేవుని బాణాసనాద్యాయుధములుగాని, సేనలు గాని శృతి ప్రసిద్ధములేయగును.

ఈ రెండు యనువాకములకును ఋషియు దేవతయు భగవంతుడగు శంభువు. ఛందస్సు మహావిరాట్టు. మూడు రాత్రులు చరుభోజియై దీక్షించి పిదప బదునొకండు దినములు నిరంతరము జపముసేయగా బురశ్చరణమగును. మొదట రాజులకు జెప్పబడుచున్నది.

ఈ రెండు యనువాకములను నిత్యము పదునొకండు మాఱులు జపించుచు ప్రతి నమస్కారమునను శ్వేతకమలము లొక్కమాసము వేయునది. పిమ్మట దక్షిణామూర్తి సన్నిధిని బదునొకండు బ్రాహ్మణుల భుజింపజేయునది. ఇట్లొనర్చగా రాజ్యశ్రీ వర్ధిల్లును.

2. రాజు జన్మదినమందు వానియగ్ని యందుగాని, మథితాగ్నియందుగాని నేతితో దడుపబడిన యశ్వత్థసమిధలు ఇరువదియొక్క వేలును, దూర్వలు పదునొక్కవేలును వేల్చినేని రాజునకు జయము నాయువు వృద్ధిబొందును.

3. ప్రతిమాస మీ యనువాకముల లక్షసార్లు జపించెనేని ఎల్లప్పుడు జయముగలుగును.

4. యుద్ధము వచ్చినప్పుడు రాజునకు వండునట్టి మహాసనంబున వండిన సోపదంశమగు నన్నము దధి మధుఘృతములచే దడిపి ఈ యనువాకములు పదునొకండుమాఱులు జపించుచు బ్రతినమస్కారమువేల్చి శేషము భూమియందు బలియుంచి దానిందీసి జలమునం గలిపి శత్రుసేనపైపు చల్లగా నాసేన శీఘ్రమున నష్టమగును.

5. అట్లే యాజ్యమునందడిపిన శుద్ధతండులములచే హోమముచేసి రాజు నాయుధములన్నియు స్పృశించి వీనిచే వేయిమార్లభిమంత్రించిన నయ్యాయుధములకు తేజస్సు వర్ధిల్లును.

6. ప్రతినమస్కారముగా "పరసేనాస్తంభం కరోమిస్వాహా" అని పఠించుచు జిల్లేడు సమిధలచే లక్షవేల్వగా శత్రుసేన స్తంభితమగును.

7. వీనిచేతనే రాజు భోజ్యవస్తువుల నభిమంత్రించగా నవి యమృతములగును.

8. నదీమధ్యంబున శూద్రునిచే దేఖడిన యగ్నియందు హరిణవరాహ శశకపింజల కలవింక మృగంబుల మాంసముచే నొక్కొకటిచే లక్షహోమము చేయవలెను. ఆహంతి ప్రమాణములయిన యపూపములు లక్ష వేల్వవలయును. ప్రతినమస్కారముగా"పరరాష్ట్ర ప్రజాశోషణం కరోమిస్వాహా" అని పఠింపవలెను. ఇట్లు చేసినచో పరరాష్ట్ర ప్రజలు శోషింతురు. వీనికి సువర్ణ రజత గో భూ వస్త్రాదులు దక్షిణలీయవలెను. ఇట్లు రాజులకు.

ఇతరులకు అనపత్యలగు స్త్రీలకు బుత్రోదయముకొఱకు దధి మధుఘృతములచే దడుపబడిన అత్తిసమిధలు స్వాగ్నియందు బ్రతినమస్కారమొక్కొకటి చొప్పున నిరువదియొక్కవేలు వేల్చునది. పిదప నమస్కార సంఖ్యగలవి. తంతువేష్టితములు, నూతన వస్త్రావృతములు జలపూర్ణములగు కలశములచే బ్రతినమస్కార మభిషేకము సేయవలెను. ఎనిమివేలావృతులు జపింపవలెను. పిమ్మట నీ యనువాకములు పఠించుచు ఏడు నాడికల కాలము మహాదేవు నభిషేకింపవలెను. వీని జపించుచు నెనిమిదివేలు ప్రదక్షిణములు చేయవలెను. పిండిచే పిండముగావించి దాని వీనిచే నభిమంత్రించి భుజింపజేయవలెను. నదీతీరమున బ్రతినమస్కారము శమీపత్రములు వేయుచు వీనిని ఐదునొకండు మాఱులు జపింపవలెను.

ఈ ప్రయోగము లొనర్చిన యడల శుద్ధలగు స్త్రీలకు రుద్రునితో సమానమగు పుత్రుడుదయించును. క్రమముగా ముప్పదియెనిమిది నలువది యెనిమిదేండ్ల వయస్సుగల జాయాపతులు గావించినను తప్పక పుత్రుని బొందగలరు. అపుత్రుడు వశంకరుడై , శివభక్తుడై యొప్పును. అతని హస్తంబుల శూలరేఖలుండును.

(2) ఘృతపాయసము వండి ఈ యనువాకములచేత నెనిమిదివేలాహుతులు వేల్చినయెడల జన్మాంతరమునందు బ్రాహ్మణుడై జనించును.

(3) వీనిచే నొక సూత్రము నభిమంత్రించి గర్భిణీ హస్తమున బంధించినచో గర్భము సురక్షితమగును.

(4) వీనిచే నభిమంత్రితమగు భస్మముతోను ధూపముతోను రక్షసేయగా కుమారగ్రహాదిభయములు తొలగును. (అప్పుడు రాత్రికాలముల యందు జుట్టు వీడకుండునట్లు ముడివేయునది).

తే॥ గౌరితోఁగూడి యొకచేత మేరువమరఁ
దనరు ప్రేమను బత్నిపైఁ దనదు హస్త
ముంచి భక్తాళి మ్రొక్కఁగా హాయలుతోడ
నర్ధనారీశ్వరుండైన నభవుఁ దొప్పు.

షష్ఠమానువాకము సంపూర్ణము.

## సప్తమానువాకారంభః.

నమో దున్దుభ్యాయ చా హనన్యాయ చ. 1

నమః - దున్దుభ్యాయ - చ - అహనన్యాయ - చ.

ఆ॥వె॥ భేరులందు బుట్టు భూరి నాదునకును
వాని నాహదించు వానిగూర్చి.

తా॥ భేరులయందు బుట్టిన ధ్వనిరూపుడైన వానికొఱకును, అందు తాడనరూపమునైన వానికొఱకును నమస్కారము.

నమో ధృష్ణవే చ ప్రమృశాయ చ. 2

నమః - ధృష్ణవే - చ - ప్రమృశాయ - చ.

ఆ॥వె॥ సమరములను ధృష్టి నమరించు ఘనునకు
సరులజాడఁ గట్టు నధికునకును.

తా॥ యుద్ధమునందు వెనుదీయని వానికొఱకును, శత్రు వృత్తాంతములను తెలుసుకొను వానికొఱకును నమస్కారమగుగాక.

ప్రమృషయచ అనగా ఉత్తమస్వభావముగలవాని కొఱకు అనగా అందఱును తమ కార్యార్థమే దేవుని భజింపుచున్నారు. దేవుడో తా నవియన్నియు తనకొఱకే యైనట్లు దలచి వారల కివి యిచ్చి రక్షించుచున్నాడు కాబట్టి ఉత్తమ స్వభావత్వమాయనయందే తేలుచున్నది.

నమో దూతాయ చ ప్రహితాయ చ. 3

నమః - దూతాయ - చ - ప్రహితాయ - చ.

ఆ॥వె॥ రాయబారమందు రాణించు నతనికి
ప్రహితుండైన యట్టి ప్రభువునకును.

తా॥ వృత్తాంతమును దెలుపుటయందు నేర్పరియైనవాని కొఱకును, ఉత్తమస్వభావముగల సేవకుడగువాని కొఱకును నమస్కారము.

భక్తులకొఱకు దేవుడు దూతకృత్యమును గూడ చేయును. అగ్ని రూపమున నట్టి కృత్యము జేయుచున్నాడు గదా!

నమో నిషఙ్గిణే చే షుధిమతే చ. 4

నమః - నిషఙ్గిణే - చ - ఇషుధిమతే - చ.

ఆ॥వె॥ విల్లుగల్గినట్టి వీరుని కొఱకును
ఇషుధిచేత నొప్పు యీశునకును.

తా॥ ఖడ్గముగలవాని కొఱకును అమ్ముల పొదులు గలవాని కొఱకును నమస్కారమగుగాక.

భూతరక్షణార్థము దేవుఁ డాయుధగ్రహణముగూడ గావించునని భావము.

నమ స్తీక్ష్ణే షవే చా యుధినేచ. 5

నమః - తీ క్ష్ణే షవే - చ - ఆయుధినే - చ.

ఆ॥ వె॥ కఱకు బాణములను కల్గిన వానికి
శస్త్రసమితి గల్గు శంభువునకు.

తా॥ వాడియైన బాణములు గలవానికిని అసంఖ్యాకములగు ఆయుధములు దాల్చినవానికిని నమస్కారమగుగాక.

నమ స్స్వాయుధాయ చ సుధన్వనే చ. 6

నమః - స్వాయుధాయ - చ - సుధన్వనే చ.

ఆ॥వె॥ అల త్రిశూలమనెడి యాయుధాంచితునకు
మంచి ధనువుఁబట్టు మంగళునకు.

తా॥ త్రిశూలమను మంచి ఆయుధము గలవాని కొఱకును, పినాకమను మంగళకరమైన ధనుస్సు గలవాని కొఱకును నమస్కార మగుగాక. వ్యర్థముకాని ఆయుధములు ధరించువాడు లోకోత్తరవీరుఁడైన భగవంతుడే యగును. కాంచనపర్వతరూపమైన ధనస్సుగూడ నట్టిదే యగుచున్నది. గనుక నదియు ఆయనకే బట్టనర్హము.

నమ స్స్రుత్యాయ చ పథ్యాయ చ. 7

నమః - స్రుత్యాయ - చ - పథ్యాయ - చ.

ఆ॥వె॥ కాలిబాటలందు గ్రాలెడివానికి
మార్గములను బోవు మాన్యునకును.

తా॥ కాలిదారుల యందున్నవాని కొఱకును, గొప్పమార్గముల యందున్నవాని కొఱకును నమస్కారమగుగాక.

నమః కాట్యాయ చ నీప్యాయ చ. 8

నమః - కాట్యాయ - చ - నీప్యాయ - చ.

ఆ॥వె॥ కాటములను నొప్పు ఘనచరిత్రునకును
నీపములను జెందు నిర్దయునకు.

తా॥ కాటమనఁగా నూయి యనియు లింగమనియు యున్నందున వాట్లయందొప్పువాని కొఱకును, నీపమనగా జలమువెడలు ప్రదేశము గనుక అందున్న వానికొఱకును నమస్కారము.

నమ స్సూద్యాయ చ సరస్యాయ చ. 9

నమః - సూద్యాయ - చ - సరస్యాయ - చ.

ఆ॥వె॥ సూదదేశమందు శోభిల్లువానికి
సరసులందు నొప్పు సరసునకును.

తా॥ సూద మనగా బురదప్రదేశము గనుక అందున్న వానికొఱకును, కొలనులందున్నవాని కొఱకును నమస్కారమగుగాక.

నమో౽ నాద్యాయచ వైశన్తాయ చ. 10

నమః - నాద్యాయ - చ - వైశన్తాయ - చ

ఆ॥వె॥ నదులయందునొప్పు సదయునికొఱకును
పల్వలములనున్న భవ్యునకును.

తా॥ నదులయందు జలరూపమ్మునమున్న వానికొఱకును, అల్పసరస్సుల యందున్న వానికొఱకును నమస్కారమగుగాక.

వేశంతమనగా దేవఖాతములన్నమాట. (అనగా దేవతర్పణము మొదలగువాని కొఱకు జలముంచబడు ప్రదేశము.

నమః కూప్యాయ చా వట్యాయ చ. 11

నమః - కూప్యాయ - చ - అవట్యాయ - చ.

ఆ॥వె॥ నూతులందు నమరు భూతేశ్వరునకును
యవటములనునొప్పు నధికునకును.

తా॥ నూతులందు జలరూపమున నున్నవానికొఱకును, పల్లములయందు జలరూపముననున్న వానికొఱకును నమస్కారమగుగాక.

నమో వర్ష్యాయ చా వర్ష్యాయ చ. 12

నమః - వర్ష్యాయ - చ - అవర్ష్యాయ - చ.

ఆ॥వె॥ వానసీటనొప్పు వాని సంప్రీతికై
వర్షజలముగాని వానికొఱకు.

తా॥ వర్షమువలన గలుగు జలమునందున్న వానికిని, సముద్రాది జలము నందున్నవానికిని నమస్కారమగుగాక.

నమో మేఘ్యాయ చ విద్యుత్యాయ చ. 13

నమః - మేఘ్యాయ - చ - విద్యుత్యాయ - చ.

ఆ॥వె॥ మేఘమాలనున్న మృత్యుంజయునకును
చంచలలను నొప్పు సామికొఱకు.

తా॥ మేఘములయందున్న వానికొఱకును, మెఱుపులతో గూడి యున్నవానికొఱకును నమస్కారమగుగాక.

నమ ఈధ్రియాయ చా తప్యాయ చ. 14

నమః - ఈధ్రియాయ - చ - అతప్యాయ - చ.

అ॥వె॥ శారదాభ్రమమునను మీఁతెడువానికి
నెండ వర్షమైన యీశునకును.

తా॥ శరత్కాలమందు నిర్మలమై ప్రకాశించు మేఘమునందున్న వానికిని, ఎండకాయునప్పుడు వర్షించు వర్షమందున్నవానికిని నమస్కారమగుగాక.

నమోవాత్యాయ చ రేష్మియాయ చ. 15

నమః - వాత్యాయ - చ - రేష్మియాయ - చ.

అ॥వె॥ వాయుసహితమైన వర్షస్వరూపికి
నంత్యరేష్మియైన నతనికొఱకు.

తా॥ గాలితో గూడిన వానయందున్నవానికిని, ప్రళయకాలమందు పాషాణాది సహితమైన వర్షరూపము గలవానికిని నమస్కారమగుగాక.

నమో వాస్తవ్యాయ చ వాస్తుపాయ చ. 16

నమః - వాస్తవ్యాయ - చ - వాస్తుపాయ - చ.

అ॥వె॥ వస్తురూపమైన వరధనాన్వితునకు
వాస్తు పాలుఁడైన వానికొఱకు.

తా॥ వస్తువనగా గోవులు అశ్వములు మొదలుగాగల పదార్థరూపము గల ధనము కలవానికొఱకును, గృహములను నిర్మించుచోట్ల యందుగలవాని కొఱకును నమస్కారమగుగాక.

ఈ యనువాకమునకు ఋషి హేమకోశుడు. దేవత రుద్రుడు. ఛంధస్సు మహాపంక్తి. ఒక యుపవాసముచేసి యెనిమిదినూర్లు జపించగా పురశ్చరణవంతుడగును. దీని ప్రయోగము లెట్లనగా,

1. అశ్వత్థోదుంబర వటప్లక్ష సమిధలను దధి మధు ఘృతములచే దడిపి పదివేలు వేల్చగా నాలుగుజాతులవారును దన వశులయ్యెదరు.

2. కపిలగోవు నేతిని ఐదువేలు వేల్చగా మేధావియగును.

3. అపూపములు తొమ్మిదివేలు వేల్చగా పుష్టివంతుడగును.

4. దధి మధు ఘృతములచే దడుపబడిన ఖదిర సమిధ లైదువేలు వేల్చినేని ఆరోగ్యవంతుడగును.

5. దధి మధు ఘృతములందదిపిన మావిచివురులు పదివేలు వేల్చగా సౌందర్యవంతుడగును.

6. ఒక వనమందు తన యాకారమంత కుండము త్రవ్వి యందు ధితాగ్నిం బ్రతిష్ఠించి పెరుగు మొదలగువానిచే దడిపిన తెల్లదామర పూవు లైదువేలు వేల్చనేని అతనికి లక్ష్మి ప్రసన్నమగును.

7. ప్రతివిత్తనముల దేనెలో దడిపి పదివేలు వేల్చినచో వస్త్రములు గలవాడగును.

8. గోవుల మంద యందీ యనువాకము జపించుచు పదివేలు ప్రదక్షిణము సేయగా పశువుల బడయును.

9. పెరుగు మొదలగు వానిచే దడిపిన మోదుగు సమిధలు పదివేలు వేల్చగా అతనికి వంశకరుండగు పుత్రుడొదవును.

10. ప్రతిసంవత్సరము నేతితో దడుపబడిన ధూర్వలు పదివేలు వేల్చగా అయుష్యవంతుడగును.

11. ఆజ్యముచే దడుపబడిన యశ్వత్థ సమిధలు లక్షహోమము సేయగా విద్యావంతుడగును.

12. తేనెచే దడుపబడిన సౌగంధికంబు లైదులక్షలు వేల్చనేని రాజ్యము గలవాడగును.

13. ఇక మోక్షోపాయము వినుడు. మొదట చాంద్రాయణ కృచ్ఛ్రము చరించునది. పిమ్మట నీ యనువాకము నిరువదియైదువేలసార్లు జపించి ఐదువేలమార్లు ప్రదక్షిణములు ప్రాణాయామములు చేయవలెను. పిమ్మట శంభు సన్నిధానమున దన యగ్ని యందు దధి మధు ఘృతములచే దడుపబడిన పలాశాశ్వత్థ సమిధలు మూడులక్షలు వేలువవలయును. అతడు శంభుప్రసాదమున తప్పక మోక్షమునందును.

ఇందుచే దత్పూర్వులగు వాని వంశజులు రౌరవాదినరకమున బాధింప బడువారుగూడ కైలాసమునంది యచ్చట రమింతురు. ఐదుగురింద్రులు కడచనువఱకును ఈ భూమి నిల్చియుండువఱకును తద్వంశము వర్ధిల్లును.

కం॥ ఘనజడలు వ్రేల నృత్యం
బును సల్పుచు నభయహస్తమున జిఱునవ్వే
పున నొప్ప ధూరికృష్ణాం
జినమును గలయట్టి హరుని సేవింపనగున్.

సప్తమానువాకము సంపూర్ణము

## అష్టమానువాకారంభః

నమ స్సోమాయ చ రుద్రాయ చ. 1

నమః - సోమాయ - చ - రుద్రాయ - చ

ఆ॥వె॥ సోముఁడై వెలుంగు సామి సంప్రీతికై
రోదనములఁదోలు రుద్రునకును.

తా॥ పార్వతీ సహితుడైన వానికొఱకును, రోదనహేతువైన దుఃఖమును బోగొట్టువాని కొఱకును నమస్కారము.

భక్తులను ప్రసాదించు కాలమందు దేవుడు పార్వతీ సహితుడై విచ్చేసి వారి దుఃఖములను బోగొట్టును. లేదా చంద్రస్వరూపు డనినప్పుడు అస్వరూపమున అమృతికిరుణుడై పితృ దేవ మనుష్యులను తృప్తిపఱచుచున్నాడు. లేక సోమయాగ స్వరూపముచే లోకమున కభ్యుదయము కలిగించుచున్నాడు.

నమస్తామ్రాయ చా రుణాయ చ. 2

నమః - తామ్రాయ - చ - అరుణాయ - చ.

ఆ॥వె॥ తామ్రరూపుఁడైన ధన్యుని కొఱకును
అరుణరూపుఁడైన నంచితునకు.

తా॥ ఆదిత్యరూపముచే నుదయ కాలమున మిక్కిలి యెఱ్ఱనివాని కొఱకును, పిమ్మట కొంచెము ఎఱ్ఱని వాని కొఱకును నమస్కారమగుగాక.

ఆదిత్యరూపముననే భగవంతుడు మెలకువగలిగించుట మొదలగు వానిచే జగత్తు ననుగ్రహించుటయే గాక కర్మసాక్షి గూడా యగుచున్నాడు.

నమ శ్శఙ్గాయచ పశుపతయే చ. 3

నమః - శఙ్గాయ - చ - పశుపతయే - చ.

ఆ॥వె॥ సౌఖ్యదాయియైన శంభునికొఱకును
పశుపతీంద్రుఁడైన పావనునకు.

తా॥ సుఖమునే పొందిచువాని కొఱకును జీవకోట్లను పాప రోగ చోరాది భయములనుండి రక్షించు ప్రభువుకొఱకును నమస్కారము.

నమ ఉగ్రాయ చ భీమాయ చ. 4

నమః - ఉగ్రాయ - చ - భీమాయ - చ.

ఆ॥వె॥ ఉగ్రరూపుడైన యోధుని కొఱకును
భీమరూపుడైన సోమునకును.

తా॥ పాపరోగ నరకాదులచేత జయింప నలవిగాని వానికొఱకును, ఏ పాపరోగాదులకు జగత్తు భయపడునో ఆపాపరోగాదులకే భయము కలిగించు రూపము కలవాని కొఱకును నమస్కారము.

నమో అగ్రేవధాయచ దూరేవధాయ చ. 5

నమః - అగ్రేవధాయ - చ - ధూరేవధాయ - చ.

ఆ॥వె॥ ఎదుట నుండి యరుల హింసించు వానికి
దూరపరులఁ జంపు ధూర్జటికిని.

తా॥ శత్రువుల కభిముఖుడై వారిని జంపువాని కొఱకును, మఱియు దూరమున నున్న వారిని గూడ జంపువాని కొఱకును నమస్కారము.

అనగా అకాలమునందు గూడ దురాత్ముల జంపువాడు.

నమో హన్త్రే చ హనీయసే చ. 6

నమః - హన్త్రే - చ - హనీయసే - చ.

ఆ॥వె॥ వధ్యజనులపాలి వ్యాధస్వరూపికి
మఱియు జంపునట్టి మహితునకును.

తా॥ చంపతగిన వారి పాలిటి మృత్యు స్వరూపునకును అధికముగా జంపువాని కొఱకును నమస్కారమగు గాక.

లోకమునం దెవ్వడేని శత్రువును జంపునపుడు రుద్రుడే చంపువాని రూపమగునని భావము. కావుననే "మయైవైతే నిహతాః, పూర్వమేవ నిమిత్త మాత్రం భవసవ్యసాచిన్" అనగా నా చేత వీరలిదివఱకే చంపబడిరి. అర్జునా? నీవు నిమిత్తమాత్రమగుమని కాదా? అర్జునునితో నీశ్వరుడు వచించెను. ఇఁక నధికముగా జంపువాఁడనగా అంత్యకాలమం దొక్కసారిగా సంహరించువాడు. కనుక ఈశ్వరుడే సమస్తము నతిశయించిన బలము గలవాడు.

నమో వృక్షేభ్యో హరికేశేభ్యః. 7

నమః - వృక్షేభ్యః - హరి కేశేభ్యః.

తే॥గీ॥ హరితవర్ణమొప్పు నట్టి కేశంబుల
వంటి పత్రవృక్ష భాసురునకు

తా॥ ఆకుపచ్చరంగుగల వెంట్రుకలవంటి పత్రములుగల వృక్షముల రూపముగల రుద్రునకు నమస్కారము.

నమ స్తారాయ. 8

నమః - తారాయ.

నమ శ్శమ్భవే చ మయోభవే చ. 9

నమః - శంభవే - చ - మయోభవే - చ.

ఆ॥వె॥ ప్రణవరూపుఁడైన భవ్యాత్మకునకును
ఉభయ సుఖము లొసఁగు నుద్భటునకు.

తా॥ ప్రణవముచే ప్రతిపాదింపబడువాని కొఱకు నమస్కారమగు గాక. మఱియు సుఖము గలిగించువాని కొఱకును మోక్షము గలిగించువాని కొఱకును నమస్కారమగు గాక.

తారాయ "సంసార సాగరాత్ సర్వజన్తూన్ తారాయతీతితారః" అనగా నెల్ల జంతువులను సంసారమను సముద్రము నుండి తరింపజేయునది కావున తారమనబడును. ఇదియే ప్రణవము. అట్టి స్వరూపుడే భగవంతుడు.

సుఖ స్వరూపమును సంపూర్ణముగా నెఱిగినవా డొక్క భగవంతుడే గనుక ఇతడే సుఖమునం దెల్లప్పుడు వసించువాడని యర్థము (శంభువు).

నమ శ్శఙ్కరాయ చ మయస్కరాయ చ. 10

నమః - శఙ్కరాయ - చ - మయస్కరాయ - చ.

ఆ॥ వె॥ శంకర స్వరూప సౌఖ్య ప్రదర్శికి
మతి మయస్కరునకు మంగళునకు.

తా॥ స్వభావముచేతనే ఎల్లప్రాణులకును సుఖము చేయువానికొఱకును ఆచార్యుడు శాస్త్రము మొదలగు రూపముల మోక్ష సుఖము చేయువాని కొఱకును నమస్కారము.

తండ్రి తాత మొదలగు వారి రూపమున లౌకిక సుఖమును, గురువు మొదలగు వారి రూపమున మోక్షసుఖమును సమకూర్చువాడు భగవంతుడేనని భావము.

నమ శ్శివాయ చ శివతరాయ చ. 11

నమః - శివాయ - చ - శివతరాయ - చ.

ఆ॥వె॥ శివుని రూపమైన చిన్మయాత్మునకును
మంగళ ప్రధాన మహిమునకును.

తా॥ కళ్యాణ రూపుని కొఱకును, తన భక్తులను గూడ కల్యాణ ప్రధానులనుగాజేయు రూపముగలవాని కొఱకును నమస్కారము.

"సమేధయతి యన్నిత్యం సర్వార్థాన్ సర్వకర్మసు; శివమిచ్ఛన్ మనుష్యాణాం తస్మాద్దేవశ్శివః స్మృతః" సమస్త కర్మలయందును మనుష్యులకు కళ్యాణము గోరువాడే దేవుడు, అతడే శివుడు అని చెప్పబడెను. మిక్కిలి మేలు చేయువాడు శివతరుడు.

నమ స్తీర్థ్యాయ చ కూల్యాయ చ. 12

నమః - తీర్థ్యాయ - చ - కూల్యాయ - చ.

ఆ॥వె॥ తీర్థపాలి నొప్పు దేవతావిభునకు
తీరములను గల్గు త్రినయనునకును.

తా॥ తీర్థములయందు సన్నిహితుడై యున్న వాని కొఱకును, నదీతీరములందు లింగ రూపమున నున్నవాని కొఱకును నమస్కారము.

నమః పార్యాయ చా వార్యాయ చ. 13

నమః - పార్యాయ - చ - అవార్యాయ - చ.

ఆ॥వె॥ పారమందు నున్న పాలెగానిని గూర్చి
మతి యవార్యుడైన మహిమునకును.

తా॥ సంసార సముద్రమున కావలిగట్టున ముముక్షువులచే ధ్యేయమై యున్న వాని కొఱకును, సంసారమందు కామ్యఫలము లిచ్చువాని కొఱకును నమస్కారము.

నమః ప్రతరణాయ చో త్తరణాయచ. 14

నమః - ప్రతరణాయ - చ - ఉత్తరణాయ చ.

ఆ॥వె॥ తరణహేతువైన దంత్రసాధనునకు
మఱియు దత్స్వరూప మహిమునకును.

తా॥ తరించుటకు హేతువైన వానికొఱకును, సంసారమునుండి తరించుటకు సాధనమైనవాని కొఱకును నమస్కారము.

తరణమనగా దాటుట. ఈ సంసారమును తరించుటకు ఉత్తమ యోనియందు జన్మప్రకర్షణము నొందుటయు మంత్రజపాదులను సాధించుటయు మార్గములు. అందుపై ఉత్తరణ మనగా తరించుటకు సాధనములైన భక్తి జ్ఞాన వైరాగ్యతత్వములను పొందుట. ఈ రెంటి స్వరూపుడు భగవంతుడే.

నమ ఆతార్యాయ చా లాద్యాయ చ. 15

నమః - ఆతార్యాయ - చ - అలాద్యాయ - చ.

ఆ॥వె॥ తత్వసిద్ధియైన తత్పూర్వ కర్మచే
మఱల రూపునందు మంతువునకు
మఱియుఁ గర్మఫలపు మహిమ నాలాదుఁడై
ప్రేరకుండునైన దీరువరికి.

తా॥ సంసారమున కావలిగట్టును బొందియుఁ గర్మశేషముచే మఱల సంసారమును బొందుటయందున్న వాని కొఱకును జీవసంబంధియైనవాని కొఱకును నమస్కారము. (అలాదమనగా స్వర్గము) అస్వరూపుడైనవాని కొఱకని కూడా భావము.

నమశ్శష్ప్యాయ చ ఫేన్యాయ చ. 16

నమః - శష్ప్యాయ - చ - ఫేన్యాయ - చ.

ఆ॥వె॥ శష్పరూపమైన సర్వపూజితునకు
ఫేనరూపమైన ప్రేక్షితునకు.

తా॥ గంగాతీరములందు బుట్టిన బాల తృణముచే బూజింపబడువాని కొఱకును నదిలోనుండు నురుగు రూపమైనవాని కొఱకును నమస్కారమగు గాక.

ఇందొక్క మనవి. ఈ శష్పశబ్దము జీవభేదములో నొకటైనందున ఈ శబ్దము నేను మార్చలేదు. మంత్రమున నున్నట్లే వ్రాసినాను. క్షమింతురు గాక. ఈ వివరమును నవమానువాకమున రెండవ మంత్రములో చూడనగును.

నమ స్సికత్యాయ చ ప్రవాహ్యాయ చ. 17

నమః - సికత్యాయ - చ - ప్రవాహ్యాయ - చ.

ఆ॥వె॥ సైకతప్రదేశ సంవిధానునకును
మఱి బ్రవాహరూపమంజిమునకు
ఇట్లు తగిన రూపులెసగ శోభించిన
మహిత రుద్రునకు నమస్కరింతు.

తా॥ సైకతప్రదేశ స్వరూపుని కొఱకును, ప్రవాహములయందున్న వాని కొఱకును నమస్కారము.

ఏ పురుషుడు శ్రద్ధమెయి దివ్యనదీతీరమున స్నానాది తత్పరుడై నిరంతరము నివసించునో తద్రూపుడే భగవంతు డన్నమాట.

అష్టమానువాకము సంపూర్ణము

## నవమానువాకారంభః

నమ ఇరిణ్యాయ చ ప్రపథ్యాయ చ. 1

నమః - ఇరిణ్యాయ - చ - ప్రపథ్యాయ - చ.

ఆ॥వె॥ ఊషరములయందు నున్నట్టి వానికి
పథములందు నొప్పు ప్రభువునకును.

తా॥ చవిటి నేలలందున్న వానికొఱకును రాజబాటలయందున్న వాని కొఱకును నమస్కారమగుగాక.

నమః కిగ్ంశిలాయ చ క్షయణాయ చ. 2

నమః - కిగ్ం శిలాయ - చ - క్షయణాయ - చ.

ఆ॥వె॥ సన్నఱాల నేల సంసక్తకునకును
వాసమందునొప్పు వాని కొఱకు.

తా॥ సన్నఱాలుగల ప్రదేశ మందున్న వానికొఱకును, వాసయోగ్యమైన ప్రదేశముల యందొప్పువాని కొఱకును నమస్కారమగు గాక.

ఈ పైనుండి వివరించిన శష్పాదులన్నియు జీవభేదములు. అనగా శష్పములనగా బాలతృణ సమానులు, స్వల్పప్రాణులగు జీవులు. ఫేనములనగా తత్సదృశులైన అల్పాయువులు. సికతలనగా ఇసుకవంటి యల్పులు. ప్రవాహములనగా మహావిభూతులు. ఇరిణములనగా శూన్యశక్తులు. ప్రపథులనగా నుత్తమమార్గమునందొప్పువారు. వెంశిలులనగా కుత్సితమైన శీలము గలవారు. క్షయణులనగా క్షయించు స్వభావము గలవారు. ఇట్టివాఱలందఱి యందును భేదము లేక అనుగ్రహించు వాడే భగవంతుడైన శివుడు.

నమః కపర్దినే చ పులస్తయే చ. 3

నమః - కపర్దినే - చ - పులస్తయే - చ.

ఆ॥వె॥ జటలఁ గూడికొన్న సంభావ్యునకు నింక
భక్తులందు బరగు భవ్యునకును.

తా॥ జటాబంధము కలవానికొఱకును, వెంద్రుకలు గలవానికొఱకును నమస్కారము.

ప్రసాదకాలమున భగవంతు డొకానొకప్పుడు కపర్దిగాను ఒకానొకప్పుడు చక్కని కుంతలములు గలవాడుగాను పొడసూపును. ఎల్లప్పుడు ఎల్లవారియెదుట ఏదోయొకవిధముగా యుండును. భక్తసులభుడుగదా?

నమో గోష్ఠ్యాయ చ గృహ్యాయ చ. 4

నమః - గోష్ఠ్యాయ - చ - గృహ్యాయ - చ.

ఆ॥వె॥ గోష్ఠములను నొప్పు గోపాలు కొఱకును
గ్రహణశక్తి గల్గు ఘనుని కొఱకు.

తా॥ గోవుల స్థానమునందున్న వానికొఱకును, గృహమునందున్న వాని కొఱకును నమస్కారము.

నమ స్తల్ప్యాయ చ గేహ్యాయ చ. 5

నమః - తల్ప్యాయ - చ - గేహ్యాయ - చ.

ఆ॥వె॥ పాన్పునందు భోగపాత్రుడౌ వానికి
గేహములను నొప్పు గేస్తునకును.

తా॥ పాన్పునందున్న వాని కొఱకును, మేడలు మొదలైనవాని యందున్న వానికొఱకును నమస్కారము.

నమః కాట్యాయ చ గహ్వ రే ష్ఠాయ చ. 6

నమః - కాట్యాయ - చ - గహ్వ రేష్ఠాయ - చ.

ఆ॥వె॥ గహన భూములందు గనుపించు వానికి
గహ్వరములనొప్పు ఘనునికొఱకు.

తా॥ దుష్ప్రదేశములందున్న వానికిని విషమప్రదేశములందున్న వానికిని నమస్కారము.

నమో హ్రదయ్యాయ చ నివేష్ప్యాయ చ. 7

నమః - హ్రదయ్యాయ - చ - నివేష్ప్యాయ - చ.

అ॥వె॥ ప్రాదములందు నొప్పు విదితుని కొఱకును
మంచునీట నొప్పు వంచితునకు.

తా॥ లోతైన మడుగులయందున్న వాని కొఱకును మంచునీరునందున్న వాని కొఱకును నమస్కారము.

నమః పాగ్ం సవ్యాయ చ రజస్యాయ చ. 8

నమః - పాగ్ంసవ్యాయ - చ - రజస్యాయ - చ.

అ॥వె॥ పాంసువులను గల్గు పాంథునికొఱకును
రజమునందునున్న రంజనునకు.

తా॥ సూక్ష్మమైన దుమ్మునందున్న వాని కొఱకును, స్థూలమైన దుమ్మునందున్న వానికొఱకును నమస్కారము.

రజస్యాయచ అనినప్పుడు రజోగుణమందున్న వానికొఱకనియు లేదా రజోలోకము నందున్న వాని కొఱకనియుగూడ చెప్పవచ్చును. స్థూలమనగా జగద్వ్యాప్తృకరమైన వాడనియు అనవచ్చును.

నమ శ్శుష్క్యాయ చ హరిత్యాయ చ. 9

నమః - శుష్క్యాయ - చ - హరిత్యాయ - చ.

అ॥వె॥ శుష్కములను వెల్గు శుద్ధునికొఱకును
హరితములను నొప్పు హరునిఁగూర్చి.

తా॥ ఎండుకట్టెలయందున్న వానికొఱకును, పచ్చికట్టెలయందున్న వానికొఱకును నమస్కారము.

నమో లోప్యాయ చో లప్యాయచ. 10

నమః - లోప్యాయ - చ - ఉలప్యాయ - చ.

అ॥వె॥ లోపములను గల్గు లోకోత్తురునకును
ఉపలములను నొప్పు యున్నతునకు.

తా॥ కఠిన ప్రదేశమందున్న వాని కొఱకును, తృణాదులయందున్న వాని కొఱకును నమస్కారము.

నమ ఊర్వ్యాయ చ సూర్మ్యాయ చ. 11

నమః - ఊర్వ్యాయ - చ - సూర్మ్యాయ - చ.

ఆ॥వె॥ ఉర్వియందునున్న యుర్వీశ్వరునకును
సూర్ములందునొప్పు సూరిగూర్చి.

తా॥ భూమియందున్న వాని కొఱకును, మంచితరగల యందున్న వాని కొఱకును నమస్కారము.

నమః పర్ణ్యాయ చ పర్ణశద్యాయ చ. 12

నమః - పర్ణ్యాయ - చ - పర్ణశద్యాయ - చ.

ఆ॥వె॥ పర్ణములను నొప్పు నిర్ణాయకునకును
పర్ణశదమునుండు భాస్వరునకు.

తా॥ పత్రములయందున్న వాని కొఱకును, ఎండుటాకుల సమూహ మందున్న వాని కొఱకును నమస్కారము.

నమోఽ పగురమాణాయ చా భిఘ్న తేచ. 13

నమః - అపగురమాణాయ - చ - అభిఘ్న తే - చ.

ఆ॥వె॥ అయుధంబు బట్టు నాయుష్మరునకును
శాత్రవులను గొట్టు శక్తునకును.

తా॥ ఆయుధము ధరించినవాని కొఱకును, శత్రువుల కభిముఖుడై కొట్టువానికొఱకును నమస్కారము.

నమ ఆఖ్ఖిదతే చ ప్రఖ్ఖిదతే చ. 14

నమః - ఆఖ్ఖిదతే - చ - ప్రఖ్ఖిదతే - చ.

ఆ॥వె॥ కొలదిశ్రమ నొసంగు సలలితాత్మునకును
హెచ్చు శ్రమను గూర్చు యీశునకును.

తా॥ కొంచెము శ్రమపఱచువాని కొఱకును, మిక్కిలి శ్రమపఱచు వానికొఱకును నమస్కారము.

భగవంతుడు భేదభావము లేక వారివారి యపరాధమునకు తగినట్లు కొందఱను కొంచముగాను కొందఱ నధికముగాను శిక్షించునని భావము.

నమస్సోమాయ అనునట్టి యష్టమానువాకాదిగ నింతవఱకు నొకే మంత్రము. ఇందుకు దేవతయు ఋషియు భగవంతుడే. ఛందస్సు మహానుష్టుప్పు. రెండు ప్రాణాప్రత్యక్పృచ్ఛములు చరించి పంచశతము జపించినచో ఐశ్వర్యసిద్ధియగును. ప్రయోగము మొదట రాజులకు జెప్పఁబడును.

వసంతఋతువునందు పర్వతముగాని, శివాలయముగాని, వనముగాని గ్రహించునది. శివాలయమైనచో దేవుని బూజించి తత్సన్నిధియందు గావించునది. ఆర్ద్రా నక్షత్రము యుక్తమగును. అమావాస్యయందుగాని ఆర్ద్రానక్షత్రమునగాని అమావాస్యయందుగాని ప్రారంభముసేయునది. మొదట బ్రాహ్మణుల బూజించి వారిచే దీవననంది పిమ్మట కర్మ నారంభింపవలెను. మంత్ర సిద్ధులగు బ్రాహ్మణుల గ్రహింపవలెను. అట్టివారు దొరకనిచో ఆచార్యుడు కర్మార్థము వారలకు సద్యస్సిద్ధి నాపాదించునది. కల్పవిదుండును సిద్ధుడునగు బ్రాహ్మణోత్తము డాచార్యుడనదగును. అతండు పలికినట్లు సిద్ధియగును. ఇట్టి సద్యస్సిద్ధి ప్రకారము బ్రాహ్మణులు శుద్ధులై ఆయాచార్యునిచే మంత్రమును గ్రహించి పదునేను దినములు నిరంతరము జపింపగా గర్మయోగ్యులగుదురు. ఇది సద్యస్సిద్ధి యనఁ బడును. అట్టివారలచే హోమము సేయింపవలెను. ప్రతినమస్కారము నాహుతి వేల్చునది. నేతితోఁ గూడిన తిల వ్రీహియవాదులు హోమద్రవ్యములు. ఉదయము మొదలు అస్తమయపర్యంతము నిరంతరము హోమము సేయునది. ఇట్లు పదునొకండు మందిచే ముప్పది దినములు చేయించునది. హోమము చేయువారికి వస్త్రాద్యలంకారము లొసంగవలెను. హోమాగ్ని మీద నాజ్యపాత్రము సన్నధారగా బడునట్లుంచవలెను. ఇట్లు కర్మ ముగియుపర్యంతము దేవునకు నిత్యము నెనిమిది వేల పురుషుల యాహారము నివేదనము చేయవలెను. ప్రతిదినము ఎనిమిది వేలమంది నచ్చట భుజింపజేయవలెను. కడపటిదినమున నిత్యముకన్నను ద్విగుణము గావించవలెను. ఆచార్యుని భగవంతునిగా భావించి యతనికి భూదానము సారవంతమైన దీయవలెను. ఋత్విజులకును భూరిదక్షిణ లొసంగవలెను. ఆచార్యునకు ద్విగుణదక్షిణ నీయవలెను. శివపూజకు కర్పూర మిశ్రితమైన గంధము పుష్పములు కమలములు ధూపము కర్పూర మిశ్రితమగు గుగ్గులువు గోఘృతమైన దీపమున్ను చెప్పఁబడినవిధముగా నైవేద్యముగా ప్రతిసంవత్సరము రుద్రారాధనము చేయునది. రాజు సామ్రాట్టగును. సాగరముల మధ్యమందుండు ఇతర రాజులందరు

రుద్రరూపులచే హతులగుదురు. ఇట్టి సాధకుడీ భూమండల మంతయు ననుభవించి యంతమున రుద్రరూపులచే ననుగ్రహింపబడి మహాకైలాసపదవి నందును. అచ్చట రుద్రరూపముతో పదివేలకల్పములు భోగించిన పిమ్మట శివభక్తుడును సప్తద్వీపాధిపతి యగు చక్రవర్తియునై భూమిపైని జన్మించును. అతని హస్తములం బినాంక చిహ్నా ముండును.

ప్రయోగానంతరము శత్రునాశము గోరు రాజు సమర్థుడైన బ్రాహ్మణులచే నిట్లు జేయించవలెను.

1. చంద్రకొయ్యచే శత్రురాజు ప్రతిమను జేసి యేకాంత ప్రదేశమున జలపూర్ణకుంభమునందు దేవు నావాహనము జేసి తత్సన్నిధానంబున నగ్నిం బ్రతిష్ఠించి ముండ్లతోగూడిన జమ్మిసమిధలను బిడాలరక్తముతో దడిపి వానిని బ్రతినమస్కారము లక్ష వేల్చవలయును. అంత నా బ్రతిమకు బ్రతినమస్కారము లోహశంకువులు ప్రయోగించి దానిమీద రాజు దన వామపాద ముంచునది. విన్యాసకాలమునం దాచార్యుడు జపముచేయవలెను. అంత నారాజు నూర్గురు బ్రాహ్మణుల భుజింపజేసి దేవు నుద్వాసనము చేయునది. ఇట్లు గావించగా శత్రురాజు మూడు సంవత్సరములలో నశించును.

2. ఆప్రతిమనే శృంఖలిఖితము గావించి మునుపటివలె హోమాదు లొనర్చునది. అంత శీఘ్రముగా శత్రువు దన వశ్యుడగును.

3. సిద్ధులగు రాజపురుషులు కృత్రిమ వేషధారులై బ్రాహ్మణ సహితులై శత్రునగరము ప్రవేశించి అందు జదుకములందును, చైత్యములందును, దేవాలయములందును, రాజసభలయందును, రాజద్వారములయందును నల్లని లోహశంకువుల లక్ష వారాభిమంత్రితములు గావించి గుప్తముగా నుంచవలెను. అంత నభిమంత్రితమగు భస్మమును జలమును అంతటను జల్లునది. ఆనగరము మూడు సంవత్సరములలో నశించును. మఱియు వికృత వేషులయి శత్రునగరమునందలి కొలనులందు కంఠప్రమాణ జలమున నిలుచుండి సూర్యాభిముఖులై యెనిమిదినూర్ల దినములు ప్రతిదినము అష్టశతము జపించుచూ జపకాలమందు భగవంతుని కంఠస్థితమగు హాలాహలముచే నా జల మభిమంత్రించునది. అట్లొనర్పగాఁ నా జలము త్రాగువారలు విషదష్టుల వలె నశింతురు. ఇట్లు చేయించువారలకు రాజ్యార్ధమైన దక్షిణ నీయవలెను.

తే॥గీ॥ అల పినాకము హస్తమం దమరుచుండ
ఉదయమౌచున్న సూర్యున కుపమయౌచు
సర్పభూషలు జడలతో సహచరింప
నీలకంఠుడు గన్పట్టు నిర్మలముగ.

నమో వః కిరికేభ్యో దేవానాగ్ం హృదయేభ్యః. 15

నమః - వః - కిరికేభ్యః - దేవానామ్ -

ఆ॥వె॥ విబుధ హృదయములౌచు విలసిల్లు వారలున్
భక్తతతికి ధనముఁ బరగనిచ్చు
రుచిరమూర్తులింక రుద్రావతారులౌ

తా॥ దేవతలకు మనస్సువంటివారలు, భక్తులకు ధనము పూర్ణముగా నిచ్చునట్టివారలు రుద్రావతారులునైన మీకు నమస్కారమగు గాక.

ఇది మొదలు ఈ యనువాకాంతము వరకు నొకమంత్రము. ఇయ్యది ప్రత్యక్షకృతము. ఇదివరకు దేవుని లీలావిగ్రహములు వేఱువేఱ నమస్కరింప బడినవి. ఇప్పుడు సమూహరూపమున నమస్కరింపబడుచున్నవి. ఇదివరకు దేవునికి ప్రత్యక్షకృతముగా నమస్కరించి ఇప్పుడు తదనుచరులకు నమస్కరింపుచున్నాము. జగద్రక్షకములైన దేవుని యాకారములు పెక్కులు గలవుగదా! దేవానాం హృదయేభ్యః అన్నప్పుడు దేవతల హృదయమువంటి వారలగు - ఎట్లు దేవతలహృదయము దేవతలకు మాత్రమే తెలియునో అట్లు దేవతలకు మాత్రమే తెలియదగినవారనుట, కిరికేభ్యః అన్నప్పుడు ఉదారస్వభావులగు మీకొఱకని భావము.

లేక లోకానుగ్రహముకొఱకు దేవతల హృదయమునం దావిర్భవించు వారు, లేక ఇష్టసిద్ధి కొఱ కెల్లప్పుడును దేవతలచే స్మరింపబడువారు, లేక దేవతల కాప్తులు, లేక దేవతలకు హృదయభూతులు.

కిరికేభ్యః అన్నప్పుడు స్వేచ్ఛచే లోకములను చేయువారనికూడా భావము.

నమో విక్షీణకేభ్యః. 16

నమః - విక్షీణకేభ్యః.

ఆ॥వె॥ విచ్చు దశయొలేని విబుధుల హృదయమై
యమరినట్టి మీకు నంజలిడుదు.

తా॥ నాశములేని దేవతాహృదయులైన మీకొఱకు నమస్కారము.

**నమో విచిన్వత్కేభ్యః.** 17

నమః - విచిన్వత్కేభ్యః.

ఆ॥వె॥ కోరుదాని నెల్లఁ గొనునట్టి శక్తులౌ
నమరహృదయులకు మహాంజలిడుదు.

తా॥ అపేక్షింపబడిన దాని నెల్ల సంపాదింప శక్తిగల దేవతాహృదయులగు మీకు నమస్కారము.

**నమ ఆనిర్హ తేభ్యః.** 18

నమః - ఆనిర్హ తేభ్యః

తే॥గీ॥ పాపరూపు నెల్ల భంజించు దివ్య మ
నస్కులైన మీకు నతియొనర్తు.

తా॥ పాపనాశనము సేయువారలగు దేవతా హృదయులగు మీకు నమస్కారము.

న్యాయముగాను, మర్యాదగాను చేయబడుహింస ఆనిర్హతము. అట్టి వారు అపరాధుల నుపేక్షింపరు. ఇట్టి రూపులైన దేవతలనుండి వేరుపఱుప వీలు గానివారైన మీకు నమస్కారమన్నమాట.

**నమ ఆమీవత్కేభ్యః.** 19

నమః - ఆమీవత్కేభ్యః.

ఆ॥వె॥ స్థూలభావమందు శోభించు విబుధుల
హృదయమైన మీకు నేనతింతు.

తా॥ స్థూలభావము చేత అంతటను విజృంభించు వారలగు దేవతల హృదయ రూపులగు మీకు నమస్కారము.

పరమేశ్వరుని సర్వాత్మ తత్వము నిరూపించుటకే అనేక విధములుగా ఆయనయొక్క స్థావరజంగమ రూపములు చెప్పబడినవి. పదునాఱవ మంత్రము మొదలుగాగల దీనికి ఋషియు దేవతయు భగవంతుడగు శంభువు. ఛందస్సు షట్పదజగతి. పరాక కచ్ఛము చరించి నలువదివేలు జపించగా పురశ్చరణమగును. పిమ్మట మంత్రశోధనార్థము గురుసన్నిధానమున నెనిమిది వేలు జపించునది.

**కామ్యకర్మములు చెప్పబడుచున్నవి :**

1. దక్షిణామూర్తి సన్నిధానమున దనయగ్ని యందుగాని, మధితాగ్ని యందుగాని లాజలు నువ్వులు గలిపి లక్షవేల్వవలయును. సువర్ణము కలుగును.

2. దధిమధుఘృతములచే దడుపబడిన వెదురుబియ్యమును యవలును పదివేలు వేల్చినయెడల వేయి సువర్ణములు కలుగును.

3. తనకిష్టమైన కన్యక సమానాకృతియైన గుగ్గులు ప్రతిమనుగావించి దాని స్పృశించుచు నైదువేలు జపించి యంతట దాని ఛేదించి యాఱువేలు వేల్చెనేని సర్వాభరణ భూషితయైన యిష్టకన్యం బడయును.

4. కమలోత్పల కుముదంబులు లక్షవేల్చిన వానికి రాజ్యలక్ష్మి ప్రత్యక్షమగును.

5. పాలతో దడుపబడిన మోదుగు మొలకలు లక్షహోమము చేసినచో యక్ష రాక్షస భూత ప్రేత పిశాచాదులు దృశ్యులును వశ్యులును అగుదురు

పెద్ద అడవియం దగ్ని కుండముగావించి మధితాగ్ని యందు పదివేలు బిల్వఫలములు వేల్చి, ఘృతాక్తములగు బిల్వపత్రంబులు ముష్టిమాత్రములుగా అయిదువే లహోరాత్రులు వేల్చినచో వానికి బిల్వఫలాకారముగల సువర్ణ పిండము సిద్ధించును. అది పరుసవేదియగును.

ఆవు నేతితో దడుపబడిన తెల్లదామర పూవులు లక్షహోమము చేసిన వానికి సార్వభౌముడగు పుత్రు డుదయించును.

7. శమీసమిధలను కొనలువంచి రజత పాత్రమున నుంచి దధి మధుఘృతాక్తములు గావించి పదివేలు వేల్చువాడు శివభక్తుడగు పుత్రునింబడయును.

8. అఱపలము తెల్లవస చూర్ణము గావించి వెండిపాత్రయందు కాపిలాజ్యముతో రంగరించి పదివేలమా ర్లీ మంత్రముతో నభిమంత్రించి సేవించినవాడు కవియగును.

9. దధి మధు ఘృతాక్తములగు నుదుంబర సమిధలు పదివేలు వేల్చు నతడు మహాభోగియగును.

10. మనోజవము గోరినవాడు ముప్పది కృచ్ఛ్రములు చరించి దేహశుద్ధి నొందినవాడై చరుశాకమూలఫలంబు లాహారముగా గొనుచు నిరువదెనిమిది దినములు నిరంతరము జపింపవలెను. ఈలోపల బుద్ధిపూర్వకముగా నిదురింపరాదు. బుద్ధిపూర్వకముగా నిదురించినచో దక్షిణము స్నానము ప్రాయశ్చిత్తము పదునెనిమిది దినములైనపిమ్మట మంత్రవశ్యమునకై గురువున కైదు స్వర్ణనిష్కము లీయవలెను. పిమ్మట గురుసన్నిధియందుగాని దేవుని సన్నిధియందు గాని యేబదివేలు జపము సేయవలెను. అంత నుమాసహితుడగు రుద్రుడు ప్రత్యక్షమగును. తదనుగ్రహమున మనోజవసిద్ధి గలుగును. అప్పుడాత డెచ్చట

కేగనెంచునో అస్థానమును, గురువును స్మరించి ఈ మంత్రము నెనిమిది వేలమార్లు జపించినచో నాదేశమును పొందగలడు.

11. అదృశ్యసిద్ధికి దీని పురశ్చరణము పూర్వమువలెనే చేయవలెను. రక్తచందనము కపిలాక్షీరముతో రంగరించి యశ్వత్థపత్రమునందుంచి దాని స్పృశించుచు నెనిమిది వేలు జపించునది. అంత దానిని దేహమంతయు బూసికొని దేవుని స్పృశించియు స్మరించియు ప్రాణాయామధారణము చేయునది. అంత నదృశ్యుడగును.

12. రాజవశ్యమునకు రక్తచందన చూర్ణము దీనిచే పదివేలమార్లభి మంత్రించి రాజగృహమునకు బోవునప్పు డంతయు లలాటమున ధరించిపోవునది. రాజును రాజపురుషులును వశ్యులగుదురు.

13. శత్రునాశమునకు ఆ శత్రువు పేరు గ్రహించి శివుని సన్నిధి యందొక్క పాదమున నిల్చి పదివేలు జపించగా ఆ శత్రువొక సంవత్సరములో నశించును.

14. దక్షిణామూర్తి సన్నిధిని నిత్యము అష్టశతము జపించగా రాజ పురుషుల భయముండదు.

ఆ॥వె॥ హస్తపాదములును నంచిత కేశముల్
శిరము ముఖములట్లె చెలcగి సర్వ
మావరించి పూర్ణమై సుప్రకాశుcడౌ
శివుcడు ధ్యానమందు చెందుcగాక.

నవమానువాకము సంపూర్ణము

## దశమానువాకారంభః

ద్రాపే అన్ధస స్ప తే దరిద్ర న్నీలలోహిత

ఏషాంపురుషాణా మేషాం పశూనాం

మాభేర్మా రో మో ఏషాంకించ నా మమత్ 1

ద్రాపే - అన్ధసః - పతే - దరిద్రత్ - నీలలోహిత - ఏషామ్
పురుషాణామ్ - ఏషామ్ - పశూనామ్ - మా - భేః -
మా - అరః - మా - ఉ - ఏషామ్ - కిమ్ - చన - అమమత్.

సీ॥ పాపుల నరకానఁ బడఁద్రోయు వాఁడవు, భక్తాన్న రక్షణ ప్రాలుమాల
కుండు వాఁడవు గేవలుండవుఁ, న్గాలకూటమ్ముచేఁ గంఠదేశ మ్మఖిలము
నీలవర్ణంబున నిండార దక్కిన, భాగమంతయు రక్తవర్ణుఁడవగు
రుద్రుఁడా నీశక్తి రూఢినొప్పెడిమాకు, నస్మత్కళత్ర ఋత్రాదులకును
బశువులకుఁగూడ లేశమున్భయములేని
యునికి నివ్వుము బైనఁజెప్పిన విధముల
నేదియునుగూడ నశియించ కేదిగాని
రోగమును బొందకయె యుండ రూఢిపఱచి.

తా॥ పాపులను శిక్షించువాడా! భక్తుల అన్నమును పాలించువాడా! నీవుదక్క మఱియొండు మిగులనివాడా! కంఠదేశమున మాత్రము నల్లనై మిగతా శరీరమంతయు నెఱ్ఱనైనవాడా! మా సంబంధమైన పుత్ర మిత్ర కళత్రాదులకును, పశువులు మొదలగు వానికిని అభయమిమ్ము. వీనిలో నేదియు నశింపకుండ నేదియు రోగమును బొందకుండ యుండుగాక.

ఇందు "అంధసస్పతే" అన్నప్పుడు అన్నమునకు నాథుఁడాయనియు, "దరిద్రత్" అన్నప్పుడు దేనిని అంటని దరిద్రస్వభావుడా అనియు రెండు విధములును దేవుని సమత్వమును రూఢిపఱచుచున్నవి. మఱియు 'నీలలోహితా' యనుపదానికి దేవుని హృదయమునుండి ఆవిర్భూతుడైన రుద్రుడే నీలలోహితుడు. అనగా అర్ధము నీలవర్ణము, అర్ధము లోహితవర్ణము గలవాడు. నరనార్యాత్మకు డగుటవలన నని తెలియునది. లేక నామరూపాత్మకు డగుటవలన నని తెలియునది. జ్ఞానవిశేషమువలన నరుడే నారాయణ్డై

నారాయణుడగుచున్నాడు. నరశబ్దము మనుష్యునందును నారాయ శబ్దము నారాయణునందును, నారాయణ శబ్దము విష్ణువు, సూర్యుడు, చంద్రుడు, బ్రహ్మ, శివుడు, అగ్ని, పరమాత్మలయందును ద్యోతకమగుచున్నవి. కనుక శివుడనగా పిపీలికాది బ్రహ్మపర్యంతము సర్వత్రవ్యాప్తుతమైయున్న అఖండ మూర్తియని తెలుచున్నది. దీనికి ఋషి పులహుడు, దేవత రుద్రుడు, ఛందస్సు ఆస్తారపంక్తి, ఒకదిన ముపవసించి పదివేలు జపించినచో బురశ్చరణమగును. ఆర్ద్రానక్షత్ర దినమునందు కపిలాజ్యముచే బదివేలు హోమము జేసినచో ధనమునందును.

2. సన్నిపాతజ్వరము కలవాని శిరఃపార్శ్వమున నగ్నిం బ్రతిష్ఠించి దూర్వాగ్రము లైదువేలు వేల్చగా జ్వరవిముక్తుడై దీర్ఘాయువగును.

3. వికంకసమిధలు పదివేలు హోమముచేయువానికి అభిచారము వలన భయము కలుగదు.

4. ఘృతాక్తమగు తిలలు పదివేలు హోమము సేసినవానికి మహాజన ద్వేషభయముండదు.

5. అత్తిసమిధలు తిలలు పదివేలు వేల్చినచో సర్వభూతములవలనను భయముండదు.

6. గ్రామమధ్యమున గాని నగరమధ్యమునగాని యగ్నిం బ్రతిష్ఠించి ఆజ్యోక్తమగు నువ్వుపిండిచే పదివేలాహుతులు వేల్చునది. అశ్వత్థపత్రముల యందు బలియుంచునది. ముందును వెనకను ఎనిమిదివేలు జపముసేయవలెను. అతనికి రుద్రుడు సర్వభూతసహితుండై భైరవాకృతిలో బ్రత్యక్షమౌను. అప్పుదు చూచి చలించెనేని యున్మాదము నొందును. అచలుడై యుండెనేని మహాసిద్ధిం బడయును. తద్రూపము స్మరించినచో నాపదలు తొలగును.

సీ॥ చీలమండలదాక జీరాడుచున్నట్టి, నల్లచొక్కాయతో నాణ్యమైన
దమరుచేతనుబట్టి డాంబికం బొప్పఁగా, నొసటకుంకుమ బెట్టి నూపురములు
ఘర్షణం బమరంగ ఘన దంతముల కాంతి, చేత దిక్కులు వెల్గఁ జేతియందు
శూలముద్ధరియించి సొంపు పోగులతోడ, వెల్గనై గన్పట్టు వెంద్రుకలును
గలిఁగి భైరవ వేషానఁ గ్రాలునట్టి
సర్వలోకాలు రక్షింపఁ జాలుమూర్తి
దేహకాంతులు హొయలుఁగాఁ దేజరిల్ల
నంబికానాథుఁడగుపించు నతని కపుడు.

యా తే రుద్ర శివా తనూ శ్శివా విశ్వాహ భేషజీ

శివా రుద్రస్య భేషజీ తయా నో మృడ జీవసే. 2

యా - తే - రుద్ర - శివా - తనూః - శివా - విశ్వాహ - భేషజీ - శివా - రుద్రస్య - భేషజీ - తయా - నః - మృడ - జీవసే.

సీ॥ సర్వకాలములందుఁ జాలి భక్తాళుల, దారిద్ర్యరోగము ల్వారదోలి
జ్ఞానంబొసంగి నిత్యానందితులఁజేసి, జన్మమరణాది సంసార దుఃఖ
మును దోలునట్టిదై ఘన మంగళాకృతి, రూపించునట్టి నీరూపమేదొ
నామూర్తిచేత రోగాది బాధలులేక జీవింపగామమ్ముఁ జేసి తుదకు
నీదు దర్శనమిచ్చి వినీతబుద్ధి
స్వస్థతను గూర్చి మఱి మాకు శాస్త్రవిధుల
నాత్మలాభంబు చేకూర్చి హాయిఁబఱచి
మోక్ష మిడవయ్య రుద్రుఁడా మోదమలర.

తా॥ రుద్రుడా! సర్వకాలములయందును భక్తులకు దివ్యౌషధములవలె దారిద్ర్యరోగములను బోగొట్టునదియు జ్ఞానదానముచే జన్మ మరణాది దుఃఖములను దోలి నిన్ను పొందించునదియు నైన మంగళకరమైన ఏ నీరూపము కలదో ఆరూపము చేత మా కీలోకమున సౌఖ్యమును జేకూర్చి తుదకు సంసార దుఃఖమును తొలగించి మోక్ష మొసంగుము.

ఇతరమైన ఔషధములు దేశ కాలావస్థాది భేదంబులంబట్టి యొకానొకప్పుడు మాత్రమే ఔషధమగును. శివదౌషధము ఏ భేదమును బొందక సర్వకాలములయందును భక్తులకు (1) సాంసారిక సుఖము (2) నిశ్శ్రేయస సౌఖ్యము అను రెండు మార్గముల దత్ఫలిత మొసగును. అట్టి ద్వివిధమగు లాభవంతమైన శివత్వముగల నీరూపమన్న మాట.

ఈ మంత్రమునకు ఋషి స్కంధుడు. దేవతయు స్కంధరూపుడగు రుద్రుడు. ఛందస్సు అనుష్టుప్పు. ఎనిమిది నూర్లు ప్రాణాయామము గావించి యైదువేలు జపించగా పురశ్చరణ రూపమగును. దీనిచే గర్భరక్షచేయునది. గర్భము వ్యక్తమైన మూడవమాసమందైనను లేదా అవస్యమని తోచినప్పుడైనను చేయవచ్చును. మంత్రసిద్ధుడగు బ్రాహ్మణునిచే జేయించునది. అతని శివునిగా భావించి నమస్కరించవలెను. గృహమధ్యమునం దగ్ని కుండమును వేదికను నిర్మించి వేదికయందు శుద్ధతండులములు పఱచి సాధారణఘటము

బ్రతిష్ఠించి యందు మహాసేన మంత్రముచే స్వర్ణ పుష్పమున శివు నావాహనము గావించి బిందుయుక్తములు తంతువేష్టితంబులు.

స్వర్ణగర్భంబులు శరావపిహితంబులు సముద్రగామి నదీజలపూర్ణంబులు నూతన వస్త్రచ్ఛన్నంబులు నగు కలశంబులుంచి తన్మధ్యంబున జల పూర్ణంబును ఆర్ద్రానక్షత్ర దినమునైనచో బంగారముచేతను కానిచో నవ రత్నములచేతను బూర్ణమగు నొక్క ఘటముంచి వాని నుత్తమ వస్త్రముచే గప్పి కదలకుండునట్లుంచి దేవు నారాధించునది. కడవఱకు నాద్యదీపముంచునది. పూజాద్రవ్యాదులన్నియు కర్పూరమిశ్రితములు గావించునది. అంత దత్సన్నిధియం దుపస్థానమంత్రము జపించి పిమ్మట బటనంస్కారముచే హోమముగావించునది. దధిమధ్వాజ్యనంయుక్తములగు తిలధారాగ్రలాజ తులస్యశీరములు హోమద్రవ్యములు ఇంకహవిస్సు బూజింపవలెను. పక్వమైన ప్రస్థపరిమిత తండులములు హవిస్సు దాని నగ్ని యందు వేల్చునది. ఇట్లు సాయంకాలమునుం జేయునది. ఆచార్యుడు జపించునది. నిత్యము బ్రాహ్మణుల భుజింపజేయునది. ఇట్లు గావించినచో ఆయుష్మంతమైన సదపత్య మొదవును. గర్భపాతము సంభవింపదు. హోమదేశమునకు స్త్రీలు శూద్రులు రాకూడదు. పాషండులు బ్రవేశింపరాదు. అంతమువఱకు దీక్షించి కడపటిదినమున స్నానము సేయునది. పిమ్మట గురునకు దక్షిణ నిచ్చునది. కుమార గ్రహశాంతికొఱకు గణపతిపూజ సేయునది. ఆయపత్యము దీర్ఘాయువగును. ఇక బ్రయోగాంతరములు జెప్పబడుచున్నవి.

1. ఘృతప్లుతంబులగులాజలు హోమించినచో నభీష్టకన్యకంబడయును.

2. ఉత్తరేణుసమిధుల వేల్చినచో అలక్ష్మి నశించును. తిలహోమముచే సర్వపాపములు నశించును.

3. తెల్లనివియు, నెఱ్ఱనివియు నల్లనివియు పీతవర్ణములగలవియు నగుతంతువులచే జుట్టబడిన ఖదిరసమిధల హోమముచే క్రమముగా నాలుగు జాతులవారు దన వశ్యులయ్యెదరు.

4. నేతిచే లక్షహోమములు గావించినట్లయిన సర్వకామంబులు సిద్ధించును.

5. కలువలు మొదలగు పుష్పముల్గను వేల్చినచో తాను వేల్చు పూలవంటి వస్త్రలాభమును పొందును.

6. గోమయముచే నలికిన శుచిప్రదేశమున నెఱ్ఱమట్టితో మండలము గావించి దానికిముందు సూత్రవేష్టితము ఫలపూరితము నగు నూతనకుంభము బ్రతిష్ఠించి యందు సూర్యు నావాహనముచేసి పూజించి క్షీరముచే నూట యెనిమిది ఆహుతులు వేల్చునది. అంత సూర్యుని ధ్యానించుచు సహస్రము జపించునది. ఇట్లు ఏడుదినములు గాని పండ్రెండు

దినములుగాని చేసినచో భగవంతుడు ప్రసన్నుడై మహావర్షమును గురియించును.

7. పుత్రుని గోరువాడు ఒక్క యహోరాత్ర ముపవసించి శుచియై పాయసము నూటయెనిమిదాహుతులు వేల్చి యెనిమిదినూర్లు జపించి ఋతు స్నాతయు భరిశుద్ధయు నగు భార్యచే హుతశేషమును దినిపించునది. అంత బ్రాహ్మణుల భుజింపజేసి వారి యాశీర్వాదమును పొందగా తేజస్వియు రోగహీనుడు నైన బుత్రుం బడయును.

8. అనిష్ట మొదవినప్పుడుగాని దుస్వప్నము కలిగినప్పుడుగాని అభిచారదోషము సంభవించినప్పుడుగాని అలక్ష్మిబాధ కలిగినప్పుడుగాని యుద్ధము మొదలైనవి తటస్థమైనప్పుడుగాని గ్రహచారము క్రూరమైనప్పుడుగాని భూతావేశము కలిగినప్పుడుగాని మఱియే సంకటముల యందుగాని మున్ను చెప్పినట్లు మండలముగావించి యందు ఏలాలవంగ కర్పూర నింబజాతి ఫలము లుంచి దేవు నావాహనము చేసి పూజించి హోమము చేసి ఈ మంత్రముచే తజ్జలము నూటయెనిమిదిమార్లభిమంత్రించి యాజలముచే నభిషేకించునది. సర్వదోషములు నశించును.

9. నిత్యము ప్రాతః కాలమున స్నానము చేసి ఈ మంత్రము సహస్రము జపించినచో శ్రీయు నారోగ్యమును తేజస్సును నిరంతరము వృద్ధిబొందును.

10. క్షీరము నాహారముగా గొనుచు జితేంద్రియుడై యొక సంవత్సరము ప్రతిదినము యథాశక్తి బూజగావించుచు బదివేలు జపించెనేని అణిమాదులైన సిద్ధులు పొందును.

11. భగవంతునియందే హృదయముంచి ఏకాగ్రుడై దృఢచిత్తముతో నిరంతరము జపించుచుండువాడు ముక్తుడగును.

తే॥గీ॥ మెఱుఁగు బంగార మన నొప్పు మేనితోడ
హస్తముననొప్పు బల్శక్తి యాయుధమున
నాఱు మోముల నమిలి వాహనమునందు
బాహులేయత్వమునఁదోచు భర్గుఁ డపుడు.

ఇమా గ్ం రుద్రాయ తవసే కపర్దినే
క్షయద్వీరాయ ప్రభరామహే మతిమ్
యథా శమ్ సద్ద్విపదే చతుష్పదే
విశ్వం పుష్టం గ్రామే అస్మిన్నాతురమ్. 3

ఇమామ్ - రుద్రాయ - తవసే - కపర్దినే - క్షయద్వీరాయ - ప్రభరామహే - మతిమ్ - యథా - నః - శమ్ - అసత్ - ద్విపదే -చతుష్పదే-విశ్వమ్ -పుష్టమ్-గ్రామే -అస్మిన్ -అనాతురమ్.

సీ. మాపుత్ర పౌత్రాది మనుజవర్గమునకుఁ
బఱఁగు గోమహిషాది పశువులకును
గలుఁగఁగా సౌఖ్య మీగ్రామమందున్నట్టి
ప్రాణులన్నియుఁ బుష్టి పాత్రములుగ
నమరి యే కష్టంబులందు జిక్కకయుండ
కోరికల్ మాకెల్లఁ గూర్చు నతఁడు
దిట్టయై జూటంబు దీపింప సతతము
హత పరిపంధియౌ నతఁడు భవుఁడు
నైన శివునకుఁ బూజావిధానమందు
ధ్యాననిష్ఠల సంపూర్తిగా ననయము
భక్తిచే మెప్పుఁ గావించు శక్తిమాకు
వృద్ధి గావించుచున్నాము విధియుతముగ.

తా॥ మా పుత్రపౌత్రాది మనుష్యులకును, పశువులకును, సుఖము కలుగునట్లుగాను ఈ గ్రామమందున్న ప్రాణిసమూహమున కంతకు సుఖము కలుగునట్లుగాను మాకోర్కెలన్నియు నెఱవేర్చుటకు సమర్థుడున్నూ దిట్టయు జటాజూటము కలవాడును శత్రువుల హతమార్చువాడును అగు రుద్రుని కొఱకైన పూజావిధానమందు మాధ్యానశక్తిని మిక్కిలి పోషించుచున్నాము.

ఇందులో మేము నివసించు గ్రామమందున్న సమస్త ప్రాణిజాతముతో సహా సౌఖ్య మివ్వుమనుటలో "రుద్రాధ్యాయీవసేద్యత్ర గ్రామేవా నగరరేపివానతత్రక్షుత్పిపాసాద్యా దుర్భిక్షవ్యాధియోపిచ" అన్నట్లు రుద్రాధ్యాయి యగు వాడు గ్రామమందుగాని నగరమందుగాని యెచ్చట వసించునో అచ్చట క్షుత్పిపాసాదులు గాని దుర్భిక్ష వ్యాధులుగాని కలుగవు అను పౌరాణిక వాక్యమునకు సరిపోవుచున్నది. కాబట్టిరుద్రుడే స్తోత్రవ్యుడు ఉపాసితవ్యుడు అని తేలుచున్నది.

మృడానో రుద్రోతనో మయ స్కృధి క్షయద్వీరాయ

నమసా విధేమ తే యచ్ఛంచయోశ్చమను రా

యజేపితా త దశ్యామ తవ రుద్ర ప్రణీతౌ.

మృడ - నః - రుద్ర - ఉత - నః - మయః - కృధి - క్షయ ద్వీరాయ - నమసా - విధే మ - తే - యత్ -శమ్ - చ - యోః - చ - మనుః - అయజే - పితా - తత్ - అశ్యామ - తవ - రుద్ర - ప్రణీతౌ.

సీ॥ పరగ నీలోకానఁ బరలోకమున మమ్ము
సుఖియింపఁ జేయవే శుభయుతముగ
అందుకై మా బాపమంతయు న్వోఁదోలు
మయ్య నీ కొనరింతుమయ్య నతులు
మఱియు నా పరమేష్ఠి మా జీవితమునకై
యెట్టెట్టి సౌఖ్యంబు లిచ్చినాఁడొ
అందుకై వ్యతిరేక మనునది లేకుండ
నేయే విధానంబు లేర్పఱచెనొ
నన్నిటిం గూడ బఱికించి యంచితముగ
వాటినన్నిటి సార్థక్య పఱచి నీదు
కరుణ నిడకున్న క్షేమంబు గలుఁగదయ్య
రక్ష సేయుము నీవట్లు రమ్యచరిత.

తా॥ రుద్రా! మమ్మీలోకమందును పరలోకమందును సుఖియింప జేయుము. అందుకై పాపములను బోదోలగల నిన్నాశ్రయింతుము. ప్రజాపతి మాకెట్టి సౌఖ్యముల నిర్ణయించెనో వాటిని గూడ నీయొక్క ప్రేమ మాయందు కలిగిననే పొందగలము కాబట్టి మమ్ము రక్షింపుము.

1. ప్రజాపతిచే మా కర్మానుకూలముగా మా కెట్లెట్లు వ్యవస్థచేయబడెనో అట్లే పొందెదము. కాని ఒకవేళ చేయకపోయినను నీయనుగ్రహముచే మా కా యతిక్రమణ దోషముండదని భావము. ఎందువల్లననగా తమ అజ్ఞయందున్నాము కాబట్టి యను...

2. రుద్రా! నీయాజ్ఞయందు స్మృతికర్తయైన మనువు ప్రజలకు హితము చేయుటచేత

తంద్రివంటివాడై స్మృతియందు దుఃఖనివృత్త్యుపాయముల వేనిని నియమించెనో అట్లే పొందెదము. నిన్ను సేవించు మాకు తద్వ్యవస్థాభంగము సంభవించదు.

3. మఱియు — సత్పితామహుడైన ప్రజాపతి ఏ నీ యనుగ్రహము తానును స్వీకరించెనో నీ యనుగ్రహమువల్ల దానిని పొందుదుము. అనగా నీ వేర్పఱచిన దుఃఖ నివృత్త్యుపాయమునే సర్వజ్ఞుడైన ప్రజాపతి స్వీకరించెననియు నీ యనుగ్రహమున్నచో మాకది సిద్ధించుననియు భావము.

ఈ రెండు మంత్రములకును ఋషి మాండవ్యుడు. ఛందస్సు జగతి. దేవత రుద్రుడు. ఈ రెండును ఒకేమంత్రము ఒక ప్రాజాపత్య కృచ్ఛ్రము చరించి తొమ్మిదివేలు జపించినచో బురశ్చరణమగును. అమావాస్యయందు జతుష్పథంబునం దగ్ని బ్రతిష్ఠించి నవనీతము పదివేలాహుతులు వేల్చినచో పశుశాంతియగును. జలము స్పృశించి పదివేలు జపించి యాజలమును రాజవాహనములపై బ్రోక్షించినచో దచ్ఛాంతియగును. ఆవాహనముల కుపయోగించు నాహారములలో నాజలము కొంచెము కలుపవలెను. ఆజ్యమిశ్రమములైన తిలలు పదివేలు వేల్చినయెడ తిర్యగ్జంతువులకు శాంతియగును. తక్కిన జంతువులకు శాంతి గావలయు నేని దూర్వలు పదివేలు వేల్పవలెను.

తే॥ అపుడు పంచాస్య చర్మ మయాసనమున
దివ్య మౌనీంద్రతతిచే నుతింపఁబడుచు
చంద్రకళయొప్పు వీక బ్రసన్నమైన
శివునిఁ బూజింపవలె మోక్ష సిద్ధి కొఱకు.

**మా నో మహాన్త ముత మానో అర్భకం**

**మాన ఉక్షన్త ముత మాన ఉక్షితం**

**మా నో వధీః పితరం మోత మాతరం**

**ప్రియామాన స్తనువో రుద్రరీరిషః. 5**

**మా - నః - మహాన్తమ్ - ఉత - మా–నః - అర్భకమ్ - మా–నః - ఉక్షన్తమ్ - ఉత - మా–నః - ఉక్షితమ్ - మా–నః - వధీః - పితరమ్ - మా - ఉత - మాతరమ్ - ప్రియాః - మా - నః - తనువః - రుద్ర - రీరిషః.**

తే॥గీ॥ అరసి మాబాల వృద్ధులన్ యౌవనులను
గర్భ శిశువులతోఁ గూడఁ గరుణతోడ
రక్షసల్పుము మా శరీరముల కెట్టి
బాధలేకుండఁ జేయవే భద్రమొసఁగి.

తా॥ మా పితామహాది వృద్ధులను మా శిశువులను మా వంశకర్తలు గాబోవు యువకులను మా సంబంధమైన గర్భశిశువులను మా తల్లిదండ్రులను హింసింపకుము. మఱియు మా శరీరముల కెట్టి బాధయు లేకుండ భద్ర మొసఁగుము.

ఈ మంత్రమునకు ఋషి దేవరాతుడు. దేవత నందీశ్వరస్వరూపుడగు రుద్రుడు. ఛంధస్సు జగతి. మూ డుపవాసనములు గావించి యైదువేలు జపించిన యెడల పురశ్చరణమగును. దీనిచే సర్వజన రక్షచేయున దెట్లనగా ఆజ్యముచే దడుపబడిన యవలును తిలలును పదివేలు వేల్వవలెను. లేక అశ్వత్థ సమిధలు పదివేలు వేల్వవలయును. లేక ఆజ్యముచేత పదివేలు వేల్చునది. ప్రతి సంవత్సరము ఆర్ద్రానక్షత్రమందు పదివేలు వేల్చునది. ఇట్లు గావించు వానికి శాంతి క్షేమములు చేకూఱును. ఇతరములందుగూడ నీమంత్రము పదివేలు జపించినచో ఫలవిశేషమగును. రాజు ప్రతిమాసము నార్ద్రయందు ఈ మంత్రముచే హోమము చేయింపవలెను. రాజు నంతఃపురాది స్వజనము వర్ధిల్లును.

తే॥గీ॥ బాలచంద్రుని మౌళిపైఁ బరఁగఁ దాల్చి
కోటిసూర్యుల తేజంబు గోటమీటి
ప్రమధ గణనాథ కలితుఁడై బఱఁగు నంది
కేశ్వరుండైన యీశ్వరుండిచ్చు సుఖము.

మా న స్తోకే తనయే మా న ఆయుషి
మా నో గోషు మా నో అశ్వేషు రీరిషః
వీరాన్మా నో రుద్రభామితో వధీ
ర్హవిష్మ న్తో నమసా విధేమతే. 6

మా – నః – తోకే – తనయే – మాః – నః – ఆయుషి – మా – నః – గోషు – మా– నః – అశ్వేషు – రీరిషః – వీరాః – మా – నః – రుద్ర – భామితః – వధీః–

హవిష్మంతః - నమసా - విధేమ - తే.

తే॥ గీ॥ మాదు సుతులను మనుమల మాదు జీవి
తముల గోవుల నశ్వసంతతుల భృత్య
సమితి బ్రోవుము సర్వదా సంతసమున
హవినిఁ బచరించి చేమోడ్పు లమరఁజేతు.

తా॥ ఓరుద్రా! నీకు కోపము కలుగునట్లు మే మపచార మొనర్చినను సహించి మా పుత్ర పౌత్రులను మా ఆయుష్యమును మా గోమహిషాదులను మా యశ్వ గజాదులను మా భృత్యాదులను సర్వదా రక్షింపుము. అందుకై మేము హవిస్సు వేల్చి నమస్కారము చేసి వేడుచున్నాము.

పురుషాయువు నూటపదునాఱు సంవత్సరములని ఛాందోద్యోగమును, నూట యిరువదియని జ్యోతిష గ్రంథములును, నూట యిరువది యేడని కొన్ని పురాణములును తెలుపుచున్నవి. నూఱు అనునది సర్వసాధారణముగా చెప్ప బడుచున్నది. ఇన్నిటిని పరికించి నీవే సత్యమును నిర్ధారణచేయుమని భావము.

ఈ మంత్రమునకు ఋషియు దేవతయు భగవంతుడు. ఛందస్సు జగతి. ఒక కృచ్ఛము చరించియు దుంబర పాత్రమున గపిలాజ్యము వేయిమార్లభిమంత్రించి దానిచే దనయగ్ని యందుగాని మథితాగ్ని యందుగాని యెనిమిదివేలు వేల్చి మహావ్యాహృతులచే నూఱాహుతులువేల్చి శేషము త్రాగునది. అంత మూడురాత్రు లుపవసించి పిమ్మట చరువు భుజించుచు నేబదివేలు జపించునది. గురువున కైదు నిష్కము లీయవలెను. పురశ్చరణమగును.

1. రాజు ప్రతిదినమును తన యగ్నియందుగాని, మథితాగ్ని యందుగాని తిలలు పదివేలు వేల్వవలెను, మఱియు రాజు చుట్టు నెనిమిది దిక్కుల యందును నెనమండ్రు బ్రాహ్మణు లెనిమిదివందల మా ర్లభిమంత్రించి రాజునకు రక్షసేయవలెను. రాజున కాయుర్వృద్ధియగును.

2. రుద్రరూపులు పదునొకండుగురు బ్రాహ్మణులు మంత్ర సిద్ధులు గాని, సద్య సిద్ధులు గాని రాజునకై దధి మధు ఘృతాక్తంబులగు శ్వేతకమలముల బదివేలు వేల్చగా రాజునకు శ్రీ వర్ధిల్లును.

3. ఆచార్యుని వలన మంత్రమును పొంది మూడు రాత్రు లుపవసించి మూడు రాత్రులు నిరంతరము జపించిన రాజునకు సద్యస్సిద్ధియగును. అందుచే నప్పటి కర్మయందు మాత్రము యోగ్యత కలుగును. అంతట నేతిచే తడుపబడిన ధూర్వలు పదివేలు నిత్యమును వేల్చుచుండిన యెడల రాజు చిరంజీవి యగును.

4. స్వర్ణ రజత తామ్ర మయంబులగు కలశములు ఎనిమిది వేలుగాని, యెనిమిది వందలుగాని జలపూర్ణంబులు గావించి ఈ మంత్రముచే నభిమంత్రించి నూతన వస్త్ర వేష్టితంబులు గావించి గంధాదులచే నర్చించి యితరములైన మంగలాచారము లొనర్చి ఆచార్యుడు రాజును తజ్జన్మదినంబున నా కలశములయన్నింటి జలముచే నభిషేకింప వలయును. దీనిచే రాజు శరీరజ దోషంబులును బాపంబులును నశించును.

5. ఈ మంత్రమును నిత్యమును ఒక బ్రాహ్మణునిచే నెనిమిది వేలు జపము చేయించిన యెడల రాజున కభివృద్ధియగును

6. వాహన శాలయందును, ఆయుధ శాలయందును, గనులు మొదలగు వానియందును ప్రతిమాసము సౌమ్య నక్షత్రమున నీమంత్రముచే శాంతి చేయునది.

7. దధి మధ్వాజ్యసిక్తంబులగు అశ్వత్థాపామార్గ సమిధలు పదివేలు వేల్చినచో గతాయువైనను దీర్ఘాయువగును.

8. ద్యూతమునందు వ్యవహారమునందు ఈ మంత్రము జపించిన యెడల పరాజయము కలుగదు.

9. మూడు రాత్రము లుపవాసముతో నిరంతరము జపముచేసి యటు పిమ్మట జరువు భుజించి తేనెతో దడుపబడిన బిల్వఫలంబులు పదివేలు వేల్చెనేని వేయిస్వర్ణముల బొందును.

10. దధి మధ్వాజ్యసిక్తంబులగు కుముదంబులు పదివేలు వేల్చినయెడ నభీష్టకన్యకం బడయగలడు.

11. ఒక సంవత్సరము చరువు భుజించుచు బ్రతి దినము తనయగ్ని యందు కపిలాజ్యముచే నెనిమిది వేలు గాని, యెనిమిది వందలు గాని యాహుతులు వేల్చెనేని మహాపాతకములు నశించును.

12. చందనచూర్ణము నీ మంత్రముచే నభిమంత్రించి లలాటంబున దాల్చగా నందఱును దనవశ్యులగుదురు.

13. ప్రతి జన్మదినమునను అపామార్గ సమిధ లెనిమిది వేలు వేల్చినచో నపమృత్యుభయ ముండదు.

14. రవి వారమున రక్త వస్త్ర చందనాదులు ధరించి పదివేల దాసని పూలచే సూర్యు నారాధించెనేని మహావర్షము కురియును.

15. దూరమార్గ మేగదలచినవాడు చిన్నరాలను ఎనిమిది వేలావృత్తు లీ మంత్రముచే నభిమంత్రించి పదిదిక్కులకును వేసి పోయెనేని క్షేమముతో మరలివచ్చును.

16. గొప్ప కర్మ నారంభించునప్పుడు దీని బదివేలు జపించి యారంభించెనేని

అనాయాసముగా సమాప్తినొందును.

17. అజ్యముచే లక్ష హోమము చేసినచో వంశకరుడైన పుత్రు డుదయించును.

18. తా నెవ్వని జయింపగోరునో అతని సైకత ప్రతిమ గావించి దాని శిరస్సున నిలుచుండి పదివేలు జపము చేయవలెను. జయమునొందును.

ఇట్టి మంత్ర ప్రభావముచే సర్వమును సాధ్యమగును. కాని మంత్ర సిద్ధులకు మాత్రమే ఫలించునని తెలియునది.

తే॥ గీ॥ పదునొకండైన రూపాలఁ బరఁగి వేడ్క
శుద్ధదేహంబుచే నొప్పి శోభఁ గలిగి
పటికముల కాంతి నొప్పారి బాలచంద్రు
తల ధరించిన శూలి ప్రత్యక్షమగును.

ఆరా త్తే గోఘ్న ఉత పూరుషఘ్నే
క్షయద్వీరాయ సుమ్నమస్మేతే అస్తు
రక్షాచ నో అధి చ దేవ బ్రూ
హ్యధాచ న శ్శర్మయచ్ఛ ద్విబర్హాః. 7

ఆరాత్ - తే - గోఘ్నే - ఉత - పూరుషఘ్నే - క్షయ ద్వీరాయ - సుమ్నమ్ - అస్మే - తే - అస్తు - రక్ష - చ - నః- అధి - చ - దేవ - బ్రూహి - అధ - చ - నః - శర్మ-యచ్ఛ - ద్విబర్హాః.

సీ॥ పొసగు మా గోవుల న్బురుషులన్ భృత్యుల
న్నసియింపఁజేయు నీ నిశితమైన
సారూప్యమునుమాకు దూరంబు గావించి
యిఁక శాంతి రూపాన నెసఁగవయ్య
సర్వరీతుల మమ్ము సంరక్షణ మొనర్చి
మా గొప్పఁ జెప్పు సమ్మతిని దేవ
తతికి నీ లోకానఁ దగ నూర్ధ్వలోకాన
భక్తాళి కభివృద్ధిఁ బరఁగ నిచ్చు

వాఁడనే గాన మమ్మింక వదలకుండ
నిహ పరంబుల రెండింట హెచ్చురీతి
సుఖములం గూర్చు రుద్రుఁడా శుభచరిత్ర
నీకుఁ జేమోడ్పులన్గూర్తు నిశ్చయముగ.

తా॥ ఓ రుద్రుడా! మాగోవులను, పురుషులను, భృత్యులను చంపగల నీ క్రూర రూపమును మాకు దూర మొనర్చుము. సుఖమును కలుగఁజేయు నీ శాంతమైన రూపమును మాయందుంచుము. మేము అధికులమని చెప్పుము. రెండులోకముల యందును వృద్ధిని చేయునట్టి నీవు మాకు సుఖమునిమ్ము.

ఈ మంత్రమునకు ఋషి యత్రి. దేవత శంభువు. ఛందస్సు త్రిష్టుప్పు. మూడు రాత్రు లుపవసించి మూడు రాత్రులు నిరంతరము జపించినచో బురశ్చరణ మగును.

ఈ మంత్ర మాయుష్కాముల కుపయుక్తము. ప్రతిదినమును దన యగ్ని యందు ఆజ్యముచే నెనిమిది వేలుగాని, యెనిమిది నూర్లుగాని హోమము సేయవలెను. దధి మధ్వాజ్యసిక్తములగు ధూర్వ లెనిమిది వేలయినను వేల్చ వలెను. ఎల్లప్పుడును దన జన్మనక్షత్రమున నెనిమిది వేలు జపము సేయవలెను. ఆర్ద్రా నక్షత్రము వచ్చినప్పుడెల్ల ధూర్వలు అపామార్గ సమిధలు తిలలు దధి మధ్వాజ్యసిక్తంబులు గావించి ప్రత్యేకము పదివేలు వేల్వవలయును. మఱియు రేయి దేవునకు బ్రదక్షిణములు సేయుచు నైదువేలు జపింపవలెను. రాజు జన్మదినమున ఈ ధూర్వాదు లొక్కొక్కటి పదివేలు వేల్వవలయును దీర్ఘాయువగును.

అశక్తులగువారు నదీప్రవాహమున హోమము సేయునది. మిక్కిలి యశక్తులు జపము సేయునది.

తేనెచేతను నేతిచేతను దడుపబడిన శుద్ధతండులములచే ఐదివేలాహుతులు వేల్చినయెడల నాయుర్వృద్ధియగును. అర్కపుష్పములు పదివేలచే దేవుని బూజించినచో సంపద వర్ధిల్లును.

పశ్చిమద్వారమైన శివాలయమందు క్షార లవణంబులు వర్జించి చరువు భుజించుచు బ్రహ్మచర్య మవలంబించి నేలపై బరుండుచు దేవుని యన్ని పర్వములందును వేయిమార్లు జపము సేయవలెను. ఇట్లుగావించినచో వరుసగా నేడు జన్మములయందు శతాయువగును. అశక్తుడగువాడు భిక్షించి యాహారించునది.

తే॥గీ॥ దేవి ముందర నానంద దీప్తులెసఁగఁ
దాండవము సేయుచును వగ్నిఁదాల్చి భసిత
తుల్యమై మించు రూపానఁదోచునట్టి
లలిత రుద్రునిఁ దనయందుఁ దలపవలయు.

స్తుహి శ్రుతం గర్తసదం యువానం

మృగ న్న భీమ ము పహత్ను ముగ్రమ్

మృడా జరిత్రే రుద్ర స్తవానో

అన్యం తే అస్మ న్ని వపన్తు సేనాః. 8

స్తు హి - శ్రుతమ్ - గర్తసదమ్ - యువానమ్ - మృగమ్ - న - భీమమ్ - ఉపహత్నుమ్ - ఉగ్రమ్ - మృడా - జరిత్రే - రుద్ర - స్తవానః - అన్యమ్ - తే - అస్మత్ -'ని - వపన్తు - సేనాః

సీ॥ హృదయగర్తంబున నెసగెడివాఁడును
సతత యౌవన కళాన్వితుఁడు నుతుఁడు
యేనుగు న్జంపగా నెసగు సింహముపోల్కి
కాలాంతమందు లోకాళిఁగూల్చ
ఘోరరూపుండైన నారాయణప్రియుఁ
దపవేయో జిహ్వా తథ్యముగను
ఇంక నావాక్కుచే హెచ్చు పొగడితగాంచి
యనిశంబు క్షీణించు నట్టిదైన
నాదు దేహంబు నందొప్పి నాకు సుఖము
కలుఁగఁ జేయుము రుద్రుఁడా కరుణతోడ
నీదు సేనలు నన్విడచి నాదుశత్రు
వులను వధియించుఁగాక దోర్బలము మెఱయ.

తా॥ ఓ నావాక్కా! హృదయమునం దున్నవాడును, ఎల్లప్పుడు యౌవనము కలవాడును, కాలాంతమున లోకములను గూల్చుటకు సింహము వంటివాడును అగు రుద్రుని స్మరింపుము. ఓ రుద్రా! నాచే స్తుతించబడిన వాడవై ప్రతిదినము క్షీణించు స్వభావముగల నాశరీరమునందుండి నన్ను సుఖింపజేయుము. నీ సేనలు నన్ను విడిచి నాశత్రువులను వధియించుగాక.

గర్తసదమ్ = గర్తమనగా రథము. కనుక త్రిపుర దహనాద్యవసరమున బ్రహ్మాండమైన

రథమునందొప్పినవాడనియు, గర్తమనగా గొప్ప తేజస్సు కనుక దానిని పొందినవాడనియు, లేక అగ్నిచే భక్షింపబడగా నైనది శ్మశానము గనుక అందున్నవాడనియు, గర్తమనగా హృదయము గనుక తదభ్యంతరమున నున్న వాడనియు భావము.

ఉపహత్నుమ్ అనగా మృత్యుంజయుడని భావము. మఱియు శ్రుతమ్ గర్తమ్ సదమ్ యువానమ్ అనుటలో ఎల్లప్పుడును శ్రుతియందు రమించు వాడనియు భావము. ఈ మూర్తి అత్యుగ్రమగుటవలన దేవుడు పరోక్షకుడుగా స్తుతించబడెను.

ఈ మంత్రమునకు ఋషి నైయాగ్రుడు, దేవత రుద్రుడు, ఛందస్సు త్రిష్టుప్పు. ఒక రాత్రి యుపవసించి మూడు రాత్రులు నిరంతరము జపించగా పురశ్చరణమగును.

విషతైలాక్తమగు వికంకత సమిధలు లక్ష శ్మశానాగ్నియందు వేల్చిన యెడల శత్రువులు నశింతురు. దేవుని సన్నిధానమున హస్తమున భస్మము ధరించి శత్రునామము గ్రహించి పదివేలు జపించినయెడల శత్రువునకు మహాజ్వరము కలుగును. తెల్లావాలు పదివేలు హోమము చేసినయెడల శత్రువు మాసూరికచే మృతుడగును. శత్రువు గృహారామ క్షేత్రాదులయందు ఈ మంత్రమును జపించుచు బిల్లముత్రవ్వి అందు రోమములు అస్థులు రాళ్లు పాతగా ఆశత్రువు శీఘ్రముగా నశించును.

సీ॥ కోటి సూర్యులఁగూడ గోటమీటెడికాంతి
తోడఁ గార్చిచ్చుతో తుల్యమైన
వెంద్రుకల్ గలవాఁడు వీరవిహారుఁడై
శత్రుభీకరముఁగాఁ జాలువాఁడు
భక్తాళి కభయంబు బరఁగఁ గూర్చెడివాఁడు
నాదితేయ స్తోత్రమందువాఁడు
శబ్దగుణమైన నుజ్వల శరీరమువాఁడు
శరభావతారుండు శక్తిధరుఁడు
గర్త దేశంబునందొప్పు ఘనుఁడు సతము
జీవకోటులకెల్ల నుజ్జీవమందు
నొచు హృదయాబ్జముల యందు దోచువాఁడు
నైన మూర్తిని ధ్యానింప నగునుగాక.

పరిణో రుద్రస్య హేతి ర్వృణక్తు

పరిత్వేషస్య దుర్మతి రఘాయోః

అవస్థిరా మఘవద్భ్య స్తనుష్వ మీఢ్వ

స్తోకాయ తనయాయ మృడయ. 9

పరి–నః – రుద్రస్య – హేతిః – వృణక్తు – పరి–త్వేషస్య – దుర్మతిః – అఘాయోః – అవ – స్థిరా – మఘవద్భ్యః – తనుష్వ – మీఢ్వః – తోకాయ – తనయాయ – మృడయ.

సీ॥ రుద్రు నాయుధములు రూఢిగామమ్ముల
మావారలనుగూడ మనుచుఁగాక
క్రూరమై హింసనే గోరు నా కోపంబు
మాక బాధకముగా మఱలుఁగాక
రుద్రుఁడా వైరులన్ ద్రుంచుటకొఱకైన
నీదు తామసబుద్ధి యేదిగలదొ
అదినీకు హవినిచ్చునట్టి మాబోంట్లపైఁ
బ్రసరింపకయె యుండఁబడును గాక
మఱియుఁ గోర్కుల వర్షించు మహితచరిత
పరగ మాకును మా పుత్ర పౌత్రులకును
సౌఖ్య మొనగూర్చుమా! యింక ముఖ్యముగను
హవిని బచరించి ధ్యానింతు మంచితముగ.

తా॥ రుద్రుని ఆయుధములు మమ్ము మావారలను బాధింపకుండుగాక. భయంకరమైన నాయుగ్ర బుద్ధి మమ్ము మా వారలను బాధింపకుండుగాక. రుద్రుడా శత్రువులను నశింపజేయు ఏ నీ తామస బుద్ధిగలదో అది నీకు హవిస్సునిచ్చు మా నుండి తొలగింతువుగాక. మఱియు కోర్కులను వర్షించు నో భగవంతుడా మా పుత్ర పౌత్రాదులకు కూడా సౌఖ్యమిమ్ము. దేవుని నిగ్రహమునకు పాత్రులగునట్టి పాపకారులము గాకుండ మమ్ములను చేయుమని దీని భావము.

ఈ మంత్రమునకు ఋషియు దేవతయు భగవంతుడు. ఛందస్సు త్రిష్టుప్పు. ఈ కార్తియు నుగ్రమగుటవలన మొదట పరోక్షముగా పఠింప బడెను. ప్రాజాపత్యకృచ్ఛ్రము చేసి తొమ్మిది దినములు ప్రతిదినము నెనిమిదివేలు జపించునది. పురశ్చరణమగును. దీనిచేఁ బుత్రకాములకు ప్రయోగము చెప్పబడుచున్నది. గుప్తముగా జేయవలెను.

(1) దావానలముచే దగ్ధమైనచోట మొలచిన ఫలాశ ఖదిరాది సమిధలు పదివేలు దధిమధ్వాజ్యసిక్తములు గావించి పదమటి ద్వారముగల శివాలయమున హోమము సేయవలెను. శివతుల్యుడైన పుత్రు డొదవును. దీనికి స్వగృహముగాని అవుల మందలుండుచోట గాని స్థానమగును. ఆర్ద్రా నక్షత్రముగాని అమావాస్యగాని కృష్ణాష్టమి గాని ప్రారంభకాలములు. మొదటిదినము దంపతులు చరువు భుజించియుండవలెను. ప్రతిమంత్రాక్షరము తంతువేష్టితము జలపూర్ణమునగు నొక్కొక్క కలశము బ్రతిష్ఠించి వాని నడుమ నొక యున్నత కుంభమునుంచి యందు "ఆయాతు భగవాన్ కైలాసాత్" అనగా భగవంతుడు కైలాసమునుండి వచ్చునని దేవు నావాహనముచేసి చక్కగా బూజించి యంత నడిమి కలశము మొదలు ప్రతికలశము మంత్రము యొక్క మొదటి యక్షరము మొదలుకొని యొక్కొక్క యక్షరము న్యాసము చేయునది. అంత తొమ్మిది వేలు జపించునది. పిమ్మట స్వాగ్ని యందు శ్యామాకలాజలు మధ్వాజ్యసిక్తములు గావించి యెనిమిది వేలు వేల్చి పిమ్మట నేతిచే నన్నిమాఱులు వేల్వవలయును. అంత దంపతుల నేకాసనమున గూర్చుండబెట్టి యొక్కొక్క కలశము నెత్తి అక్షరరూపుడగు భగవంతుని ధ్యానించుచు నభిషేకించునది. అనంతరము మధ్యకుంభ జలముచే నభిషేకించునది. నూఱుమందిని భుజింపజేయునది. ఆ కలశ వస్త్రవ్రీహ్యాదులను ఆచార్యునకొసగి యతని భుజింపజేసి పూర్తిగా దక్షిణనొసగి ఇట్లు సమాప్తినొందించి దంపతులు భుజించునది. అంత వారలకు ఉత్తముడును దీర్ఘాయువునగు పుత్రు డొదవును. అశక్తుడగువాడు ఈ మంత్రమును జపించునది. పశ్చిమద్వారంబగు శివాలయమున ఉదయము మొదలు అస్తమయము వరకు, అస్తమయము మొదలు ఉదయము వఱకును అహోరాత్రము ప్రదక్షిణము సేయునది. శక్తుడైనవాడు అశక్తునివలె నటించి చేసిన నాశము నొందును. కాబట్టి పురశ్చరణసిద్ధుడగు ఆచార్యుడీ విషయమున నేమఱకుండవలెను. మిక్కిలి యశక్తులైన పుత్రకాముకులకు ప్రయోగ మెట్లనగా ఎనిమిదినూర్లు నలువదియొకటి యిరువది యొకటి గాని దినములు చరుభోజ్యమై దీక్షించి పశ్చిమద్వారమగు శివాలయమునందు ప్రతిదినము ఎనిమిదినూర్లు జపించవలెను. ఎనిమిది నూర్ల ప్రదక్షిణములు సేయవలెను. ప్రతిదినమును అశ్వత్థవృక్షము పూర్వపార్శ్వముగాని యుత్తర పార్శ్వమున గాని మొదలు కొని నాలుగు పార్శ్వములయందును ఎనిమిదినూర్లు జపించవలెను. అంత వఱకుగాని లేదా యింతమున గాని శక్తియున్నంతవఱకు బ్రాహ్మణులను భుజింపజేయవలెను. 'ఇట్లు ఐంచినచో వశంకరుడగు పుత్రుడొదవును.

తే॥గీ॥ హస్తిచర్మంబుచేఁ గప్పినట్టి దేహ
మమరఁగా నాయుధములొప్ప హస్తములను

పాపహరుఁడును దైతేయ భయకరుండు
నైన దేవుని ధ్యానింప నగు నిరతము.

మీఢుష్టమ శివతమ శివో నస్సుమనాభవ
పరమే వృక్ష ఆయుధం నిధాయ కృత్తింవసాన
ఆ చరపినాకం బిభ్రదాగహి. 10

మీఢుష్టమ - శివతమ - శివః - నః - సుమనాః - భవ - పరమే - వృక్షే - ఆయుధమ్ - నిధాయ - కృత్తిమ్ - వసానః - ఆ - చర - పినాకమ్ - బిభ్రత్ - ఆ-గహి.

సీ॥ భక్తాళి కోర్కెపైఁ బరఁగు నో శాంతుఁడా
నీవు మాపై కోపభావ ముడిగి
కరుణా విశేషంబు గలవాఁడ వగుమయ్య
మతిమాకు గన భయంకరములైన
నీయాయుధముల నన్నిటిని యున్నతమైన
పాదపంబున బెట్టి వ్యాఘ్రచర్మ
మునుదాల్చి మా కభిముఖముగా రావయ్య
నట్లు వచ్చుచు నీవు హస్తమందు
ఘనత శోభకు నీ బినాకంబు నాగఁ
బరఁగు ధనువును మాత్రమే బట్టి కేల
రమ్ము రమ్మింక మమ్ము సంరక్షసేయ
హావిని బచరించి నతియింతు మంచితముగ.

తా॥ కోర్కులను వర్షించు నో శాంతస్వభావుడా నీవు మాయందు అనుగ్రహబుద్ధి కలవాడవై త్రిశూలాది నీ యాయుధములనన్నిటిని ఒక యున్నతమైన చెట్టుపై బెట్టి పులిచర్మమును ధరించి మాకభిముఖముగా రమ్ము. అట్లువచ్చునప్పుడు నీవు నీ హస్తమందు అలంకారార్థముగా నీ పినాక ధనస్సును మాత్రము ధరించినవాడవై రమ్ము.

ఈ మంత్రము ఆయన ఉత్తమ పురుషత్వమును మంగళత్వమును మంచి మనస్సును ఉపకారబుద్ధిని తెలుపుచున్నది. ఈ మంత్రమునకు ఋషి వైరాజుడు. దేవత శంభువు. ఛందస్సు పంచపద త్రిష్టుప్పు. ఒక రాత్రి పదునైదు వేలు జపించుచో పురశ్చరణమగును.

ధనహానివలన గాని ప్రాణసంశయమునగాని మహాదుఃఖమువలన గాని చోరులవలన గాని భయము గలుగునపుడు ఆజ్యముచే నైదువేలాహుతుల హోమము సేయునది. ఆ భయములు తొలగును.

తే॥గీ॥ మంగళంబుల తానమై మహిత యౌవ
నమున వెల్గొందు వాఁడు బినాకమనెడి
విల్లుఁ గేల్బూని కరుణుఁడై వేగవచ్చు
నట్టి రుద్రుని ధ్యానింప నగును సతము.

వికిరి దవిలోహిత నమస్తే అస్తు

భగవః యా స్తేసహస్రగ్ం

హేత యోఽ న్య మ స్మ న్నివపన్తుతాః. 11

వికిరిద - విలోహిత - నమః - తే - అస్తు - భగవః - యాః - తే - సహస్రమ్ - హేతయః - అన్యమ్ - అస్మత్ - ని - వపన్తు-తాః.

తే॥గీ॥ భక్తతతులకు ధనమిచ్చి పరగువాఁడ
యెఱుపు తెలుపుల కాంతితో నెసగుఁవాఁడ
నీకు కైమోడ్పు లివె గొంచు నిశ్చయముగ
నాయుధంబుల నేచు మాయరుల రుద్ర.

తా॥ భక్తులకు విశేషముగా ధన మొసంగువాడా! తెల్లని యెఱ్ఱని కాంతిగలవాడా! నీకు నమస్కరించెదము. వేనవేల సంఖ్యగల నీ యాయుధములు మమ్ము వదలి మా శత్రువులను బాధించునుగాక.

భగవంతుడు పంచాక్షర ధ్యానమందు ధవళవర్ణుడనియు, అష్టాక్షర ధ్యానమందు లోహితవర్ణుడనియు చెప్పబడుటచేత రెంటికి చెందునట్లుగా విలోహిత వర్ణము వాడబడినది. సమగ్రమైన ఐశ్వర్యము వీర్యము యశస్సు శ్రీజ్ఞానము వైరాగ్యము అను షడ్గుణములు కలవాడు భగవంతుడు లేక ఉత్పత్తి వినాశములను భూతముల రాకపోకలను విద్యను అవిద్యను తెలిసినవాడు భగవంతుడు. మఱియు విలోహితము నిర్వికారత్వమును సూచింపు చున్నది. పరమార్థమున నీకొక్క యాయుధమును లేదు. ఐనను జగదుప సంహారాది సమయములయందు దుష్టనిగ్రహార్థము (శిష్టరక్షణ కన్నమాట) అనేక అయుధములను

దాల్చువాడవు గాన వాటిని మాయందు రాకుండు నట్లుచేసి మమ్మెల్లప్పుడును నీయనుగ్రహపాత్రులను జేయుమని ప్రార్థన.

ఈ మంత్రమునకు ఋషి పులహుఁడు. దేవత శంభువు. ఛందస్సు అనుష్టుప్పు. మూడు రాత్రులు చరువు భోజియై పదివేలు జపించునది. పిమ్మట నీ మంత్రము జపించుచు బదివేలు ప్రదక్షిణించునది. పురశ్చరణమగును.

1. మహాజన విరోధమైనప్పుడు దధి మధు ఘృతాక్తములగు నానా విధ యోగ్య సమిధలు పదివేలు వేల్చినచో నా భయముండదు.

2. కాపిలాజ్యముచే దడుపబడిన యుత్తరేణు సమిధలు లక్షవేల్వగా దిగ్విజయము గలుగును.

3. దధి మధు ఘృతాక్తములైన బిల్వసమిధలు లక్షవేల్చేనేని క్రూర మృగములు తన వశ్యములగును.

4. జలమధ్యమున దన యగ్నిని స్థాపించి యందు కపిలాక్షీరముచే లక్ష హోమ మొనర్చగా జలభయముండదు.

5. ఇంక నేదేని జయింపగోరునో దాని పేరు గ్రహించి కపిలాజ్యముచే లక్ష హోమ మొనర్చినచో తజ్జయము నందును.

ఆ॥వె॥ నిర్మలత్వమొప్ప నెఱిముఖంబున శాంత
మైన పెండ్లి వేసమూని గౌరి
తోడ విబుధనుతులఁ దోచెడి వాఁడైన
శివుఁడు ధ్యానమందు చెందునపుడు

సహస్రాణి సహస్రధా బాహువో స్తవహేతయః

తాసా మీశా నో భగవః పరాచీనా ముఖాకృధి. 12

సహస్రాణి - సహస్రధా - బాహువోః - తవ - హేతయః - తాసామ్ - ఈశా నః - భగవః - పరాచీనా - ముఖా-కృధి.

తే॥గీ॥ దైవమా నీదు హస్తాలఁ దనరునవియు
నెంచ మితిలేని శస్త్రంబు లేవి గలవొ
వాని నాథుండ వీ వౌట వాని మొనల
మాకు దూరంబొనర్పవే మహిత రుద్ర.

తా॥ ఓ భగవంతుడా నీ చేతులయందు వేనవేలుగా గల ఆయుధముల మొనలను మాకు పెడమొగములు గలవానినిగా జేయుము.

ఇందు భగవంతుని సమర్థత్వము నిరూపణము చేయబడుచున్నది. ఈ మంత్రమునకు ఋషి నారదుడు లేక కణ్వుడు. రుద్రుడు దేవత, ఛందస్సు అనుష్టుప్పు. అర్ధకృచ్ఛము చరించి పదునైదువేలు జపించినచో ఋరశ్చరణ మగును. దీనిచే రాజులవలన యుపద్రవములకు శాంతి చేయనగును.

1. శాల్మలీవికంకత సమిధలచేగాని ఆజ్యముచే దడుపబడిన వ్రీహియవ తిలలచేగాని పదివేలు వేల్చినయెడల రాజులవలన నగు భయము నశించును.

2. రాజువలన ప్రధాన పురుషునకు మరణభయమైనప్పుడు దక్షిణా మూర్తి సన్నిధానమున దీనిని లక్ష జపించునది లేదా వల్మీక మృత్తికచే లింగమును గావించి యది కరగువఱకు దీనిచే నభిషేకించి యా మృత్తిక నదిలో గలిపి తత్తీరంబున స్వాగ్ని యందు నేతితో దడుపబడిన శుద్ధతండులములచే బదివేలాహుతులు వేల్చెనేని మరణభయము నశించును.

3. అడవియందు బోవలసి వచ్చెనేని ఈ మంత్రముచే నెనిమిదివేలమా ర్లభిమంత్రించిన భస్మమును శరీరమంతయు బూసికొని పోవగా నతని కేభయమును కలుగదు.

4. కృష్ణచతుర్దశి యందు రాత్రి శ్మశానమున "రాక్షసేభ్యో బలి ముపహారామి" అని పలుకుచు ఓదన సహితమైన బిడాలమాంసముచే బలియుంచెనేని రాక్షసుల వలన భయము కలుగదు.

5. రాజునకు దైవోపద్రవ మగునేని మహాశాస్త సన్నిధానమున నాజ్యముచే నెనిమిది వేలాహుతులు వేల్చవలెను. కుక్కుటమాంసముచే బలియిచ్చునది. హోమమునకు వస్త్రములును సువర్ణాదికమును దక్షిణనీయవలెను. అచార్యునకు రాజ్యశతమాంశమునకు తక్కువకాని దక్షిణనీయవలెను.

6. ఇతరులకు దైవోపద్రవములైనప్పుడు ఆజ్యముచే నెనిమిదివేలు వేల్చగా నా యుపద్రవములు పోవును.

తే॥గీ॥ పాపములనెల్లఁ బరిమార్ప నోపువాఁడు
వరవిభూషలవాఁడు సర్వాయుధముల
నెసఁగ ధరియించినట్టి మహేశ్వరుండు
నైన దేవుని ధ్యానింప నగు సతంబు.

దశమానువాకము సంపూర్ణము

## ఏకాదశమానువాకారంభః

సహస్రాణి సహస్రశో యే రుద్రా అధిభూమ్యామ్

తేషాగ్ం సహస్రయోజనేఽవ ధన్వానితన్మసి. 1

సహస్రాణి - సహస్రశః - యే - రుద్రాః - అధి - భూమ్యామ్ - తేషామ్ - సహస్రయోజనే - అవ - ధన్వాని - తన్మసి.

చ॥ ప్రమథులు యేకదంతులును భద్రులు నందులు నైన జాతులై
యమరఁగ నందునొక్కొకటి యై తగు జాతిని వేనవేలుగా
నమరిన రుద్రులేరు గల రందరి విండ్లను మాకు బాధలం
దమరక చాలదూరమగు నట్లుగ దించెద మల్లెత్రాదులన్

తా॥ వేనవేలజాతుల సంఖ్యలచే నొప్పిన వారలైన యే రుద్రులు కర్మానురూపముగా అనుగ్రహింపుచు నిగ్రహింపుచు ధాత్రియం దొప్పుచున్నారో వారి ధనస్సుల యందలి నల్లత్రాడుల మోపులను సడలించి మాకు దూరమందుంచెదము.

అనగా నమస్కారములచేతను హవిప్రదానములచేతను ఆధనస్సుల మో పెడలించునట్లు వారిని ప్రసన్నుల గావించుకొనెదమన్నమాట.

"తేషాగ్మ్ సహస్రయోజనే" అను నుత్తరార్థ మన్ని మంత్రములకు వర్తించును. ఇచ్చట బ్రహ్మచే బ్రార్థితుడగు దేవునిచే సృష్టులైన దేవతుల్యులైన రుద్రులు చరాచరవర్గములను రక్షించుట పోషించుట సంహరించుట మొదలగు కార్యములను జేయుచు కర్మానురూపమైన ఫలముల నొసంగుచు అంతటను వాయువులు రశ్మిలు జీవులు మొదలగు నానావిధరూపముల విహరించెదరు. వారలీ యనువాకమున ప్రసన్నులుగా జేయబడుచున్నారు. భగవంతుడు భక్తానుగ్రహముకొఱకు వారి యభిసంధికధీనుడై అనేక విధములుగా దన్ను విభజించుకొని వారల కొక్కొక్కరికి సాక్షాత్కరించుట అభిమత మొసంగుట మొదలుగా అనుగ్రహించుచున్నాడు. అట్టి విభక్తులగు రుద్రులు అనాదియగు సంసారము నుండి లెక్కకు మీఱిన వారలై లోకానుగ్రహార్థము వర్తింపుచుందురు. వారల నధికరించి యీ మంత్రములు పఠింపబడుచున్నవి. రుద్రుని క్రోధస్వరూపము యొక్క స్ఫులింగములు ప్రాణులను హింసించుటకై సర్వలోకములందును సంచరించుచుండును. అట్టి సదృశులైన గణేశ్వరాదులైన రుద్రులిందు ప్రసన్నము చేయబడుచున్నారు.

అస్మిన్మహత్యర్ణవేఽన్తరిక్షే భవాఅధి. 2

అస్మిన్ - మహతి - అర్ణవే - అంతరిక్షే - భవాః - అధి.

తే॥గీ॥ కానవచ్చునట్టి కమనీయ కూపార
సన్నిభంబులైన శర్వువిండ్ల
నన్నిటిని గడించి యధిక దూరమొనర్చి
యెక్కు దింపియుంతు మింకమేము.

తా॥ సముద్రముతో సమానమై సర్వము నధిష్ఠించిన రుద్రుల ధనస్సుల యందలి అల్లెత్రాడుల మోపుల సడలించి మాకు దూరమందుంచెదము.

నీలగ్రీవా శ్శితికణ్ఠాశ్శర్వా అధః క్షమాచరాః. 3

నీలగ్రీవాః - శితికణ్ఠాః - శర్వాః - అధః - క్షమాచరాః.

చ॥ అలరెడి కాలకూటమగు నట్టి గళంబున నొక్కచోఁ దగన్
నలుపు ఘటింపఁ దక్కినది నాణెముగాఁ దెలుపొప్ప నెల్లనున్
లలిత విహారయుక్తమగు లాస్యమొనర్చెడి రుద్రు లెవ్వరో
తలపఁగ వారివిండ్లు కడు దవ్వుగఁ జేయుచు దింతుమియ్యడన్.

తా॥ నలుపు తెలుపు కంఠము కలవారలును, భూమి క్రింది భాగమున దిరుగు వారలును (పాతాళమందు) అగు రుద్రుల ధనస్సులయందలి అల్లె త్రాడుల మోపులను సడలించి మాకు చాలాదూరమం దుంచెదము.

నీలగ్రీవా శ్శితికణ్ఠా దివగ్ంరుద్రా ఉపశ్రితాః. 4

నీలాగ్రీవాః - శితికణ్ఠాః - దివమ్ - రుద్రాః ఉపశ్రితాః

ఆ॥వె॥ నలుపు తెలుపుఁ గూడఁ గలిఁగిన కంఠముల్
గలిఁగి దివిషదమున గ్రాలునట్టి
రుద్రులార మీదు రూక్షమౌ నల్లెత్రా
డులను దింతు మేము పొలుపుగాను.

తా॥ నలుపును దెలుపును గలిఁగిన వారలును స్వర్గమున విహరించు వారలును

అగు రుద్రుల ధనస్సుల యందలి అల్లెత్రాడుల మోపుల నడలించి మాకు దూరమందుంచెదము.

ఈ నాలుగు మంత్రములకును ఋషి దూర్వాసుడు, రుద్రుడు దేవత, ఛందస్సు అనుష్టుప్పు. చాంద్రాయాకృచ్ఛము చరించి పిమ్మట నైదువేలు జపించినచో ఋరశ్చరణమగును.

ఈ మంత్రములచే నాభిచారికకర్మ చేయునది. రాజు స్వదేశజులైన బ్రాహ్మణులచే జేయింపవలెను. జిల్లేడు దూదిచే జుట్టబడి కుందేటి నెత్తుటం దడుపబడినవగు శాల్మలీ సాల వేత్ర వేణు శరంబుల సమిధలు లక్ష వేల్వ వలయును. సూక్ష్మమగు పిష్టముచే శత్రుప్రతిమను గావించి దానికి ప్రాణ స్థాపనముచేసి క్రమముగా ఛేదించి వానిచే నెనిమిది వేలు వేల్వవలయును. అంత శశరుధిరాక్తములగుదర్భలచే నెనిమిదివేలు వేల్చునది. ఈ ప్రయోగముచే శత్రునాశమౌను.

శత్రుకృతాభిచారమునకు ప్రతిక్రియగోరువాడు దధిమధు ఘృతాక్తము లగు దూర్వ లైదువేలు వేల్వవలయును. అట్లు చేయించు రాజునకు అభిచార దోషము నశించును.

తే॥గీ॥ విరివియౌ కోరలను నొప్పి వీరుఁడౌచు
మండుచున్నట్టి బడబాగ్ని మాడ్కి కేశ
ములును దీపించ దీపముల్ మూడుదాల్చి
సర్ప భూషణుఁడై యొప్పు శర్వుఁ డగును.

యే వృక్షేషు సస్పిఞ్జరా నీలగ్రీవా విలోహితాః. 5

యే - వృక్షేషు - సస్పిఞ్జరాః - నీలగ్రీవాః - విలోహితాః.

ఆ॥వె॥ వృక్షములను వేడ్క విలసిల్లు వాఁడౌచు
లేతకసవుపోల్కి లీల నీల
చేందిరముల కాంతి నందు రుద్రుని వింఢ్ల
త్రాళ్ళ మోపు దించెదము సుఖువుగ.

తా॥ చెట్లయందు లేత కసవువలె పింజర వర్ణముకలవారలును నల్లని కంఠము కలవారలును మిక్కిలి యెఱుపురంగు కలవారలును అగు రుద్రుల ధనస్సులయందలి అల్లెత్రాడుల మోపులను నడలించి మాకు దూరమం దుంచెదము.

యే భూతానా మధిపతయో విశిఖాసః కపర్దినః. 6

యే - భూతానామ్ - అధిపతయః - విశిఖాసః - కపర్దినః.

ఆ॥వె॥ భూతనాధు కాచు బోడిశిరంబుల
మకుటములను దాల్చి మసలువారు
నైన రుద్రులార యధికమౌ మీవింఢ్ల
త్రాళ్ళ మోపు దించెదము సుఖముగ.

తా॥ భూతములకు ప్రభువులును, జుట్టులేనివారలును, జటామకుట ధరులును అగు రుద్రుల ధనస్సులయందలి అల్లెత్రాడుల మోపులను సడలంచి మాకు దూరమందుంచెదము.

భూతము లనగా అంతర్ధాన శక్తిగలవై మనుష్యులకు ఉపద్రవము సేయు గణవిశేషములు.

యే అన్నేషు వివిధ్యన్తి పాత్రేషు పిబతో జనాన్.

యే - అన్నేషు - వి విధ్యన్తి - పాత్రేషు - పిబతః - జనాన్.

ఆ॥వె॥ భోగ్యవస్తువులను బొందించి పాపుల
బాధపెట్టి మఱియుఁ బానములనుఁ
గలుఁగ జేయునట్టి ఘనులార మీవింఢ్ల
త్రాళ్ళ మోపు దించెదము సుఖముగ.

తా॥ భుజించు వస్తువులయందుండి భుజించువారలను బాధించువారలును పానీయములయందున్న వారలై త్రాగెడి జనులను బాధపెట్టు వారలును అగు రుద్రుల ధనస్సులయందలి అల్లెత్రాడుల మోపులను సడలించి మాకు దూరమందుంచెదము.

ఈ మూడు మంత్రములకును ఋషి దేవలుఁడు. దేవత రుద్రుఁడు, ఛందస్సు అనుష్టుప్పు. వీని పురశ్చరణాదిక మంతయు పై నాల్గింటివలెనేనని గ్రహించునది.

యే పథాం పథిరక్షయ ఐలబృదా యవ్యుధః. 8

యే - పథామ్ - పథిరక్షయః - ఐలబృదాః - య - వ్యుధః.

ఆ॥వె॥ మార్గములును మఱియు మార్గరక్షణరూప
మౌచు భక్తతతుల కన్నమిచ్చి
యరుల ఐంపు రుద్రులార మీదగు వింఢ్ల
త్రాళ్ళ మోపు దించెదము సుఖముగ.

తా॥ సర్వమార్గ రూపులను, మార్గరక్షకులును, భక్తుల కన్న మొసగు వారలును, శత్రువుల హత మొనర్చు వారలును అగు రుద్రుల ధనస్సులయందలి అల్లెత్రాడుల మోపు సడలించి దూరమందుంచెదము.

మార్గము లనగా పథములుమాత్రమేగాక లౌకిక వైదికాది మార్గములును మతములును వృత్యాదులును లోనగు సర్వవిధ మార్గములు నన్నమాట. ఐలబృదాః అన్నమును పోషించువారనగా దానికి ప్రభువులు అనగా కర్మానుగుణముగా కొందఱి కన్న మొసగుచు గొందఱి యన్న మపహరింపుచు కొందఱ కన్న మొసగి యాయువు నపహరింపుచు కొందఱ కాయువొసగి యన్న మపహరింపుచు కొందఱ కన్నము నాయువు రెంటిని ఒసగుచు కొందఱకు రెంటిని అపహరింపుచు నుండువాడు.

యవ్యుధః యత్ విధ్యన్తి ఏది కొట్టదగినదో దానినే కొట్టువారన్న మాట. ఎప్పుడును శాస్త్ర మర్యాద నతిక్రమించువారు కారని భావము.

యే తీర్థాని ప్రచరన్తి స్సృకావన్తో నిషఙ్గిణః. 9

యే – తీర్థాని – ప్ర – చరన్తి – సృకావన్తః – నిషఙ్గిణః.

ఆ॥వె॥ బాకు ఖడ్గములను బట్టి తీర్థంబుల
రక్ష కొఱకుఁ దిరుగు రధికవరులు
నైన రుద్రులార యధికమౌ మీవిండ్ల
త్రాళ్ళ మోపు దించెదము సుఖవుగ.

తా॥ బాకు ఖడ్గములను ధరించి తీర్థములను కాపాడుటకు దిరుగుచున్న రుద్రుల ధనస్సుల యందలి అల్లెత్రాడుల మోపు సడలించి మాకు దూర మందుంచెదము.

తా॥ ఈ తిరుగుటయందును వారి వారి భక్త్యానుగుణ్యముగా కొందఱకు తీర్థఫల మొసంగుటకును కొందఱకు లేకుండ చేయుటకును అని భావము.

ఈ మంత్రములకు ఋషి దేవలుడు. దేవత రుద్రుడు. ఛందస్సు అనుష్టుప్పు. ప్రాజాపత్య కృచ్ఛ్రము చరించి యైదువేలు జపించినచో పురశ్చరణ మగును.

ఋతుగమన దినమందు శుచియై తన యగ్నియందు ఆజ్యమిశ్రమమగు కపిలాక్షీరముచే నెనిమిది వేలాహుతులు వేల్వవలయును. పిమ్మట ఋతు గమన మొనర్చునది. అతనికి విద్వాంసుడు, వంశకరుడు నగు పుత్రుడు కలుగును. తీర్థయాత్రకు బోవువాడు తన యగ్నియందు ఆజ్యముచే ఐదివే లాహుతులు వేల్చి మౌనముతో తీర్థమునకేగి స్నానము చేసివచ్చి యగ్ని నారాధించి మౌనము వదలవలెను. యథోక్తమగు తీర్థఫలము బొందును. ధ్యానము పూర్వోక్తమని తెలియునది.

య ఏతావన్తశ్చ భూయాగ్ంస శ్చ దిశో రుద్రా

వితస్థిరే తేషాగ్ం సహస్రయోజనేఽ వధన్వాని తన్మసి. 10

యేః - ఏతావన్తః - చ - భూయాంసః - చ - దిశః - రుద్రాః - వితస్థిరే - తేషామ్ - సహస్రయోజనే - అవ - ధన్వాని - తన్మసి.

ఆ॥వె॥ ఇపుడు చెప్పఁబడిన యెట్టిట్టివారును
నింక నధికులౌచు నెసఁగువార
లౌచు విస్తరించి నట్టి మీ విండుల
త్రాళ్ళ మోపు దించెదము సుఖువుగ.

తా॥ ఇప్పుడు చెప్పబడినవారును, ఇంకను అధిక సంఖ్యాకులై దిక్కులయం దధిష్ఠించి యున్నవారును అగు రుద్రుల ధనస్సులయందలి అల్లెత్రాడుల మోపు సడలించి మాకు దూరమం దుంచెదము.

ఈ మంత్రమునకు ఋషి దేవలుడు, రుద్రుడు దేవత, ఛందస్సు అనుష్టుప్పు. పురశ్చరణము ప్రయోగము మొదలగునవన్నియు పూర్వమంత్రము వలెనే యని గ్రహింపవలెను.

నమో రుద్రేభ్యో యేపృథివ్యాం యేఽ న్తరిక్షే యే దివి

యేషా మన్నంవాతో వర్ష మిష వస్తే భ్యో

దశ ప్రాచీ ర్దశ దక్షిణా దశ ప్రతీచీ ర్ద శో

దీచీ ర్ద శో ర్ధ్వా స్తేభ్యో నమ స్తే నోమృడయన్తు తే

యంద్విష్మో య శ్చ నో ద్వేష్టితం వో జమ్భేదధామి. 11

నమః - రుద్రేభ్యః - యే - పృథివ్యామ్ - యే - అంతరిక్షే - యే - దివి - యేషామ్- అన్నమ్ - వాతః - వర్షమ్ - ఇషవః - తేభ్యః - దశ - ప్రాచీః - దశ - దక్షిణాః -

దశ - ప్రతీచీః - దశ - ఉదీచీః - దశ - ఊర్ధ్వాః - తేభ్యః - నమః - తే - నః - మృదయన్తు - తే - యమ్ - ద్విష్మః - యః - చ - నః - ద్వేష్టి - తమ్ - వః - జమ్భే - దధామి.

సీ॥ ఏరుద్రు లీధాత్రి నెసఁగుచున్నారలో
అందు నెవ్వార లధ్వాన్నమైన
యన్నముఁ్దినిపించి యందుకై చోరత్వ
మాదిఁగాఁ జేయించి యంతవారి
హింసించుచును యన్న మే హింస సల్పు నా
యుధముగా సంధించి యొప్పువారొ
యా రుద్రులకు నమస్కారమౌ దూర్పునం
దొకటియు దక్షిణంబొప్ప నొకటి
పశ్చిమోత్తరములఁ బరఁగ నొక్కొకటియు
నూర్ధ్వ మందొకటియు నొనరఁజేసి
యెవనిపైని మేము హెచ్చైన పగఁబూని
యుంటి మెవఁడు మాకు నొప్పువైరి
యౌను నట్టివారి నందఱ న్మరి నీదు
విప్పఁబడిన నోట వేసినాము.

తా॥ ఏరుద్రులు భూమియందున్నారో అందెవ్వరు అధ్వాన్నమును దినిపించియు అందుకొరకు చోరత్వాదులను జేయించియు పాపులను హింసించుచు అన్న మే హింససల్పు నాయుధముగా సంధించియున్నారో అట్టి అన్నమే యాయుధముగాగల రుద్రులకు నమస్కారము. తూర్పునందొకటియు దక్షిణమం దొకటియు పశ్చిమమం దొకటియు ఉత్తరమం దొకటియు నూర్ధ్వమం దొకటియు నిట్లు నమస్కారము లొనర్చి ఎవనిపైని మేము పగగొనియున్నామో ఎవ్వడు మాపైని పగగొని యున్నాడో అట్టి మాశత్రువును మీవిప్పబడిన నోట వేయుచున్నాము.

ఈ మంత్రము మూడు యజుస్సులు : నమో రుద్రేభ్యః అనుటయు దశ ప్రాచీరిత్యాదియు మూడింటికి సమానముగా సంధితము. యే పృథివ్యాం యేషా మన్న మిషవః (మొదటి దానికి) యేం తరిక్షే యేషాం వాత ఇషవః (రెండవదానికి) యే దివి యేషాం వర్షమిషవః (మూడవదానికి) విశేషములు కావున, మొదటిది నమో రుద్రేభ్యో - యేపృథివ్యాం యేషా మన్న మిషవస్తేభ్యో దశ ప్రాచీర్దశ దక్షిణా దశ ప్రతీచీర్దశోర్ధ్వాస్తేభ్యో నమస్తే నో మృడయన్తుతే యం ద్విష్మో యశ్చ నో ద్వేష్టితం వో జమ్భే దధామి.

రెండవది : నమో రుద్రేభ్యో యేం తరిక్షే యేషాం వాత వర్షమిష వస్తేభ్యో దశ .... మూడవది : నమో రుద్రేభ్యో యే దివి యేషాం వర్షమిష వస్తేభ్యోదశ - అను 1. పృధివి. 2. దివి. 3. అంతరిక్షముల భేదములవలన మూడు యజుస్సుల పాఠక్రమమును దెలుపుచున్నది. ఈ యజుస్సు చేత లోకత్రయ వర్తులగు రుద్రులకు నమస్కరించి వారల వలన తనకు సుఖమును తన శత్రువులకు నాశనమును ప్రార్థించబడుచున్నది. యే భూమి యందు వర్తించు వారికి యే అన్న మే బాణస్థానీయములో లేక హింసా సాధనములో అనగా కొందఱకు అపధ్య భక్షణాదులు గలిగించి వ్యాధుల బుట్టించుటయు కొందఱ కన్నమే లేకుండజేసి ఆకలిబాధ కలిగించుటయు కొందఱచే నన్నార్థము దొంగతనము మొదలగునవి చేయించి రాజ శిక్షను బొందించుటయు లోనగునట్లుగా పాపులను శిక్షించుటకు అన్న మే సాధన రూపముగాగల రుద్రులకు దశదిశలయందు నమస్కారము. ఇందులో నమో రుద్రేభ్యః అన్నప్పుడు వాచికముగాను, దశ ప్రాచీర్దశాదికముచే కాయకము గాను తేభ్యోనమః అనుటచే మానసికముగాను నమస్కారము లొనర్చబడి స్వాభిమతము ప్రార్థించబడినది.

ఇక నాకాశమునందు వర్తించువారికి వాయువే బాణములనగా వికట వాయువుచే రోగాదుల బుట్టించి ప్రాణాది పంచవాయువుల వికారము గలిగించి వానిచే హింసించుటయని భావము. స్వర్గమునందు వర్తించువారికి వర్షమే బాణము లనగా అతివృష్టి అనావృష్టులను గలిగించి దానిచే ప్రజల బాధింతురు. ఇదంతయు భూలోకవాసులకే యనువర్తించును.

## పర్యాలోకనము

రుద్రునకు ఘోరము శివము అనే రెండు రూపములున్నవి. హింసించునది ఘోరము, అనుగ్రహించునది శివము. శివము మఱల రెండువిధములు. 1.సాయుధము, 2. ఆయుధముల ధరింపనిది. ఒకటవ యనువాకమందలి ఒకటవ మంత్రము ఘోరము. రెండవది సాయుధ శివము. మూడవది ఆయుధరహితము. త్రిపుర దహన ప్రవృత్తమైన ఘోరరూపము శత్రువులకు దక్క మిగతా లోకమునకు బాధలేకుండుటకై నాలుగైదు మంత్రములలో ప్రసన్నము చేయబడినది. ఒకటవ యనువాకములోని 1,2,5,10,11,13,14,15 మంత్రములు ప్రత్యక్షకృతములు. మరియు ఒకటి మొదలు నాలుగు మంత్రములు పరోక్షకృతములుగా కూడా నగుచున్నవి. ఇంక 1 నుండి 4, 6 నుండి 9–12 మంత్రములు పరోక్షకృతములై యున్నవి. ఒకటి మొదలు తొమ్మిది మంత్రములచే క్రుద్ధదేవుని ప్రసాదమే విశేషించి చెప్పబడినది. కొన్ని యజుస్సులు ఉభయతో నమస్కారములును కొన్ని అన్యతరతో నమస్కారములును అయియున్నవి. ఉభయతో నమస్కారములు ఘోరములుగాను అన్యతరతో నమస్కారములు శాంతములుగాను

చెప్పబడుచున్నవి. బహువచనాంత శబ్దములకు రుద్రునిచే సృష్టులయి తత్సదృశులైన రుద్రులని యర్థము. రుద్ర పర్యాయములు కాని వానికిని తత్తదధిష్ఠాన బుద్ధిచే రుద్రుం డర్థమని తెలియునది. ఈ విధముగా ద్వితీయానువాకమున పదమూడు యజుస్సులు ఉభయతో నమస్కారములుగా చెప్పబడినవి. ఇట్టివే తృతీయానువాకమున బదునేడు యజుస్సులు చెప్పబడినవి. రెండవ యనువాకమున దేవుడు ద్రవ్యముల కధిపతియనియు మూడవ యనువాకమున కర్మల కధిపతి యనియు ప్రతిపాదింపబడినది. తృతీయానువాకమున నమస్కరింపబడినవారు దేవుని యనుచరులు లేక దేవుని లీలావిగ్రహ విశేషులు. చతుర్థానువాకమున నానా విధములుగా బరమేశ్వరు నుపాసించి తత్ప్రసాదమును పొందిన జాతివిశేషులు నమస్కరింపబడిరి. పంచమానువాకమున అధిష్ఠాన వ్యాపార భేదముచే భేదము నవలంబించి నమస్కారములు చెప్పబడినవి. ఆరు యేడు అనువాకముల దేవుని వీరత్వాదులు నమస్కరించ బడినవి. అష్టమానువాకమున 13 మొదలు అర్ధ్యైయాధారముల రూపమున దేవుడు లోకము ననుగ్రహించుట జెప్పబడినది. అంతవఱకు నాయన స్వరూప స్వభావాదులకు నమస్కరించబడినది. తొమ్మిదవ యనువాకమున దేవుడు భక్తుల కత్యంత సులభుడని దేవుని యనుగ్రహప్రకారములకు నమస్కారములు చెప్పబడినవి. మఱియు దేవుడు నిగ్రహించువారిని నిగ్రహించు ప్రకారమునకు గూడ నమస్కారములు చెప్పబడినవి. దేవతలకు ప్రియులగుటకును పాప పుణ్య పరిశీలనాదులచే దురాత్ములకు కొంచెమేని యవకాశము లేనియట్లుగా నుండుటకును నమస్కారము లొనర్చబడినవి. ఈ ప్రకారముగా నింతవఱకు విశ్వరూపమున దేవుని స్తుతించి పదియవ యనువాకము మొదలుగా నభయము ప్రార్థించబడినది. పదునొకండవ యనువాక మవతారము మొదటి పది ఋక్కులయందు తేషాగ్ం సహస్రయోజనే అను నుత్తరార్థ మన్నిటికిని వర్తించును. జపాదికమునందు ఆద్యంతఋక్కులు మాత్రమే పఠింపబడును. ఇచట బ్రహ్మదేవునిచే బ్రార్థితుడగు దేవునిచే సృష్టులై దేవతుల్యులగు రుద్రులు సమస్తచరాచర వర్గమును రక్షించుట యుపసంహరించుట మొదలైన కార్యము లొనర్చుచు జీవులకు కార్మానురూపకములగు ఫలముల నొసంగుచు బ్రహ్మాండమం దంతటను వాయువులు, రశ్ములు, మనుష్యులు మొదలైన నానావిధ రూపంబుల విహరించెదరు. వారలీ యనువాకమున బ్రసన్నులు గావించబడిరి. భగవంతుడు భక్తుల ననుగ్రహించుటకు వారి యభిసంధి కధీనుడై తన ననేక విధములుగా విభజించుకొని అనేక విధములుగా ననుగ్రహము చేయుచున్నాడు. అట్టి విభక్తులగు రుద్రులు లోకానుగ్రహమునకై వర్తించు చుందురు. వారి నధికరించి యీ మంత్రములు పఠింపబడుచున్నవి.

లోకముల సంహరించునట్టి రుద్రుని క్రోధస్వరూపము యొక్క విస్ఫులింగములు ప్రాణుల హింసించుటకై సర్వలోకములయందును సంచరింపు చుండును. గమనించినచో నివియు దత్ప్రసాదములే యగుచున్నవి. రుద్ర సదృశులైన రుద్రులిందు ప్రసన్నులు గావింపబడుచున్నారు.

అష్టమానువాకము మొదలు నవమానువాకమునందలి పదునాలుగవ మంత్రాంతము ఒకే మంత్రముగానున్నది.

ఈ యజుస్త్ర్యయాత్మకమైన నేకాదశానువాకములోని పదునొకండవ మంత్రమునకు ఋషియు దేవతయు భగవంతుడే. ఛందస్సు అనుష్టుప్పు. ఇకఁ బురశ్చరణము అందు మొదటి నిరువది యైదు దినములు ఆహార నియమము ధరించియుండవలెను. అందు మొదటి యైదు దినములు క్షీరమును మాత్రమే యాహరించునది. రెండవ పంచకము ఫలములు, మూడవది పెరుగు, నాల్గవది మరల ఫలములు నాహరించునది. ఐదవది యుపవాసముండవలెను. వెనుక నిరువదియొక్క దినములు హవిష్యభోజియై నిలుచుండి నిరంతరము జపింప వలెను. పిదప నైదు దినములు కంఠములోతు నీళ్ళలో నిలుచుండి జపించునది. ఆచార్యునకు ఐది నిష్కము లీయవలెను. తత్తుల్యమైన శుశ్రూష గావింపవలెను. పురశ్చరణ సిద్ధుడగును. అటుపిమ్మట ప్రతిదినమును దనయగ్నియందు ఆజ్యముచే నెనిమిదివేలుగాని, యెనిమిది వందలుగాని యూహుతులు వేల్చుచు యావజ్జీవము ననన్యమనస్కుడై జపము సేయుచుండవలెను. ఇట్లు సిద్ధుడగువాడు అమావాస్య దినమున దన యగ్నియందు కపిలాజ్యముచే నెనిమిది వేలాహుతులు వేల్వవలయును. అంత గేశములకు లేపనము గావించి యెనిమిదివందలు వేల్చునది. అంత నథర్వశిరస్సునందు జెప్పబడిన చొప్పున నారాధింపవలెను. అందువలన రక్తాంగియు నెఱ్ఱని వెండ్రుకలు గలదియు ఎఱ్ఱని కన్నులుగలదియు నగు కృత్య ప్రాదుర్భవించును. అశక్తిని మున్నె సిద్ధముగా నుంచిన యజారుధిర పూర్ణంబులగు నాలుగు కుంభములచే దృప్తినొందించవలెను. లేనిచో నాశక్తిచే నత డీల్గును. దానిచే దనస్వాభిమత మంతయు నీడేర్చుకొనవచ్చును. మఱియును ఆజ్యముచే ఐదివేలాహుతులు వేల్చినచో గాలజ్ఞానము గలుగును. సమగ్రమైన ఆయుః ప్రయాణము సిద్ధించును. కాపిల క్షీరముచే ఐదివేలు వేల్చినయెడ జాతిస్మరు డగును. మఱియు దీనిచే సర్వము సాధ్యమగునని భగవంతుడు పలికెను.

ఉపజాతి : నందివాహన మందు దివ్యుల • నాత్రమున నొప్పారుచున్
ముందుగా జగమందు జీవుల • మూలముగ జెన్నొందుచున్
సుందరాంగుఁడు బ్రహ్మ మాధవ • సూతమున మోదింపుచుఁ
ఇందు శేఖరు డౌచుఁ బార్వతి • హెచ్చుఁగను శూలంబు గే
లంది మోదముతోడఁ బ్రోచు న • హర్నిశము లోకంబులన్.

రగణము. సలము. భగణము. హగణము. సగణము. రగణము. పదునొకండవ యక్షరము పై యతి. పాదమునకు పదునెనిమి దక్షరములు.

ఏకాదశమానువాకము సంపూర్ణము

## సమ్మిష్టి రుద్రాధ్యాయానుక్రమణిక

చ॥ అనువుగ మూడు కాలములయందును దానమొనర్చి రుద్రమూర్
గనిన ఫలం బనేకముగఁ గల్గిన జన్మల పాపసంగతిన్
బనివడి భస్మమించు నెడ బాయక పూర్వపురీతిఁ బ్రస్థమం
దిన బరిమాణమౌ గలశ దివ్యమును న్దగఁ బూజసల్పి దా.
నిని జలపూర్ణ యుక్తముగ నింపియుఁ బూర్వపురీతి రుద్రునిన్
ఘనముగఁ బూజసల్పి విధిగాఁ బదునొక్కటియైన వేలు వే
ల్చినఁ బయినన్ని సారులుగఁ జేయగనొప్పుఁ బ్రదక్షిణంబులన్.

క. ఒక్కొక్క రుద్ర ముఖమునఁ
జగ్గఁగ చమకంబునందు సరియగు వరుసన్
న్నొక్కొక్క యానువాకము
మిక్కిలి బఠియింప వలయు మేలు గలుంగన్.

తే॥గీ॥ అంత బంచామృతంబుల నతులితముగఁ
బంచకవ్యంబుచేత నపారముగను
దాన మొనఁగూర్చి యానమస్తే నఁ బఱఁగు
నన్ని రుక్కుల నభిషేక మౌను సల్ప.

తే॥గీ॥ అప్పుడా రుద్ర పాఠంబు నందినట్టి
భూసురుల కెల్లఁ దృప్తిఁగా భుక్తులొసఁగి
పూజ సల్పంగ దక్సిద్ధి పూర్ణమౌను
శౌనకోక్త ప్రయోగంపు సరణిగాను.

సీ॥ అరుద్ర మంత్రాళిఁ గోరి దేనిని గాని
జపియించి బాయస సమ్మితముఁగ
నగ్ని యందున వేల్చ నగు నట్లగానిచో
క్షీరంబు చేనైనఁ జెల్లు నాజ్య
మునఁ జెల్లు నభిషేక మొనరించ వలెఁ బైని
బాయసాజ్యంబులఁ బరఁగఁ గూర్చి
పదివేలు వేల్చఁగా ఫలియించుఁ గామ్యముల్

దుష్ట భూతాదులు నృద్దలిపోవు
నట్టి యుచ్చాటనోక్తంబునందుఁ గూడ
పై విధానమె గ్రహియించఁ బలుఁగుఁగాని
భవ్య ఫట్కారమందంగ వలయు నందు
శౌనకోక్త ప్రయోగమై చను విదియును.

సీ॥ రాజ్యకాముండైన రాజు భ్రమించవు
ధన్వసప్తనెడి మంత్రంబుచేత
శంభుని శిరముపైఁ జందనంబున నైనఁ
బన్నీటియందైనఁ బరఁగఁ జేర్చి
కమలోత్పలములు సౌగంధికంబులు లక్షఁ
బూజ సల్పఁగ లక్ష్మి పొలుపుగాంచు
మఱి నమోయుక్తవః కిరీటేశ్వయను మంత్ర
ముల ఘృతాక్తంబుఁగాఁ దిలలు తండు
లముల వేల్పంగ శీఘ్రంబ లక్ష్మి హెచ్చు
రుద్ర మేదైన జపియించి రూఢభక్తి
వాజ్య సిక్తంబులై యొప్పు యవలతోడ
హోమ మొనరించఁగా లక్ష్మి హోయలుఁ గాంచు.

తే॥గీ॥ పరఁగ శ్రీ కాముఁడై యొప్పువాఁడు రుద్ర
పాఠమందున నేదైనఁ బఠనఁజేసి
పాయసముచేత బదివేలు భక్తివేల్చ
నతనికిని లక్ష్మి వొంగారు నద్భుతముగ.

చ॥ అరయ సనత్కుమార వచనాంచితరీతిఁగ బ్రాహ్మణుండుఁ దాఁ
గరము ఘటించి తానమును గ్రమ్మర సద్విధులెల్లఁ దీర్చి సుం
దరమగు వారి కూలమునఁ దప్పక బర్హిమమైన మోముగాఁ
బరగఁగ నొక్క లింగమును భవ్యతరంబుగ నల్పి వారిచే
మఱి మకరందసారమున మానితరోక్తిగ క్షీరసారతఁ
జిరమగు భక్తిచేత నభిషేకము ధ్యానములొప్ప నల్పియుఁ
విరివిగ గంధలేపనము వేడ్కను బిల్వదళార్చనంబు సా
దరముగ జేసి సేవ విధితంబుగ నల్పియు దక్షిణాస్యుఁడై

యరసి బదొక్కరోజులును నాట్య సమాహిత బిల్వపత్రిచే
మఱల బదొక్కరోజులు గ్రమంబుగ నీలగు శేశయాళిచే
మఱలఁ బదొక్కరోజుల సమంచితహల్లకసూనరాజిచే
దిరముగ హోమముల్ సలిపి దీక్షను దీప నివేదనాదులన్
గరమిడి చిత్తశుద్ధుడయి కాంచన లింగము లో స్మరింపుచుఁ
సురుచిర వృక్షరాజముల సూరెలనిల్చి సమాధియుక్తుఁడై
హరునిఁ దలంచి రుద్రము మహాంచితరీతిఁ బఠించ నప్పుడే
బరుసము గల్గు నాతనికి భర్గుని దివ్యకటాక్ష వీక్షణన్.

ఉ॥ లేక స్వయంభువై తనరి లెస్సఁగఁ బశ్చిమమైన మోమునన్
వీఁక దనర్చు లింగమును విధ్యుతరోక్తిగ నావహింపుచుఁ
లేక మలంపు బత్రముల లెస్సగ లక్ష బదొక్కరోజులన్
బ్రాకటరీతిఁ బూజ లిడు వానికి దివ్య సువర్ణ మబ్బెడిన్.

సీ॥ ఉదక శాకముల తో నొప్పుగా యవలను
భక్షించు చల్లిలో బంధురముగ
నాయటొ యప్తామ మనెడి మంత్రము చేత
క్షీరాక్త గుడ చితర్చేర్చి యొక్క
వేయి వేల్చఁగ నౌను విధిగ నాయుష్కామి
పూర్వోక్తవిధి దేవుఁ బూజసల్పి
అన్ని దిక్కులయందు నధికమై తనర వ
ర్ణాంచిత బలులిచ్చి యధిగమించి
గాని శ్రీ రుద్ర యేకాదశి న్నదియొక్క
వేల జపమును సల్పి విధితరీతి
గాని యారాత్రేతి ఘన జపంబునఁగాని
యా సేవలన్నింటి నమరఁజేసి
సిద్ధుఁ డగునట్టి విప్రునిచే సహస్ర
జపము సేయించ సర్వంబు సాధ్యమగును
మరలు జన్మానఁగూడ నా మహితచరితుఁ
డగును శివభక్తి యుక్తుఁడై యద్భుతముగ.

సీ॥ సమిధలఁ బదివేలు సరఁగ హోమించవ
పశుల వృద్ధినిఁగోరు భవ్యతముండు
మతి నమోయుక్తవః కిరికేభ్యయనుదాన
వీఁక దధ్యుక్తవైకాకతముల
నౌదుంబరములతో నమరించి బదివేలు
హోమించవలె వాక్కు నొనరఁగోరు
పూతుండు చౌసాలఁ బుట్ట మృత్తిక చేత
లింగము స్ఫుటియించి మంగళముఁగ
నభిషేక పూజాదు లమరించి భవునకై
మేళతాళములిచ్చి మేటిభక్తి
నైవేద్య మొనరించి నారాయణోక్తాన
మంత్ర పుష్పంబిచ్చి తంత్రవిధిని
వసను చూర్ణించి యొక తామ్రపాత్ర నునిచి
కపిల గోఘృతమున దానిఁ గలిపి లక్ష
విధులు మంత్రించి దాని సేవించవలయు
వస్త్రములఁ గోరువాఁ డిట్లె వలయునల్ప.

సీ॥ ఎవఁడు నాభిస్థమై యొసఁగు నా పగయందు
ఘనముగా రుద్ర మున్మనన సల్పి
నియామాన్వితంబుఁగా నిటలాక్షు జపియించి
భానున కెదురుగాఁ బఱఁగి నింద్రి
యముల సంయమనించి హరునిఁ బ్రార్థించగా
నతనికి శూలి బ్రత్యక్షమౌను
ఆరోగ్యమును గోరు నతఁడు మానోమహాం
తంబైన మంత్రానఁ దప్పకుండ
తిలలచేఁ బదివేలు సలలితంబుగ వేల్చ
నతఁడు దేవ శరీరియౌను గాదె
భయ విముక్తిని నెవ్వాఁడు బడయఁగోరు
రహాని మాగ్ంస యను రుద్ర సహితమైన
మంత్రమున బాయసంబుతో మధువు దధియుఁ
గూర్చి పదివేలు హోమించఁ గోర్కు లొదవు.

తే॥గీ॥ శాంతికాముండు మానో మహంతయనెడి
మంత్రమున వర్ష వర్షంబు మానకుండ
రావి సమిధలు పదివేలు రహిని వేల్వ
వలయు యాత్రకుఁ బో నెంచునప్డు గూడ.

సీ॥ అల మనోభవయుక్తమైనట్టి మంత్రాన
జక్కఁగా భస్మంబు సంస్కరించి
తన ఫాలభాగమందున దాని ధరియించ
భూత ప్రేత పిశాచములు తొలంగు
వలయు రాత్రుల జుట్టు విరజిమ్మకుండంగ
చోరుల బాధ జేకూరినపుడు
చెలఁగుమీదుష్టమః శివతమ యను మంత్రమును
జపించుఁడు రుద్రమూర్తి నెంచి
యలయిమాగుం రుద్ర యనెడి మంత్రంబుచే
లలిత ధూర్వలుగూర్చి లక్ష వేల్వ
నధమాయులైన దీర్ఘాయువు న్గణియించు
నంతయాతే రుద్రమందు శివత
మనెడి మంత్రము సహస్రాంచితం బొనరించి
పదియొక్క ముళ్ళతో బాలురకును
ఆపన్న సత్వాదులైన యువతుల హస్తములను
బంధించఁగాఁ గలుఁగు శుభము
మఱియి మాగ్ం రుద్రవర మంత్ర బలముచే
గోష్ఠ మధ్యంబునఁ న్గూర్చి యగ్నిఁ
బదివేల వెలగలఁ బదిలంబుగా వేల్చఁ
బశుల కెల్లను సౌఖ్యఫలముగూడు
మఱి నమస్తంపు రుద్రుమై మహిమఁ గాంచు
నట్టి మంత్రాన హోమించ నధిక శుభము
అంతపై మంత్రములకు నగ్రాంత విష్ణు
వాది చమకంపు మంత్రాళులౌను గూర్చ.

చ॥ అనయము నొక్క యావృతము నంచితరీతిఁగఁ దానమించఁగా
మనుజున కెల్ల కీడులును మాయునుబో నతఁ డెప్డు దుఃఖముల్

గనఁడు నమస్తె రుద్ర మనగా యనువాక మొకండుఁ జెప్పిపైఁ
గనవలె నన్న విష్ణు వనగాఁ జమకంబున నొక్కసూత్రమున్.

గీ॥ ఇట్లు పదియొక్క మాఱులై యొసఁగు నమక
మునకుఁ బదియొక్క సారులుఁ గనుచుఁ జమక
సూత్రమును గూర్చి యభిషేక శుభముఁ గూర్చ
నతఁడు యమలోక మనుమాట శ్రుతుల వినఁడు.

గీ॥ ఇట్లు పదియొక్క మారులై యొసఁగుదాని
పదియొకండుగ గుణియించఁ బరగుసిద్ధి
నతఁడుఁ గాంచును భూలోకమందు సౌఖ్య
ములను వాఁ డింకఁ గైలాస మూర్తిఁ గాంచు.

గీ॥ ఆమహా రుద్రమును గూడ నట్లె బదునొ
కొండు సార్లుగ గుణియించ గొప్ప బ్రహ్మ
రుద్రమగు దాన శాశ్విత రుద్రలోక
వాస మబ్బును నట మోక్షవర్తియౌను.

సీ॥ పూజ్యులారా యిద్ధి పూర్తియైనది దీని
ఘనసార ఫలితమున్ మనవిఁజేతు
నెన్నెన్నొ మంత్రాల నెంతెంతొ జపియించ
నెంతెంతొ హోమించ నెన్నొ విధుల
నా యా ప్రయోగాదు లనుసంధితము సేయ
నౌనంచు రూపించ నైనవెల్ల
శక్తిఁ జాలనివారు సరగ నీ గ్రంథంబు
పఠియించిన న్వినిన భక్తితోడ
నంత ఫలితంబు సమకూర్చు నంతమందు
నభవు దూతలు వారి బ్రత్యక్షమౌచు
బూని రుద్రాంకమౌ మహాయాన సుఖులఁ
జేసి గొనిపోదురింక గైలాసమునకు.

సీ॥ విరివిగా శార్దూల విక్రీడితంబుగా
కాంద్రు కాంద్రున రేగి గర్జిలుచును
ఘన మదేభపు వృత్తిగా విరూపంబనై

ఘీంకరింపుచు మహా కేళిఁజూపి
చంప కోత్పలమాల లింపొందినట్లుగా
ఘుమ ఘుమాఘ్రాణముల్ గూర్చియింక
ఆటవెలదులు వేడ్క నాటలాడినరీతి
వరహావభావ సంపదల నింపి
యింక నెన్నొన్ని సద్వృత్తులెసఁగఁ జేసి
భక్త సులభవు నీవన్న ఘటితి నించి
భూరి నీశక్తి నాయందు పొందుపఱచి
తీరమును జేర్చినావు పోలేరు తల్లి.

శా॥ రక్తంపుం బటువైన లేదు మది ధీరత్వంబు శూన్యంబునా
సక్తిన్గాంచఁడు సాధు మార్గమును సంసారంబులోఁ జిక్కియే
యుక్తా యుక్త విచక్షణన్గనఁడు వీడోయంచు నన్వీడకీ
భక్తిన్నే నిడునట్టి బల్ నమకమౌ పద్యంబులఁ న్గాంచి నీ
ముక్తి ద్వారపు తల్పుఁదీయగదె ఛాముండా జగజ్జీవనా!

T.T.D. Religious Publications Series No.
Price Rs

ధర్మాన్ని కాపాడండి. ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు

